


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




గురువారం | 5-3-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 320 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి మ. 1.20 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆరుద్ర ఉ. 11.27 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 11.03-12.35; దుర్ముహూర్తం: ఉ. 10.30-11.17, మ. 3.12-3.59; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



### ● సినిమా బంద్?

కరోనాపై చర్చించేందుకు గురువారం హైదరాబాద్‌లో ఫిల్మ్ చాంబర్ సమావేశం జరగబోతోంది. సినిమా షూటింగులు, థియేటర్ల బంద్ నిర్ణయాలేమైనా తీసుకుంటారా అనే సందేహాలు వినిపిస్తున్నాయి.



### ● ఆహాకారం..

రెస్టారెంట్లలో ఆహారం అమ్మకాలు తగ్గాయి. ప్రత్యేకించి నాన్‌వెజ్ అమ్మకాలు బాగా పడిపోయాయి. ఫుడ్ డెలివరీ యాప్స్‌లో ఆర్డర్లు, వీధుల్లో నాన్‌వెజ్ స్నాక్స్ కొనుగోళ్లు తగ్గినట్లు సమాచారం.



### ● ఊదక తప్పదు..

కరోనా వల్ల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆగిపోతాయని సంబరపడే మందుబాబులకు దుర్వార్త. తనిఖీలు ఆగవని.. కాకపోతే ఎవరికి వారికే విడిగా స్ట్రాలు వాడతామని తెలంగాణ పోలీసులు చెప్పారు.



### ● చైనా కాస్త నయం..

పుట్టినిల్లు చైనాలో కరోనా కాస్త తగ్గుముఖం పట్టింది. తాజాగా కేవలం 119 కేసులు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం చైనాలో 20% కరోనా కేసులే ఉన్నాయని, 80% ఇతర దేశాల్లో ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది.



### ● తక్షణ చర్యలు..

కరోనా వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సభలు, సమావేశాలకు ఇచ్చిన అనుమతుల్ని పునఃసమీక్షించాలని టీ-హైకోర్టు ఆదేశించింది. అండర్ ట్రయల్స్‌ను విచారణకు హాజరు పరచవద్దంది.

# అమ్మో కరోనా

## దేశంలో 29 మందికి పాజిటివ్

## హైదరాబాద్‌లో 47 మందికి పరీక్షలు

## ఏపీలో 11 మందికి వైద్య పరీక్షలు



తెలంగాణలోని మహబూబాబాద్‌లో ఓ ప్రైవేటు పాఠశాలలో దృశ్యం

- హైదరాబాద్ బాధితుడి ఇంట్లో పనిచేసిన మహిళకు కూడా కరోనా సోకిన లక్షణాలు?
- ఆమె ఆచూకీ కోసం అధికారుల అన్వేషణ
- కౌలాలంపూర్, లండన్ నగరాల నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులకు వైరస్ సోకినట్టు అనుమానం
- ఎయిర్‌పోర్టు నుంచి గాంధీకి తరలింపు?
- గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డు ఫుల్
- అంతర్జాతీయ ప్రయాణికులందరికీ 'స్ర్కీనింగ్'
- దేశంలో మరో 19 ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు
- ఢిల్లీ బాధితుడి బంధువులు ఆరుగురికి, 16 మంది ఇటలీ పర్యాటకులకు, డ్రైవర్‌కు వ్యాధి
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ వెల్లడి
- ఏపీ ఐసోలేషన్ వార్డుల్లో కొత్తగా 200 పడకలు
- రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో స్ర్కీనింగ్
- తిరుపతిలో వీఆర్‌డీఎల్ ల్యాబ్ ఏర్పాటు
- సోమవారం నుంచి అందుబాటులోకి!

కరోనా వైరస్.. అక్కడెక్కడో చైనాలో ఉంది కదా. ఇక్కడిదాకా రాలేదు కదా.. అనుకున్నంతసేపు పట్టలేదు! దావానలంలా అన్నిదేశాలనూ చుట్టేసి.. భారత్‌లోకి కూడా అడుగుపెట్టిన ఆ వైరస్ తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో గుబులు రేపుతోంది!! ఇప్పటికే ఒక హైదరాబాదీకి వైరస్ సోకిన నేపథ్యంలో.. హైదరాబాద్ నగరం వణికిపోతోంది. బాధితుడితో సన్నిహితంగా మెలిగిన 47 మందిలో 45 మందికి కరోనా నెగెటివ్ రావడం ఊరట. మిగతా ఇద్దరి ఫలితాలు గురువారం రానున్నాయి. విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన మరో ఇద్దరికి వైరస్ సోకినట్టు సమాచారం. ఇక మన రాష్ట్రంలోనూ ఒకేరోజు 11 మంది అనుమానిత లక్షణాలతో వివిధ ఆస్పత్రుల్లో చేరారు. దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 29కి చేరింది!

## బడిలో దడ

- హైదరాబాద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- జ్వరం, జలుబు ఉంటే పంపించొద్దంటున్న యాజమాన్యాలు
- శుభ్రత పాటించాలని, మాస్కులు ధరించాలని సూచన
- ఇంటర్ పరీక్షలకు మాస్కులకు అనుమతి

## ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో.. ఉచితంగా చికిత్స

- తెలంగాణలోని 22 కాలేజీల్లో 1080 ఐసోలేషన్ బెడ్స్
- నేటి నుంచి కమాండ్ కంట్రోల్ కేంద్రం ప్రారంభం

10
11

## ఐటీ కలకలం

- మా ఉద్యోగినికి కరోనా అంటూ డీఎస్ఎం సంస్థ ప్రకటన
- రహేజా సెజ్‌లో అలజడి.. ఉద్యోగుల్ని ఇళ్లకు పంపిన సంస్థలు
- ఆఫీసులు వీడిన 11వేల మంది.. 'వర్క్ ఫ్రమ్ హోం' ఆదేశాలు
- మా అనుమతి లేకుండా 'వర్క్ ఫ్రమ్ హోం' ఇవ్వొద్దు
- ఐటీ కంపెనీలు ఖాళీ కాలేదు.. శుభ్రపరుస్తున్నారంతే
- నేటి నుంచి పని యథాతథం: జయేశ్ రంజన్
- ఐటీ కారిడార్ నోడల్ అధికారిగా సీపీ సజ్జనార్
- వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు.. సైబర్ క్రైం నిఘా




సినిమా షూటింగ్ కోసం ఐరోపా వెళ్తున్న నటుడు ప్రభాస్ బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇలా మాస్కుతో కనిపించారు. అయినా గుర్తుపట్టిన కొందరు అభిమానులు ఆయనను చూసేందుకు ఎగబడ్డారు.

## వ్యాధి వస్తేనే ఎన్-95 మాస్క్

- మిగతా వాళ్లకు అవసరం లేదు
- అంతగా అయితే చేతి రుమాలు చాలు
- 'శ్వాస' ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విష్ణున్‌రావు
- అమాంతం పెరిగిన మాస్క్‌ల ధర
- ఎన్-95 ధర రూ.150 నుంచి రూ.400కు

ఏపీలోనూ మాస్కులకు కొరత?

### కరోనా జలుబు భిన్నమైనది

- జ్వరం, దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉంటాయి
- ముక్కు కారడం, తుమ్ములు తక్కువే



మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్, మంత్రులు, అధికారులు

# ఒడితే ఇంటికే!

## మంత్రులు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా ఇవ్వాలి: సీఎం

- ఎమ్మెల్యేలకు ఈసారి టికెట్ దొరకదు
- 'స్థానికం'లో ఎవర్నీ ఉపేక్షించేది లేదు
- 90శాతం స్థానికసంస్థలు గెలవాల్సిందే
- ఇప్పటినుంచే మీ ప్రాంతాలకు వెళ్లండి
- మనం డబ్బులివ్వొద్దు ..విపక్షాలకీ చెక్
- తేడా జరిగితే ఎస్పీలకు స్థానచలనమే
- మేయర్ అభ్యర్థుల్ని ముందే చెప్పొద్దు
- వీలైనంతగా ఏకగ్రీవాలు చేయించండి
- కేబినెట్‌లో మంత్రులకు సీఎం స్పష్టీకరణ



9

"స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఓటమి పాలైతే, అందుకు బాధ్యులైన మంత్రులు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి తమ రాజీనామా పత్రాలను గవర్నర్‌కు అందజేయాల్సి ఉంటుంది. నియోజకవర్గాల పరిధిలో ఓటమికి సంబంధిత శాసనసభ్యులు బాధ్యత వహించాలి. వారు తమ రాజకీయ భవిష్యత్తును కోల్పోవాల్సిందే. వచ్చే ఎన్నికల్లో వారికి వైసీపీ టికెట్ రాదు. పదవులపై ఆశలు వదులుకోవాల్సిందే. ఈ విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు"

\- సీఎం జగన్

# 'సగం'తోనే సై

## స్థానిక ఎన్నికల్లో 50 శాతమే కోటా

## హైకోర్టు తీర్పు ఆధారంగా ఉత్తర్వులు

- సవరణ లేకుండానే బీసీ కోటాకు కోత
- నెలాఖరులోపు ఎన్నికల పూర్తి లక్ష్యం
- రంగంలోకి అధికార యంత్రాంగం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వరుస భేటీలు
- ఒకటిరెండు రోజుల్లో జిల్లాల్లో నోటిఫై
- ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికల తేదీలు
- 34% బీసీ కోటాపై తక్షణమే సుప్రీంకు!
- ప్రభుత్వం తరపున ఎస్ఎల్‌పీ వేయండి
- పూర్తి మద్దతిస్తాం. సీఎంకు బాబు లేఖ

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'స్థానిక నగారా మోగించేందుకు రంగం సిద్ధమైంది. హైకోర్టు తీర్పు మేరకు... 50 శాతం కోటాతోనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలన్న విపక్షాలు, బీసీ సంఘాల డిమాండ్లను పక్కనపెట్టేసింది. ఈ నెలాఖరులోపే ప్రక్రియ ముగించేందుకు వీలుగా కసరత్తు మొదలైంది. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలకు అనుగుణంగా... పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల ముఖ్య కార్యదర్శులు ద్వివేది, శ్యామలరావుతోపాటు ఆ రెండు శాఖల కమిషనర్లు గిరిజా శంకర్, విజయ్‌కుమార్ బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ నెల 2న స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే పంచాయతీ రాజ్ శాఖ రెండు రహస్య (కాన్ఫిడెన్షియల్) జీవోలను

మిగతా 2వ పేజీలో...

## ఎన్పీఆర్ నిలిపివేత

- పాత ప్రశ్నలతోనే జన నమోదు
- అలాచేసేదాకా ఇక్కడ చేపట్టం
- మంత్రివర్గంలో కీలక నిర్ణయం
- జీఎంఆర్‌కే 'భోగాపురం' పనులు
- 'రాజధాని'పై సిట్‌కు అంగీకారం
- ఉగాదికి 26 లక్షల స్థల పట్టాలు

9

## ఒకరి వద్ద తీసుకొని మరొకరికిస్తారా?



- అసైన్డ్‌లోకి పోలీసుల్ని ఎందుకు పంపారు?
- డీజీపీ వస్తున్నారుగా ఆయన్నే అడుగుతాం
- పేదలకు స్థలాలపై హైకోర్టు స్పష్టీకరణ

## భూములు లాక్కున్నారని మహిళ ఆత్మహత్య

వైసీపీ నాయకులపై కుటుంబీకుల ఆరోపణలు

2

## మీకు జీతాలొస్తున్నాయ్‌గా.. మీ వాళ్లకు పింఛన్లెందుకు?

వలంటీర్ల కుటుంబీకులకు 2 నెలలుగా పెన్షన్లు కట్



మాన్సాస్ చైర్‌పర్సన్‌గా సంతకం చేస్తున్న సంచయిత

## అశోక్ గజపతిరాజుపై వేటు!

3

- అప్పన్న ఆలయంపై సర్కారు పట్టు.. చైర్‌పర్సన్‌గా ఆనంద గజపతి కుమార్తె.. రహస్య ఉత్తర్వులు
- మాన్సాస్ ట్రస్టు చైర్మన్‌గానూ అశోక్ తొలగింపు.. పురుష వారసులకే పదవి దక్కాలన్న నిబంధన
- చైర్మన్‌ను నేరుగా నియమించడమూ తప్పే.. పాలక మండలి సభ్యులే ఎన్నుకోవాలి
- కొత్త సభ్యులు ప్రమాణమే చేయలేదు.. ఈలోపే సంచయిత ప్రమాణ స్వీకారం
- ప్రభుత్వ ఆదేశాల ప్రకారమేనన్న ఈవో.. వెబ్‌సైట్లో కనిపించని రెండు ఉత్తర్వులు

## డిగ్రీ విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

స్నేహితుణ్ని కొట్టి అఘాయిత్యం

3




'నదీమ తల్లి' అంటూ నమస్కారాలు పెడుతున్నాం! పరమం.. పవిత్రం... అంటూ మూడు మునకలేస్తున్నాం! పొలాలకు తరలిస్తూ పంటలు పండిస్తున్నాం. కృష్ణమ్మ లేకుంటే... తెలుగు రాష్ట్రాల్లో తాగు-సాగు అవసరాలకు అల్లాడాల్సిందే! మరి... ఆ నదిని ఎలా చూసుకోవాలి? ఎంత 'శుభ్రం'గా కాపాడుకోవాలి? కానీ... మన జనం ఏం చేస్తున్నారు? వరుస ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? తెలుసుకోవాలనుకుంటున్నారా?

# మురుగు.. పరుగు!



హే.. కృష్ణా

కర్నూలు నగరంలో తుంగభద్రలో కలుస్తున్న డ్రైనేజీ నీరు

### వ్యర్థ జలాలతో కృష్ణ కలుషితం

- కర్నూలు జిల్లాలో కనిపించని యూజీడీ
- శుద్ధి చేయని మురుగు నేరుగా నదిలోకి
- కర్నూలు సిటీ నుంచే రోజూ 5 కోట్ల లీటర్లు
- శ్రీశైలం జలాశయంలో కలుషిత జలం
- తెలుగుగంగ జలాల్లో నంద్యాల డ్రైనేజీ
- ఆదోనిలో మురుగు నీరే సాగు నీరు
- యూజీడీ ఏర్పాటులో ప్రభుత్వాలు విఫలం
- సుప్రీం ఆదేశాలూ బేఖాతరు

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం వెళ్లారా? పవిత్ర పాతాళ గంగలో స్నానం చేశారా? ఒక్కసారైనా చేసే ఉంటారు! కానీ... ఈ జలాశయంలోకి కర్నూలు జిల్లా నుంచే కోట్ల లీటర్ల మురుగు నీరు నేరుగా వచ్చి చేరుతోందని తెలుసా? ఇది అక్షరాలా నిజం! డివిజన్ కేంద్రాలైన ఆదోని, నంద్యాలతోపాటు జిల్లా కేంద్రం కర్నూలు నగరంలో ఎక్కడా భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) వ్యవస్థ లేదు. ఇళ్ల నుంచి మురుగు నీరు నేరుగా డ్రైనేజీ కాల్వల్లోకి... ఆపై తుంగభద్రలోకి, చివరిగా కృష్ణా నదిలోకి వచ్చి చేరుతోంది. అదే నీరు శ్రీశైలం జలాశయందాకా వచ్చి ఆగుతోంది. ఒక్క కర్నూలు నగరం నుంచే రోజుకు సుమారు 5 కోట్ల లీటర్ల మురుగు నీరు తుంగభద్ర నది ద్వారా కృష్ణా నదిలోకి చేరుతోంది. శ్రీశైలం జలాశయం దాటిన తర్వాత నాగార్జున సాగర్, పులిచింతలదాటి విజయవాడలో ప్రకాశం బ్యారేజీ వరకు... లక్షలాది హెక్టార్లకు సాగునీరు, కోట్లాది జనాభాకు

మిగతా 2వ పేజీలో...



పరంజ్యోతి

# మధురాధిపతే అఖిలం మధురం



*వస్తూని కోటి శస్సంతు పావనాని మహీతలే*
*నతాని తత్తులాం యాంతి కృష్ణ నామానుకీర్తనే*

భూమ్మీద ఉన్న కోట్లాది పవిత్రమైన వస్తువులన్నింటినీ కలిపినా అవి శ్రీ కృష్ణనామ సంకీర్తనకు సాటిరావని కూర్మపురాణం చెబుతుంది. కలియుగంలో శ్రీకృష్ణుడు నామరూపంలో అవతరించాడు. నామం తప్ప కలికాలంలో వేరొక ధర్మం లేదని, నామం సర్వమంత్ర సారమని, ఇదే శాస్త్ర రహస్యమని 'చైతన్య మహా ప్రభువు' పలికారు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయాలనే పంచకోశాలు మనకు ఉన్నాయి. వీటిలో ప్రాణమయ కోశాభిమానికి నామమే సాధనం. నామం మీద, నామి యందు కలిగిన శ్రద్ధకే 'భక్తి' అని పేరు. అదే భక్తి యోగం. 'శ్రీకృష్ణునకు, ఆయన నామానికి అభేదం. శ్రీకృష్ణుని పేరు పలకడం వల్ల ప్రేమ కలుగుతుంది. ఆ ప్రేమయే శ్రీకృష్ణుని నీ వద్దకు తెస్తుంది' అని 'ఉపదేశామృతం' గ్రంథం చెబుతోంది.

*తత్కీర్తన ధ్వనింశ్రుత్వా సర్వాణి పాతకానిచ*
*దూరాదేవ పలాయంతే వైనతేయ మివోరగాః*

గరుత్మంతునిగాంచి పాములు పారిపోయినట్లు.. శ్రీకృష్ణ కీర్తన శబ్దాన్ని వినగానే సమస్త పాపాలూ పారిపోతాయని 'నారద పాంచరాత్రం' బోధిస్తోంది. పరమాత్మను సదా స్మరించువానికి సకల పురుషార్థం హస్తగతం అవుతుంది. 'నరుడిగా పుట్టి భూమిపై చరించిన నారాయణుడే శ్రీ కృష్ణుడు. ఆయనే పురుషోత్తముడు. నరులలో ఉత్తముడు. అట్టి నరోత్తముడైన శ్రీకృష్ణ దేవునికి నమస్కారం. నారాయణ మంత్రం భయంకరమైన సంసార విషాన్ని హరిస్తుంది' అని 'నారసింహ పురాణ వచనం'. ఇంద్రియాలు శాశ్వత ముక్తిప్రదుడైన శ్రీకృష్ణుని వైపు మరలక.. అశుభ ప్రదములు, క్షణికములు అయిన ఇతర విషయాల వైపు మళ్లడం దురదృష్టకరమని 'ప్రబోధ సుధాకరము'నందు శంకర భగవత్పాదులు తెలిపారు.

'అధరం మధురం వదనం మధురం, నయనం మధురం హసితం మధురం, హృదయం మధురం గమనం మధురం, మధురాధి పతే అఖిలం మధురం' అని ఆ వల్లభాచార్యులు తన 'మధురాష్టకమ్'లో శ్రీకృష్ణుని కీర్తించారు. కృష్ణుడంతా తియ్యదనమేనని కొనియాడారు. 'అన్నిటికిది పరమౌషధము, వెన్నునినామమే విమలౌషధమ'ని.. శ్రీకృష్ణ నామామృత పానమే భవరోగమును రూపు మాపే దివ్యౌషధమని అన్నమాచార్యులు తన కీర్తనలో గానం చేశారు. సాధనలన్నింటిలోనూ నామసంకీర్తన అతి సులభమైనది. దాని వలన జన్మాంతర పాపాలు దహింపబడతాయి. కలియుగంలో ఎందరో భక్తులు నామ సంకీర్తనంతో తరించారు.

**- మేఘశ్యామ (ఈమని) 8332931376**

## మీకు జీతాలొస్తున్నాయ్‌గా.. మీ వాళ్లకు పింఛన్లెందుకు?

- వలంటీర్ల కుటుంబీకులకు 2 నెలలుగా పెన్షన్లు కట్
- రాజధాని గ్రామాల్లో గగ్గోలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లలో అత్యధికులు సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. 'గౌరవ వేతనంగా మీరు నెలకు రూ.5,000 చొప్పున పొందుతున్నారు కదా.. ఇక, మీ కుటుంబాలకు రాజధాని పేదలకు ఇచ్చే 'కుటుంబ పింఛన్లు' ఎందుకు?' అని ఏపీసీఆర్‌డీఏ ప్రశ్నించడమే కాకుండా గత 2 నెలలుగా పెన్షన్లను నిలిపివేసింది. దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆవేదన చెందుతున్నాయి. అమరావతి కోసం 29 గ్రామాల్లో సుమారు 34,000 ఎకరాల భూములను రైతులు గత ప్రభుత్వానికి ఇచ్చారు. దీంతో సేద్యం నిలిచిపోయి, వారంతా జీవనోపాధి కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు ఏపీసీఆర్డీఏ నెలకు రూ.2,500 చొప్పున నాలుగేళ్లుగా పింఛన్లు ఇస్తోంది. అయితే, గతేడాది అక్టోబరులో ప్రారంభమైన గ్రామ సచివాలయ వ్యవస్థలో రాజధాని గ్రామాలకు చెందిన సుమారు వెయ్యిమందికిపైగా యువతీ యువకులు వలంటీర్లుగా చేరారు. వీరికి గౌరవ వేతనం కింద నెలకు రూ.5,000 ఇస్తున్నారు. గ్రామ వలంటీర్లకు చెందిన కుటుంబాలకు కూడా సీఆర్‌డీఏ రూ.2,500 పింఛన్‌ను ఇస్తోంది. అయితే, గత రెండు నెలలుగా సీఆర్‌డీఏ వీటిని నిలిపివేసింది. ఇదేంటని ప్రశ్నించగా పింఛన్ల రూపంలో ఇస్తున్న మొత్తానికి రెట్టింపు మొత్తం మీ కుటుంబాలకే చెందిన వలంటీర్లు వేతనంగా పొందుతున్నారని చెప్పారు. దీంతో ఆయా కుటుంబాల వారు ఇది తగదని అంటున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ పోస్టుల నుంచి తప్పుకుంటామని యువత చెబుతున్నారు. ఇదే విషయాన్ని సీఆర్డీయే అధికారులకు తెలిపేందుకు బుధవారం విజయవాడలోని కార్యాలయానికి వచ్చారు. అయితే, వారికి అధికారుల నుంచి ఊరట లభించలేదని తెలిసింది.

# మురుగు.. పరుగు!

(మొదటి పేజీ తరువాయి)

తాగునీరు అందిస్తున్న కృష్ణా నది ఇలా కలుషితమవుతోంది.

### ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు?

పట్టణాల నుంచి విడుదలయ్యే డ్రైనేజీ నీళ్లను శుద్ధి చేయకుండా నేరుగా నదుల్లోకి వదలకూడదని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలున్నాయి. అయినప్పటికీ... ప్రజల ఇళ్లు, మురుగు దొడ్ల నుంచి విడుదలవుతున్న మురుగు నీళ్లను నేరుగా నదుల పాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం... మునిసిపాలిటీ, కార్పొరేషన్ల పరిధుల్లోని నివాసాల ద్వారా నిత్యం విడుదలయ్యే డ్రైనేజీ నీళ్లను భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ ద్వారా సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీ)లోకి మళ్లించాలి. అక్కడ పలు దశల్లో ఈ నీటిని శుద్ధి చేసి 50% పైగా మంచి నీటిని వేరు చేయాలి. అలా శుద్ధి చేసిన నీళ్లను డ్రైనేజీ సంపుల ద్వారా పొలాలకు సాగు నీరుగా మళ్లించి, మిగిలిన నీటిని నదుల్లోకి వదిలేయాలి. దీనివల్ల సాగు నీటి సమస్య తీరడమే గాక, తద్వారా తాగు నీటిని పంటలకు వాడకం తగ్గించే అవకాశమూ ఉంది. కానీ... కర్నూలు జిల్లాలో యూజీడీ వ్యవస్థ లేని కారణంగా నేరుగా నివాసాల నుంచి వచ్చే డ్రైనేజీ నీళ్లను నదుల్లోకి వదిలేస్తున్నారు. వర్షం, వరద నీటి పారుదలకు మాత్రమే ఉపయోగించాల్సిన కాల్వలను ఈ డ్రైనేజీ నీళ్ల పారుదలకు ఉపయోగిస్తున్నారు. న్యాయ రాజధానిగా కర్నూలును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరుణంలోనూ యూజీడీపై అక్కడి ప్రజలకు కనీస అవగాహన కల్పించడంలో జిల్లా యంత్రాంగ విఫలమైంది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేశాకే తాగు నీరుగా మార్చుకోవాల్సి ఉన్నా, నేరుగా డ్యామ్‌కు డ్రైనేజీ నీరు వెళ్తుండటంతో క్రింది ప్రాంతాలపై నిర్వహణ భారం అధికమవుతోంది.

### ప్రభుత్వం దయ తలిస్తేనే..

సుప్రీంకోర్టు ఆదేశాలతో అందుబాటులోకి వచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం నదీ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీళ్లను నేరుగా నదుల్లోకి వదలకూడదు. ఈ ఆదేశాల మేరకు గత ప్రభుత్వంలో పలు ప్రధాన నగరాల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఫలితంగా కర్నూల్లోనూ 2.4 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ఎస్టీపీలను మొక్కుబడిగా ప్రారంభించారు. 5 కోట్ల లీటర్ల డ్రైనేజీ నీళ్లు ఉత్పత్తవుతోన్న కర్నూల్లో ఈ ఎస్టీపీల ద్వారా 24 లక్షల లీటర్లు మాత్రమే శుద్ధి చేస్తున్నారు. తక్కిన నీళ్లన్నీ నేరుగా తుంగభద్ర నుంచి శ్రీశైలం డ్యాంకు చేరిపోతున్నాయి. నగరానికి మరో 56 ఎంఎల్‌డీ ఎస్టీపీల అవసరముంది. ఒక్క కర్నూల్లో యూజీడీ వ్యవస్థ ఏర్పాటుకే రూ.1600 కోట్లు కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దయ తలిస్తేనేమార్పు వస్తుంది.



నంద్యాల ప్రజలు వాడిన నీరు ఇలా నేరుగా కుందూ నదిలో కలుస్తోంది

### 'న్యాయ రాజధాని' ఇలా...

కర్నూలు ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని. రాయలసీమకు ముఖద్వారం. ఇప్పుడు... 'న్యాయ రాజధాని' అనే కొత్త కబురు వినిపిస్తోంది. ఇంతటి ప్రాధాన్యమున్న కర్నూలుకు యూజీడీ వ్యవస్థ ఏర్పాటులో రాజకీయ, అధికార వ్యవస్థలు విఫలమయ్యాయి. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో రూ.250 కోట్లతో యూజీడీ ప్రతిపాదనలను 1984లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. అవి నేటికీ చెల్లని కాగితాల్లా మిగిలిపోయాయి. అనంతరం స్మార్ట్ సిటీ ప్రతిపాదనలో భాగంగా 2016-17లో రూ.400 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం అంగీకరించినా, నిధులు మంజూరుకాక అది కూడా అటకెక్కింది. వెరసి.. నగర జనాభా వాడుతున్న మురుగు, వ్యర్థాల నీళ్లన్నీ మురుగు కాలువల గుండా హంద్రీ, తుంగభద్ర, కేసీ కాలువల ద్వారా శ్రీశైలం డ్యామ్‌లోకి చేరుతున్నాయి.

### తెలుగుగంగకూ మురుగు

నంద్యాలలో 40,279 నివాసాలున్నాయి. వాటిలో ఒక్క ఇంటికీ యూజీడీ కనెక్షన్లు లేవు. నివాసాల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ కుందూ నదిలోకి.. అక్కడి నుంచి తెలుగు గంగ ద్వారా చెన్నైకి చేరుతున్నాయి. గత కాంగ్రెస్ హయాంలో రూ.100 కోట్లతో యూజీడీ పనులు చేపట్టారు. వైఎస్ మరణానంతరం ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

### ఆదోనిలో పంటల సాగుకు..

ఆదోని మునిసిపాలిటీ పరిధిలో విడుదలవుతున్న మురుగునీటితో పరిసర ప్రాంత రైతులు పంటలు పండించుకుంటున్నారు. ఆదోని పట్టణంలో యూజీడీ ఏర్పాటుకు 2010లో ప్రయత్నించినా, భూసారం సరిగా లేదన్న కారణంగా ఆ ప్రయత్నాలను ఆదిలోనే విరమించుకోవాల్సి వచ్చింది.




ఎమ్మెల్యేలు హోటల్‌లో ఉండటానికి కరోనానే కారణం.. మాకు సంబంధం లేదు.. ఇది కాంగ్రెస్ కుట్ర..

## ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 37.0 | 23.0 |
| హైదరాబాద్ | 35.1 | 21.4 |
| గుంటూరు | 34.6 | 20.4 |
| నెల్లూరు | 34.1 | 24.6 |
| ఒంగోలు | 33.7 | 23.6 |
| విశాఖపట్నం | 32.6 | 21.0 |

### పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం ఎండ తీవ్రత పెరిగింది. ఆకాశం నిర్మలంగా వుండడంతో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. కర్నూలులో 37, అనంతపురంలో 36, గన్నవరంలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా విదర్భ నుంచి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ తీరం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. మరో వైపు తూర్పు, ఆగ్నేయ దిశలుగా గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో యానాం సహా రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.



### రాహుల్‌ను క్వారంటైన్‌లో ఉంచాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఇటలీ వెళ్ళొచ్చారు. విమానాశ్రయంలో పరీక్షించారో.. లేదో తెలీదు. ఐరోపాలోని ఇతర దేశాల కంటే ఇటలీలో కరోనా వైరస్ ఎక్కువగా ఉంది. అందువల్ల ఆయనకు వైద్య పరీక్షలు చేయాలి. క్వారంటైన్‌లో ఉంచాలి.

**- బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి**



### పత్రికలకు రాజ్యాంగ రక్ష

పత్రికా సంస్థలు, పాత్రికేయులపై దాడులు నానాటికీ పెరిగిపోతున్నాయి. పత్రికా స్వేచ్ఛ కోసం కేంద్రం రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించాలి. ఇది రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం కాదు. కేంద్రానికి సంబంధించినది. అందుకే దీనిపై రాజ్యాంగ సవరణ తీసుకురావాలి. ఇది కేంద్రం బాధ్యత.

**- పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి**

### ప్రతీకారేచ్ఛను పెంచే 'లవ్ హార్మోన్'

బీజింగ్, మార్చి 4 : ఎవరైనా మీపై/మీవాళ్లపై దాడి చేస్తే.. దూషిస్తే పట్టరాని కోపం వస్తుంది. దాడి చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని రగిలిపోతారు. మానవ మాత్రులందరిలోనూ ఇది సహజ పరిణామం. కోపం సంగతి సరే.. ఇంతకీ 'ప్రతీకారేచ్ఛ ఎందుకు రగులుతుంది?' అనే ప్రశ్నకు సమాధానాన్ని కనుగొనేందుకు చైనాలోని పెకింగ్ వర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. దాడులు, దూషణలు ఎదుర్కొన్న సందర్భాల్లో మెదడులోని హైపోథాలమస్ ప్రాంతం లవ్ హార్మోన్‌గా పేరొందిన ఆక్సిటోసిన్‌ను ఎక్కువ మోతాదులో విడుదల చేస్తుంది. ఫలితంగా తన సమూహం వారిపై ప్రేమభావం అమాంతం పెరిగి, వారికి అపాయం కలుగజేస్తున్న ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవాలనే కాంక్ష జ్వలిస్తుంది.

### నారింజతో ఊబకాయానికి చెక్

టొరంటో, మార్చి 4 : ఊబకాయం తగ్గాలంటే రోజూ రెండున్నర గ్లాసుల నారింజ రసం తాగాలని కెనడాలోని వెస్టర్న్ అంటారియో వర్సిటీ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కమలాపండ్ల పైతొక్కల్లో నోబిలెటిన్ అనే ఫ్లేవొనాయిడ్ సమ్మేళనం ఉంటుంది. మనం తొక్కలను తీసివేసిన తర్వాత కూడా.. నారింజ తొనలపై నోబిలెటిన్ అవశేషాలు మిగిలే ఉంటాయి. నారింజ రసం ద్వారా ఇవి శరీరంలోకి ప్రవేశించి ధమనుల గోడల్లోని కొవ్వు ఫలకాలను కరిగిస్తాయని, ఫలితంగా ఊబకాయం ముప్పు తగ్గుతుందని ఎలుకలపై జరిపిన ప్రయోగపరీక్షల్లో వెల్లడైంది. మధుమేహం, హృద్రోగాల కట్టడికీ నారింజ రసం గొప్ప ఔషధంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



విజయవాడ సిద్ధార్థ కాలేజీ వద్ద పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 96.14% హాజరు.. 3 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 1411 సెంటర్లలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కు 5,42,202(96.14%) మంది హాజరయ్యారు. మూడు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 ప్రశ్నపత్రానికి సంబంధించి సెట్-2ని ఎంపిక చేశారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్‌బోర్డు వర్గాలు తెలిపాయి. గురువారం నుంచి సెకండియర్ పరీక్షలు మొదలవుతాయి.

### ఇంటర్ ప్రశ్నపత్రాలు తారుమారు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో సంస్కృతం విద్యార్థులకు తెలుగు ప్రశ్నపత్రాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల అభ్యర్థనతో కోరుకున్న ప్రశ్నపత్రాలనే అందజేశారు. దరఖాస్తులో సబ్జెక్టు నమోదు తప్పుగా చేయడంవల్లే ప్రశ్నపత్రాలు తారుమారయ్యాయని అధికారులు చెప్పారు. కాగా, విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని కొట్టు, మాదలంగి, పొదుము, కెమ్మిల పంచాయతీల నుంచి విద్యార్థులు నాగావళి నది దాటి వచ్చి పరీక్షలు రాశారు. వీరికి కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష క్షేంద్రాన్ని కేటాయించారు. కాగా, శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో అటెండర్లు లేక... గంట కొట్టడం, బెంచీలు సరిపోకపోతే ఒక గది నుంచి మరో గదికి వాటిని మోసే పనిని డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లే చేశారు. పరీక్ష కేంద్రాల్లో అటెండర్లు ఉండకూడదనే నిబంధనతో ఈ పరిస్థితి ఏర్పడింది.

### నేటి నుంచి డీఏవో, ఎఫ్ఆర్‌వో మెయిన్స్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19-20 తేదీల్లో జరగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్(డీఏవో), 17 నుంచి జరగనున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్(ఎఫ్ఆర్‌వో) మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్లు గురువారం నుంచి జ్జిఇఱ//ఇఱ్భిఇఃజొరి.జీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఏపీపీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

### 'ఆన్‌లైన్'లో ఇంటర్ అడ్మిషన్లు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. 2020-21 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమలు కానుంది. ఈ-అడ్మిషన్లకు సంబంధించి మే-జూన్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. ఈ సమాచారాన్ని అన్ని కాలేజీల మేనేజ్‌మెంట్లకు తెలియజేస్తారు.

### బస్టాండ్‌లోకి ప్రైవేటు బస్సులు రానివ్వం: నాని

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉనికికి ఎలాంటి ప్రమాదం లేదని, ప్రైవేటు బస్సులను బస్టాండ్లలోకి రానివ్వబోమని, రూట్ పర్మిట్ లేకుండా పల్లెవెలుగు రూట్లను ఎవ్వరూ ఆక్రమించలేరని రవాణాశాఖ మంత్రి పేర్ని నాని పీటీడీ జేఏసీ నేతలకు చెప్పారు. బుధవారం సచివాలయంలో జేఏసీ నేతలు పలిశెట్టి దామోదర్ రావు, వైవీ రావు, సీహెచ్ సుందరయ్య, వరహాలనాయుడు బృందం బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయా డిమాండ్లు న్యాయమైనవేనని, ఖచ్చితంగా చర్చించి, పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.

## ఒకరి వద్ద తీసుకొని మరొకరికిస్తారా?

- అసైన్డ్‌లోకి పోలీసుల్ని ఎందుకు పంపారు?
- డీజీపీ వస్తున్నారుగా ఆయన్నే అడుగుతాం
- రాజధానిలో పేదలకు ఇళ్లపై హైకోర్టు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "పేదల భూములను బలవంతంగా తీసుకుని, మరొకరికి పంపిణీ చేయడమేంటి? దళితుల అసైన్డ్ భూముల్లోకి పోలీసులు ఎందుకు వెళ్లారు? అక్కడకు పోలీసుల్ని పంపాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. డీజీపీ ఎలాగూ విచారణకు వస్తున్నందున ఈ విషయంపై ఆయన్నే వివరణ అడుగుతామని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### పిటిషన్లు సహా లేఖ ఆధారంగా..

రాజధాని కోసం రైతులు ఇచ్చిన భూమిలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, దుగ్గిరాల మండలాలు, కృష్ణాజిల్లా విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 1,251 ఎకరాల్లో మొత్తం 54,307 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం గత 25న జీవో 107ను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ ఎ.నందకిశోర్, కె.సాంబశివరావు, జి.హరిగోవిందప్రసాద్, పఠాన్ మున్నాలు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై బుధవారం మరోమారు విచారణ జరిగింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది దళితులు, గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకుంటోందని, కనీస హెచ్చరికలు లేకుండానే భూములు లాక్కుంటోందని పేర్కొంటూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) హైకోర్టుకు లేఖ రాసింది. దీనిలో 'దళితుల నోట్లో మట్టి' శీర్షికతో గతంలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాన్ని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రస్తావించారు. ఈ లేఖను ధర్మాసనం బుధవారం సుమోటోగా విచారణకు స్వీకరించింది. విచారణ సందర్భంగా భూముల పంపిణీ కోసం వృక్షాలను నరుకుతున్న ఫొటోలు తమకు అందాయని, వృక్షాలను ఎలా నరుకుతారని అడ్వకేట్ జనరల్(ఏజీ)ని ప్రశ్నించింది. అదేవిధంగా అసైన్డ్ భూముల్లోకి పోలీసులు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని నిలదీసింది. దీనిపై ఏజీ ఎస్.శ్రీరాం బదులిస్తూ.. అసైన్డ్ భూముల్ని ఎవరి వద్ద నుంచి బలవంతంగా తీసుకోవడం లేదని, నిబంధనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. పోలీసులు కనిపిస్తున్న ఘటన వేరని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.."ఏయే ఘటనలు జరుగుతున్నాయి? వాటి వెనుక ఏయే ఉద్దేశాలున్నాయన్న దానిపై మాకు అవగాహన ఉంది" అని నర్మగర్భంగా వ్యాఖ్యానించింది. దీంతో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు వారం గడువు ఇవ్వాలని ఏజీ అభ్యర్థించారు. పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రణతి వాదిస్తూ.. గృహాల కోసం కేటాయించిన భూములను మెరుగు పరిచేందుకు, హద్దులు నిర్ణయించేందుకు ప్రభుత్వం టెండర్లను పిలిచిందన్నారు. కేసు విచారణలో ఉండగా ఇది సరికాదని, పైగా ప్రజాధనం వృధా చేయడమేనని, దీనిని ఆపుతూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజాధనం వృధా అయితే సంబంధిత అధికారులనే బాధ్యుల్ని చేస్తామని స్పష్టం చేసింది. అధికారుల చర్యల్ని అడ్డుకోవాలని న్యాయవాది మరోమారు అభ్యర్థించడంతో.. 'ఆ పని తమది కాదని, వృధా అవుతోందని భావిస్తే సీబీఐకి ఫిర్యాదు చేసుకోవాలి' అని ధర్మాసనం సూచించింది. ప్రభుత్వ వాదన కూడా విన్నాకే నిర్ణయం వెలువరిస్తామని పేర్కొంది.

### కోర్టు రాజకీయ వేదిక కాదు

రాజధాని భూముల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు తమకు అందేలా చూడాలని, ఈ వ్యవహారంపై ఉత్తర్వులు ఇచ్చే ముందు తమ వాదనలూ వినాలంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరపున న్యాయవాది వాదిస్తూ పిటిషన్‌లో తమను అనుమతించడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "అసలు మీరెవరు? ప్రస్తుతం మీకున్న హక్కేంటి? మీకెలాంటి అధికారమూ లేదు. ఇది రాజకీయాలకు వేదిక కాదు. ఇక్కడ రాజకీయాలు చేయవద్దు' అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

## 'సగం'తోనే సై!

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసింది. బుధవారం ఆ జీవోల సారాంశాన్ని బయటపెట్టింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34%కోటాతో... మొత్తం 59.85% రిజర్వేషన్లకు వీలు కల్పించే జీవో 176ను హైకోర్టు రద్దు చేయడంలో.. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా తాజా ఉత్తర్వులు జారీ చేశారు. చట్ట సవరణ ద్వారా కాకుండా హైకోర్టు ఆదేశాల ఆధారంగానే రిజర్వేషన్లను మార్చేశారు. పంచాయతీరాజ్ చట్టం-2006లోని 4, 7, 8, 10, 13, 16 రూల్స్‌ను చట్ట సవరణ ద్వారా గానీ, లేక కోర్టు ఆదేశాల ఆధారంగా గానీ సరిచేసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం కోర్టు ఆదేశాల ప్రాతిపదికనే రూల్స్‌ను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా, తన చేతికి మట్టి అంటకుండానే బీసీలకు రిజర్వేషన్ల తగ్గింపు ప్రక్రియను పూర్తి చేసినట్లయింది. ఇక.. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ఒకట్రెండు రోజుల్లో అన్ని గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. ఆ తర్వాత... రిజర్వేషన్ల సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపిస్తారు. చివరిగా... కమిషన్ ఆయా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

### వరుస భేటీలు...

ఈ నెలాఖరులోపు స్థానిక ఎన్నికలు జరగకపోతే 14వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయని, వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలన్న ప్రభుత్వ విజ్ఞప్తిపై కమిషన్ సానుకూలంగా స్పందిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల మేరకు వెంటనే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని రమేశ్ కుమార్ చెప్పారు. బుధవారం ఆయన డీజీపీ సవాంగ్‌తో సమావేశమయ్యారు. బందోబస్తుపై చర్చించారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో సమావేశమై.. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిపై ఆరా తీశారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 23 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్‌లుగా స్కూళ్లు, కాలేజీల ఎంపిక కష్టమవుతుంది. ప్రత్యామ్నాయంగా కొత్త భవనాలు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు వాటికి సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. గురువారం మరోసారి అధికారులు ఎన్నికల కమిషన్‌తో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న దానిపై ఒక అవగాహనతో ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ... ఆ తర్వాత మున్సిపల్, చివరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకునే అవకాశముందని అంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 110 మునిసిపాలిటీలు ఉండగా... వివిధ కారణాల వల్ల ఎనిమిది చోట్ల ఎన్నికలు జరగడంలేదు. మిగిలిన 102 మునిసిపాలిటీలకు సంబంధించిన అన్ని వివరాలను ఆ శాఖ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే సమర్పించారు.



### అమ్మో.. ఎన్ని కార్లో!

ఇవేవో షోరూమ్ ప్రదర్శనకు ఉంచిన కార్లు కాదు. మోసగాళ్ల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నవి. అధిక మొత్తంలో అద్దె ఇస్తామని యజమానుల నుంచి లీజుకు తీసుకుని.. ఆపై తాకట్టు పెట్టేసిన కార్లే ఇవన్నీ. విశాఖపట్నంలోని ఆరిలోవకు చెందిన అడపా ప్రసాద్(30) '369 క్యాబ్స్' పేరుతో ట్రావెల్స్ నిర్వహించేవాడు. యజమానుల నుంచి నెలవారీ లీజుపై కార్లు తీసుకునేవాడు. అతనితో వేపగుంట వరలక్ష్మినగర్, ఎంవీపీ కాలనీకి చెందిన రెండు ముఠాలు చేతులు కలిపి 2018 నుంచి 95 కార్లు లీజుకు తీసుకున్నాయి. ఈ కార్లను అనపర్తి, అనకాపల్లి.. తదితర ప్రాంతాల్లోని వడ్డీ వ్యాపారులకు తాకట్టు పెట్టేశారు. పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. **- ఆంధ్రజ్యోతి, విశాఖ**



'గ్రామ' కొలువు మనసులో..

## పరీక్షకు నడి వయసులో...

విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో బుధవారం 150 మంది జూనియర్ ఇంటర్ పరీక్షలు రాస్తే, వారిలో 35 ఏళ్ల నుంచి 45 ఏళ్లకు పైబడిన వారే 40 మంది ఉన్నారు. చేసే ఉద్యోగంలో పదోన్నతి కోసం ఒకరో, ఇద్దరో మధ్య వయస్కులు టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయడం పరిపాటే. కానీ, ఒకే పరీక్షా కేంద్రానికి ఇంతమంది రావడం మాత్రం విశేషమే! గ్రామ సచివాలయాల్లోని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టుకు ఒకేషనల్ డెయిరీ సైన్స్‌ను(వెటర్నరీ) అర్హతగా ప్రభుత్వం నిర్ణయించింది. రెండు సంవత్సరాల ఈ కోర్సు చేయడానికి ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. అలాగే, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుపై కన్నేసి అందుకు అర్హతగా పేర్కొన్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో పోటీకీ ప్రభుత్వం ఇంటర్‌నే విద్యార్హతగా చేయనున్నదన్న వార్తలూ నడి వయస్కుల సంఖ్యను పెంచేసినట్టు సమాచారం. - శృంగవరపుకోట



## అమ్మానాన్నకు పిల్లల పాదపూజ

కడప (మారుతీనగర్), మార్చి 4: జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవ చేయడం, దైవ సేవతో సమానమని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. కడప శివారు అలంఖాన్‌పల్లె వద్ద యతిసేవాశ్రమంలో శ్రీవెంకటేశ్వరస్వామి 81 అడుగుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా బుధవారం 1008 జంటలకు లక్ష్మీనారాయణ స్వరూపంగా అర్చన కార్యక్రమం నిర్వహించారు. దంపతుల పిల్లలు వారి పాదాలకు నమస్కరిస్తూ ఆశీర్వాదాలు అందుకున్నారు.



## చికెన్.. తినేయండి హాయిగా!

కరోనా వైరస్ ప్రభావంతో చికెన్‌కు డిమాండ్ పడిపోయి, ధర పతనమైన నేపథ్యంలో... వదంతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కోళ్ల పరిశ్రమల కేంద్రమైన తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో బుధవారం భారీ చికెన్ మేళా జరిగింది. సుమారు 10వేల మంది ఈ కార్యక్రమానికి హాజరై... చికెన్ బిర్యానీ, చికెన్, ఎగ్ ఫ్రైలను నిమిషాల్లో లాగించేశారు. అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, కోళ్ల రైతులు, మేత అమ్మకందారులు, కోళ్ల మందుల రిప్రజెంటేటివ్‌లుసహా 25 మంది వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని చికెన్ వంటకాలను ఆరగించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అవాస్తవాలను నమ్మొద్దని, అన్నిరకాల పౌష్టికాలు ఉన్న చికెన్, గుడ్డు తినడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. - అనపర్తి

చంద్రబాబు కుటుంబాన్ని అంతం చేయడానికి

## జగన్ ప్రభుత్వం కుట్ర

- కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకువెళ్తాం: బుద్దా



మంగళగిరి, మార్చి 4: "టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబాన్ని అంతం చేయడానికి వైసీపీ ప్రభుత్వం కుట్రపన్నింది. తండ్రీ కొడుకులు లేకుంటే తమను రాష్ట్రంలో ఆపేవారెవరూ ఉండరన్న ఆలోచనలతోనే జగన్ సర్కారు పావులు కదుపుతున్నట్టు మాకు అనుమానం కలుగుతోంది. ఇరువురికీ భద్రతను తగ్గించడం, విశాఖ విమానాశ్రయంలో చంద్రబాబుపై దాడికి యత్నం, సీతానగరంలో లోకేశ్‌పై దాడి ఘటనలు చూస్తుంటే ఈ అనుమానాలన్నీ కలుగుతున్నాయి. ఇంత జరుగుతుంటే రాష్ట్ర డీజీపీ ఏం చేస్తున్నారు?" అని టీడీపీ నేత, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ప్రశ్నించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్ ఆదేశాల ప్రకారమే రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారన్నారు. చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల భద్రతతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటున్న వైనాన్ని కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకు వెడతామన్నారు.

### వైసీపీ ప్రభుత్వానిది రాక్షసానందం: కాల్వ

మంగళగిరి, మార్చి 4: "జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం పేద, బడుగు బలహీన వర్గాలను అణిచివేస్తోంది. గడిచిన 9 నెలల పాలనలో ఆయా వర్గాలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా లక్షలాది మంది ఆర్థిక సమస్యలతో కుంగిపోయేలా చేసి రాక్షసానందం పొందుతోంది" అని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మండిపడ్డారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని పక్కన పెట్టేసిన ప్రభుత్వం పేదల సొంతింటి కలను ఛిద్రం చేసిందన్నారు.

### మీడియా మిత్రులపై దాడులా?: లోకేశ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "నాన్నను, నన్ను అడ్డుకోవడానికి జగన్ పడుతున్న కష్టంలో 10 శాతం రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడినా... రాష్ట్రంలో ఇంత దారుణమైన పరిస్థితులు ఉండేవి కావు. కక్షసాధింపే లక్ష్యంగా, రౌడీయిజమే ఊపిరిగా ముందుకెళ్లాలని అనుకుంటే మీ ఇష్టం జగన్. కానీ మీడియా ప్రతినిధులేం చేశారు? మమ్మల్ని అడ్డుకునే పనిలో భాగంగా వైసీపీ రౌడీలు మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇదేనా మీరు తెస్తానన్న రాక్షస రాజ్యం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్విట్టర్‌లో బుధవారం విమర్శించారు.

### బీసీలను మోసం చేసిన వైసీపీ: చినరాజప్ప

భానుగుడి(కాకినాడ), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడిన ఘనత తెలుగుదేశానికి దక్కితే రిజర్వేషన్లు 30 శాతానికి తగ్గించి బీసీలను మోసం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేదలకు ఇళ్లు ఇవ్వడమంటే పేదల నుంచి భూములు లాక్కోవడం కాదని రాజప్ప విమర్శించారు.

# అశోక్ గజపతిరాజుపై వేటు!

విశాఖపట్నం/విజయనగరం/సింహాచలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, విజయనగరం రాజ వంశీయుడు అశోక్ గజపతిరాజుపై రాష్ట్ర ప్రభుత్వం రహస్య ఉత్తర్వులతో విరుచుకుపడింది. ఆయనను సింహాచల దేవస్థానం చైర్మన్‌గా తొలగించింది. అలాగే...విజయనగరం సంస్థానాధీశులకు చెందిన మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్(మాన్సాస్) ట్రస్టు అధ్యక్ష పదవి నుంచీ తప్పించింది. ఈ రెండు పదవుల్లో ఆయన అన్న, మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతిరాజు కుమార్తె సంచయిత గజపతిరాజును నియమిస్తూ అర్ధరాత్రి రహస్య ఉత్తర్వులిచ్చింది. ఆమె బుధవారం ఆగమేఘాలపై తొలుత సింహాచలం దేవస్థానం పాలకమండలి చైర్ పర్సన్‌గా... అనంతరం విజయనగరంలో మాన్సాస్ ట్రస్టు సారథిగా ప్రమాణ స్వీకారం చేసేశారు. మాన్సాస్ ట్రస్టు పరిధిలో సింహాచలం ఆలయం సహా 108 దేవాలయాలు ఉన్నాయి. సుమారు రూ.10 లక్షల కోట్ల విలువైన 14,800 ఎకరాల భూములు, విద్యాసంస్థలు, భవనాలు దీని పరిధిలోనే ఉన్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆలయ భూములను ఆక్రమించుకున్న వారికి క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించినప్పుడు అశోక్ గట్టిగా అడ్డుకున్నారు. ఏ ప్రభుత్వానికీ ఈ హక్కు లేదని స్పష్టంచేశారు. అటు సింహాచలం ఆలయ చైర్మన్‌గా, ఇటు మాన్సాస్ ట్రస్టు అధిపతిగా... వాటికి చెందిన విలువైన ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణగా నిలిచారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆయనను ఈ రెండు పదవుల నుంచి తప్పించడం వెనుక... సింహాచలం ఆలయంపై పట్టు సాధించడంతోపాటు, విలువైన ఆస్తులను పరాధీనం చేసే కుట్ర ఉన్నట్లు టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

### పురుష వారసుడే అర్హుడు..

మాన్సాస్ ట్రస్టు పరిధిలో 108 దేవాలయాలు, వివిధ రాష్ట్రాల్లో, జిల్లాల్లో వేల కోట్ల విలువ చేసే 14,800 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ ట్రస్టు దేవదాయ ధర్మాదాయ శాఖ(ఎండోమెంట్) శాఖ పరిధిలో ఉంది. 1879కి పూర్వమే విజయనగరం రాజుల ఆధ్వర్యంలో విద్యాలయాలు వెలిశాయి. ప్రాథమిక పాఠశాలల నుంచి పీజీ వరకు, సాంకేతిక విద్యా సంస్థలు, ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. మాన్సాస్ ఏర్పాటైన తర్వాత ట్రస్టు పరిధిలోకి వెళ్లాయి. భూముల నుంచి వచ్చిన ఆదాయాన్ని వాటి నిర్వహణకు వినియోగిస్తున్నారు. మాన్సాస్ ట్రస్టు డీడ్ ప్రకారం.. రాజవంశంలో పెద్దవాడైన పురుష వారసుడు ట్రస్టు వారసత్వ చైర్మన్‌గా ఉండాలి. ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా జీవో ఇచ్చింది. ఈ ట్రస్టును 1958లో డాక్టర్ పీవీజీ రాజు ఏర్పాటు చేశారు. ఆయనే మొదటి చైర్మన్‌గా పనిచేశారు. 1994లో ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు ఆనందగజపతి రాజు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2016లో ఆయన మరణం తర్వాత అప్పటికే ట్రస్టు వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగుతున్న అశోక్ చైర్మన్ పదవిని అధిష్ఠించి కొనసాగుతున్నారు. ఆనంద గజపతిరాజు మొదటి భార్య ఉమ. వీరి కుమార్తె సంచయిత. ఉమ నుంచి విడాకులు తీసుకున్నాక ఆనంద్ రెండో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం సంచయిత ఢిల్లీలో బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆశీస్సులతోనే ముఖ్యమంత్రి జగన్ ఈ జీవోకు అనుమతులు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. కాగా.. ఆమె నియామకం చెల్లదని, దీనిపై న్యాయపరంగా వెళ్తామని అశోక్ గజపతిరాజు అనుచరులు తెలిపారు.

### అనువంశిక ధర్మకర్త అశోక్..

సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. అనువంశిక ధర్మకర్త కూడా వారిలో ఒకరు. అదే హోదాలో అశోక్‌గజపతిరాజు కొనసాగుతున్నారు. పాలక మండలి చైర్మన్‌గానూ ఉన్నారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్య పరీక్షల కోసం ఢిల్లీ వెళ్లారు. ఆయన ఇక్కడ లేని సమయంలో హడావుడిగా బుధవారం ఉదయం సంచయిత సింహాచలం దేవస్థానానికి వచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మారెళ్ల వెంకటేశ్వరరావు.. ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్‌గా ఆమెతో ఆగమేఘాలపై ప్రమాణ స్వీకారం చేయించారు. ఏ విధంగా ఆమెకు బాధ్యతలు అప్పగించారని విలేకరులు ప్రశ్నించగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకున్నానని ఆయన బదులిచ్చారు. దీనిపై రహస్య ఉత్తర్వులు జారీ అయ్యాయని చెబుతున్నా.. ఇప్పటివరకు వెబ్‌సైట్‌లో ఆ సమాచారమైతే లేదు.



కప్ప స్తంభం వద్ద నమస్కరిస్తున్న సంచయిత

### సభ్యులే ఎన్నుకోవాలి..

దేవదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం సింహాచలం దేవస్థానానికి ప్రభుత్వం ట్రస్టు బోర్డు సభ్యులను మాత్రమే నియమిస్తుంది. వారంతా కలసి ఆ సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాలి. అది నిబంధన. ప్రభుత్వం నేరుగా చైర్మన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వకూడదు. ఇచ్చినా అది చెల్లదు కూడా. ప్రభుత్వం ఈ నియమాలకు విరుద్ధంగా వ్యవహరించింది. గత నెలలో ప్రభుత్వం దేవస్థానానికి 16 మంది సభ్యులతో ట్రస్టుబోర్డును నియమించింది. అందులో సంచయితను ఓ సభ్యురాలిగా నియమించింది. అప్పటికి అశోక్ గజపతిరాజే చైర్మన్‌గా ఉన్నారు. కొత్త సభ్యులతో గురువారం ఉదయం 11.10 గంటలకు ప్రమాణం చేయించడానికి ఏర్పాట్లుచేశారు.

# లక్షల కోట్ల ఆస్తులు కాజేయడానికే!

- అప్పన్న భూములపై సీఎం, విజయసాయి కన్ను
- మాన్సాస్ ట్రస్టు ఆస్తులపైనా దృష్టి
- అశోక్ తొలగింపుపై భగ్గుమన్న టీడీపీ

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం చైర్మన్ పదవి నుంచి.. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పదవి నుంచి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును ఆకస్మికంగా తొలగించడంపై తెలుగుదేశం పార్టీ భగ్గుమంది. ఈ రెండింటి కిందా లక్షల కోట్ల విలువ చేసే వేల ఎకరాల భూములు, ఆస్తులు ఉన్నాయని, వాటిపై కన్నేసే సీఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి ఈ దుస్సాహసానికి ఒడిగట్టారని మండిపడింది. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడారు. 'సింహాచలం ఆలయానికి వేల ఎకరాల భూములిచ్చిన విజయనగరం రాజ కుటుంబంలో ఎవరు పెద్దవారైతే వారిని వంశపారంపర్య ధర్మకర్తగా ఆ ఆలయ ట్రస్టు చైర్మన్‌గా నియమించడం ఆనవాయితీ. ఆ ప్రకారమే అశోక్ గజపతిరాజును ఆలయ చైర్మన్‌గా నియమిస్తూ గత నెల 20న ఉత్తర్వులు ఇచ్చారు. పోయిన నెలలోనే ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా దానిని మార్చి మొదటి వారానికి వాయిదా వేశారు. ఈలోపే అశోక్ స్థానంలో ఆయన అన్న ఆనంద గజపతిరాజు కుమార్తె సంచయితను చైర్‌పర్సన్‌గా నియమిస్తూ రహస్యంగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత సింహాచలం పెద్ద దేవస్థానం. దాని కింద అత్యంత విలువైన వేల ఎకరాల భూములున్నాయి. ఒడిశా రాజులు కూడా భూములిచ్చారు. వీటన్నిటి విలువ లక్షల కోట్లలో ఉంటుందని అంచనా. సంచయితను నియమించడంలో పెద్ద కుట్ర ఉంది' అని కళావెంకట్రావు ఆరోపించారు. 'పీవీజీ రాజు 1958లో మాన్సాస్ ట్రస్టు పెట్టినప్పుడే అందులో తన కుమారులు ఆనంద గజపతిరాజు, అశోక్ గజపతిరాజులను సభ్యులుగా పెట్టారు. మొదటి సారి జగన్ ప్రభుత్వంలో ఒక కీలక వ్యక్తి ఇందులో తల దూర్చి ఈ ట్రస్టు చైర్‌పర్సన్‌గా సంచయితను నియమింపజేశారు. తరతరాలుగా వస్తున్న రాజ కుటుంబ సంప్రదాయాలకు విరుద్ధంగా ఎందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో... రహస్యంగా ఆమెను ఎందుకు నియమించాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ట్రస్టు ఏర్పడినప్పుడే తన తదనంతరం ఎవరు చైర్మన్‌గా ఉండాలో పీవీజీ రాజు స్పష్టంగా చెప్పారని కాల్వ తెలిపారు.

ఇళ్లపట్టాలకు భూములు లాక్కున్నారని

# మహిళ ఆత్మహత్య

- వైసీపీ నాయకులపై కుటుంబీకుల ఆరోపణలు
- కర్నూలు జిల్లా ఎర్రగూడూరులో ఘటన

ఆత్మకూరు, మార్చి 4: పేదలకు ఇళ్లపట్టాల పేరుతో తరతరాలుగా అనుభవంలో ఉన్న భూములను లాక్కోవడంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్నూలు జిల్లా పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామం లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు...పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన మదన్‌మోహన్, తెలుగు భూలక్ష్మి(30) దంపతుల కు 413, 422/2 సర్వేనంబర్‌లో రెండున్నర ఎకరాల భూమి అనుభవంలో ఉంది. వాస్తవానికి వీరి పెద్దలకు 14ఎకరాలు ఉన్నప్పటికీ శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ ఏర్పాటుకు భూమిని కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న భూముల్లో మామిడితోట సాగుచేశారు. అయితే గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఇటీవల ఈ భూములను లాక్కొని ఇళ్లపట్టాలను పంపిణీ చేసేందుకు పూనుకున్నారు. ఈ భూములు తమ అనుభవంలో ఉన్నాయని చెప్పినా పట్టించుకోకుండా చదును చేసి రాత్రికిరాత్రి లేఔట్లు తయారు చేసి ప్లాట్లుగా రూపొందించినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. ఎన్నో ఏళ్లగా అనుభవంలో ఉన్న భూములను కోల్పోతున్నామని, కుమారుల పరిస్థితి ఏమిటని భూలక్ష్మి తీవ్ర మనస్తాపానికి లోనైంది. బుధవారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి భూములను బలవంతంగా లాక్కున్నారని, ఈ కారణంగానే భూలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

### వ్యభిచారం కేసులో జబర్దస్త్ కమెడియన్లు



పోలీస్‌స్టేషన్‌లో దొరబాబు, పరదేశి

విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో జబర్దస్త్ కమెడియన్లు దొరబాబు, పరదేశి విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. మాధవధారలోని ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో వ్యభిచారం జరుగుతోందని సమాచారం అందడంతో ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం రాత్రి దాడి చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక యువతితోపాటు దొరబాబు, పరదేశి సహా నలుగురు విటులు, నిర్వాహకులు షేక్ ఆశ, మద్దిల వెంకటలక్ష్మి పట్టుబడ్డారు. యువతిని పునరావాస కేంద్రానికి తరలించామని ఏసీపీ చెప్పారు. విటులు, నిర్వాహకులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించడంతో వారిపై కేసు నమోదుచేశారు.

### రాష్ట్ర వాటా చెల్లిస్తే రైల్వే పనుల్లో వేగం: గోయల్

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.1411 కోట్లు చెల్లించాల్సి ఉందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను సకాలంలో చెల్లిస్తే ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతాయన్నారు. ఈమేరకు లోక్‌సభలో వైసీపీ ఎంపీలు కనుమూరు రఘు రామకృష్ణంరాజు, వల్లభనేని బాలశౌరి, ఆదాల ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బుధవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### విశాఖలో అమరావతి మెట్రో రైల్ ప్రాంతీయ కార్యాలయం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని తక్షణమే విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.


**వాహనాలు అమ్మకము**

| Vehicle No. | Make & Model | Year |
|---|---|---|
| AP29U7561 | TATA SE 1613 | 2007 |
| AP16TC2349 | TATA SK 1616 | 2011 |
| AP16BS4751 | SWARAJ 735 | 2009 |
| AP16TJ0192 | AL DOST | 2017 |
| AP16TF0777 | MAHINDRA BOLERO MAXI TRUCK | 2013 |
| AP07TE3116 | TATA ACE | 2014 |
| AP16TG3495 | APE PICK UP XTRA LD | 2015 |
| AP31V6885 | TATA SE 1613 TURBO FBT-T | 1999 |
| AP16Y8571 | MAHINDRA MAXX PICKUP | 2007 |
| AP16TX6519 | TATA LPT 2515 | 2008 |
| AP27AA1510 | MAHINDRA 475 DI | 2007 |
| AP16TV6616 | TATA LPT 2515 CUMMINS | 2006 |
| AP29V1382 | TATA SE 1613 TURBO | 2008 |
| AP16TD0378 | AL DOST | 2012 |
| AP16TD0149 | LPT 3118 | 2012 |
| AP07TV7667 | TATA INDICA | 2013 |
| AP26TV0751 | TATA MAGIC | 2009 |
| AP16TG3582 | AL DOST | 2015 |
| AP16TD4707 | AL DOST | 2013 |
| AP05TX7039 | TATA ACE | 2013 |
| AP16TX6616 | TATA LPT 2516 | 2008 |
| AP39TC5761 | TATA LPK 2518 FBT | 2011 |
| AP07TA4645 | TATA LPK 2518 FBT | 2011 |
| AP07TC3899 | TATA SK 1613 | 2012 |
| AP16TG6550 | SONALIKA DI 740 | 2014 |
| AP20TC0531 | TATA ACE | 2012 |
| AP07TB7857 | LPT 3118 | 2011 |
| AP16TE5559 | TATA LPK 2518 FBT | 2016 |

AUCTION PLACE : SHRIRAM AUTO MALL, GUTTIKONDA SIVANARAYANA YARD, NEW AUTONAGAR, KANURU, VIJAYAWADA
AUCTION DATE : 05-03-2020
Cont : SHRIRAM TRANSPORT FINANCE Co. Ltd.
D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197.
88016 67697, 99499 11574


## అగ్రిగోల్డ్ చైర్మన్ ఇంట్లో ఈడీ సోదాలు

విజయవాడ, హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందిని నిలువునా ముంచి, కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టిన అగ్రిగోల్డ్ చైర్మన్ అవ్వా వెంకట రామారావు ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించారు. విజయవాడ సత్యనారాయణపురంలోని ఆయన ఇంటికి బుధవారం వేకువజామునే పదిమంది అధికారులు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. తనిఖీ సమయంలో వెంకట రామారావు ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్తులకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉంటున్న ఆ సంస్థ డైరెక్టర్ అవ్వా సీతారామరాజు ఇంట్లోనూ, లింగంపల్లి, గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయాలు, డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, ఇతరుల ఇల్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు కొనసాగాయి. చైర్మన్‌కు బినామీగా ఉన్న గుంటూరుకు చెందిన వ్యక్తి ఇం ట్లోనూ ఈడీ సోదాలు చేసినట్టు సమాచారం. వీరు ప్రజల నుంచి ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూలు చేయించి, బోర్డు తిప్పేసిన తర్వాత కేసును సీఐడీ దర్యాప్తు చేస్తోంది. ఈ విధంగా స్వాహా చేసిన డబ్బుతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుల్లో విలువైన ఆస్తులను కొనుగోలు చేశారు. ఈ కేసులను సీఐడీతోపాటు ఈడీకి అప్పగించాలని అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం హైకోర్టులో లోగడ పిటిషన్ దాఖలు చేసింది.

### బెజవాడలో ఐటీ సోదాలు

విజయవాడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను శాఖ అధికారులు విజయవాడలో వరుస సోదాలు నిర్వహించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఐటీ అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల రశీదు పుస్తకాలు, పలు ఫైళ్లను పరిశీలించి, కొన్నింటిని తమవెంట తీసుకెళ్లినట్టు సమాచారం. మరోపక్క రాజధానిలో భూముల కొనుగోలుకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, శ్రీచైతన్య యాజమాన్యం మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. కళాశాల ప్రధాన కార్యాలయంతోపాటు విజయవాడలో ఉన్న వివిధ శాఖ కార్యాలయాల్లోనూ సోదాలు జరిగాయి. మరోపక్క విజయవాడ గాయత్రీనగర్‌లోని పేరుగాంచిన ఇన్‌ఫ్రా కంపెనీలోనూ ఐటీ సోదాలు జరిగాయి. రాజధానిలో భూముల కొనుగోలుకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్టు తెలిసింది.

### కాల్వలోకి దూసుకెళ్లిన వాహనం.. ముగ్గురు మృతి

పోడూరు, మార్చి 4 : కాల్వలోకి బొలెరో వాహనం దూసుకువెళ్లి ముగ్గురు సజీవ సమాధయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన చౌదుల కాశీవిశ్వనాథం (22), చింతా చిట్టియ్య(40) రొయ్యల సాగు చేస్తున్నారు. యలమంచిలి మండలం తూర్పుకాజకు చెందిన కొప్పినీడి సురేష్ (25)తో కలిసి వీరిద్దరూ రొయ్య పిల్లల కోసం తూర్పు గోదావరి జిల్లా ఒంటిమామిడికి వెళ్లి వస్తుండగా..బుధవారం తెల్లవారు జామున పోడూరు మండలం జగన్నాధపురం వద్ద నరసాపురం ప్రధానకాల్వలోకి వాహనం దూసుకుపోయింది. నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు.

## 'పౌరసత్వం'పై జగన్ డ్రామాలు

- మైనార్టీల హక్కులకు అండగా టీడీపీ
- ముస్లిం సంఘాల నేతల భేటీలో చంద్రబాబు



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "ముస్లిం, బడుగు, బలహీన వర్గాల భద్రతకు టీడీపీ ఎనలేని ప్రాధాన్యత ఇస్తుంది. గడిచిన 9 నెలల్లోనే మైనార్టీల్లో అభ్రతాభావం పెరిగింది. జాతీయ జనాభా పట్టిక(ఎన్‌పీఆర్), జాతీయ పౌర పట్టిక(ఎన్ఆర్‌సీ), పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై దేశవ్యాప్తంగా మైనార్టీలు ఆందోళనలో ఉన్నారు. వీటి అమలుపై రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోంది" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబుతో ముస్లిం సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. ఎన్‌పీఆర్‌పై ప్రజల్లో ఆందోళనల దృష్ట్యా ఆ ప్రక్రియను ప్రస్తుతానికి అబయన్స్‌లో పెడుతున్నామంటూ కేబినెట్‌లో ఆమోదించడమూ జగన్నాటమేనని అన్నారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే దీనిపై జీవో 102ను ఆగస్టు16న విడుదల చేసే వారే కాదని, దీనిని నమ్మడానికి ముస్లింలు సిద్ధంగా లేరని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓట్ల కోసం జగన్ నాటకం ఆడుతున్నారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రస్తావించారు. టీడీపీ తెచ్చిన ముస్లిం సంక్షేమ పథకాలన్నింటినీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భేటీలో ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్ వ్యతిరేక కూటమి ఏపీ శాఖ, జమాతె ఇస్లామి హింద్, ముస్లిం హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

- ఆమె స్నేహితుడిని కొట్టి నలుగురు అఘాయిత్యం

మండపేట, మార్చి 4: డిగ్రీ విద్యార్థినిపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో చదువుతున్న యువతి కార్యక్రమం అనంతరం స్నేహితుడితో కలిసి బైపాస్‌రోడ్డులోని సంగంపుంత కాలనీ వద్ద ఉన్న ఇటుకబట్టీ సమీపానికి వెళ్లింది. అక్కడి పొలంలో వీరిద్దరూ మాట్లాడుకుంటుండగా, నలుగురు యువకులు ఆమె స్నేహితుడిపై దాడి చేసి, అతడి ఎదురుగానే ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వల్లూరి రామకృష్ణ(కిట్టయ్య), సుంకర సత్యనారాయణ(వెంకన్న), చామంతి మధు, ములకల వీరబాబు ఈ దారుణానికి పాల్పడినట్టు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేస్తున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

### రాష్ట్ర ప్రతిష్ఠను దిగజారుస్తున్న జగన్: అనిత

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర అభివృద్ధిని నిలిపేసి, మద్యం కోసం ప్రపంచ బ్యాంకు రుణం అవసరమా? భవనాలకు రంగులేసేందుకు కూడా అప్పులు చేస్తున్నారు. మద్యం కొనుగోళ్ల పేరుతో ప్రపంచ బ్యాంకు రుణాన్ని తమ జేబుల్లో వేసుకునేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠను సీఎం జగన్ దిగజారుస్తున్నారు" అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. బుధవారం ఆమె ఓ ప్రకటన చేశారు. వైసీపీ నేతల తీరు చూస్తే కరోనా వైరస్ కూడా భయపడేలా ఉందన్నారు.

## ఏపీఏటీ కేసులు తగిన ఫోరానికి!

- నెల రోజుల్లో బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్(ఏపీఏటీ) రద్దయినందున, దాని వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ నెల రోజుల్లో తగిన ఫోరానికి బదిలీ చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఏటీకి ఇద్దరు సభ్యులను నియమించినప్పటికీ వారు విధులు నిర్వర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపకపోవడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాదులు ఎ.సూర్యారావు, ఎస్.కృష్ణమూర్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గతంలో విచారణ జరగ్గా.. ఏపీఏటీ రద్దుకు కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చిందని, తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కోర్టుకు తెలిపారు. అయితే ఆ నోటిఫికేషన్‌లో ఏపీఏటీ రద్దుకు హైకోర్టు ఆమోదం తెలిపినట్లు ఉండడం పట్ల ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం మళ్లీ దాన్ని సవరించి గతనెల 27వ తేదీన తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం మరోమారు విచారణ జరగ్గా.. కేంద్రం తాజా నోటిఫికేషన్ ప్రతిని ఏఎస్‌జీ కృష్ణమోహన్ ధర్మాసనం ముందుంచారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పైవిధంగా ఆదేశాలు ఇచ్చింది.


బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
www.bankofbaroda.com
జోనల్ కార్యాలయము, హైదరాబాద్. ఫోన్ : 040-23287211
**ఫర్నిషింగ్ పనులు**
బ్యాంక్ ఆఫ్ బరోడా, జోనల్ కార్యాలయము, హైదరాబాద్ వారు SMELF, హైదరాబాద్ వారి కొరకు ఫర్నిషింగ్ పనులకు పేరొందిన కాంట్రాక్టర్ల నుండి బిడ్లను కోరుచున్నారు. టెండరు దాఖలుకు చివరి తేది:26.03.2020న మ॥3.00 గం.లకు. తదుపరి వివరాలకు, మా యొక్క టెండర్స్ సెక్షన్ వెబ్‌సైట్: www.bankofbaroda.comను దర్శించగలరు.
జనరల్ మేనేజర్ జోనల్ కార్యాలయము, హైదరాబాద్.



**గుంటూరు నగరపాలక సంస్థ**
ఇ.టి.నెం. 108/2019-20 తేది. 4-03-2020
**"బాక్స్" - టెండర్ ప్రకటన**
గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "బాక్స్" టెండరు ద్వారా టెండర్లను రిజిస్టరు కాంట్రాక్టు దారుల నుండి కోరబడుచున్నవి. ఇతర వివరములకు కార్యాలయ పనివేళలందు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, D.B / GMC, Mobile No. 9849908367
"బాక్స్" టెండర్ ఇ.టి. నెం.108/2019-20
మొత్తం పనుల సంఖ్య - 24
అంచనా మొత్తం - Rs. 870.00 Lakhs
టెండరు బిడ్‌లను వేయుటకు ఆఖరు తేది - 09-03-2020 సా॥ 04:00 గం॥లకు
టెండరు బిడ్‌లను తెరచు తేది - 09-03-2020 సా॥ 04:15 గం॥లకు
సం/- కమీషనర్, నగరపాలక సంస్థ, గుంటూరు

# 'పౌర'మంటల్లో మేఘాలయ

ఒకవైపు బంగ్లాదేశ్, మరోవైపు అసోం సరిహద్దులుగా ఉన్న ఈశాన్య రాష్ట్రం మేఘాలయ ఆగ్రహంతో రగిలిపోతున్నది. సీఏఏకు వ్యతిరేకంగా అక్కడ జరుగుతున్న ఉద్యమాలు ఇటీవల తీవ్ర విధ్వంసానికి దారితీశాయి. మరణాల సంఖ్య తక్కువే అయినప్పటికీ, కత్తిపోట్లకు గురైనవారు అధికం. ఆదివాసీయేతరులపై సాగిన విధ్వంసకాండలో అనేక దుకాణాలు, ఇళ్ళు అగ్నికి ఆహుతైనాయి. అనేక జిల్లాల్లో ఇంటర్నెట్ నిలిచిపోయి, రాత్రివేళ కర్ఫ్యూ అమలవుతోంది. మిగతా భారతదేశం మాదిరిగానే పౌరసత్వ సవరణ చట్టమే ఈ ఆగ్రహాన్ని రగల్చినప్పటికీ, ఈ రాష్ట్రంలో మాత్రం కారణాలు భిన్నమైనవి.

ఆదివాసీలు, అందునా క్రైస్తవులు అత్యధికంగా ఉన్న మేఘాలయ తనకు పౌర చట్టంతో పెను ప్రమాదం ఉన్నదని నమ్ముతోంది. సవరణ చట్టం ద్వారా బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ దేశాలనుంచి వలస వచ్చిన ముస్లిమేతర మతాల వారికి అతి సునాయాసంగా పౌరసత్వం లభిస్తుందన్న విషయం తెలిసిందే. మేఘాలయకు ఉన్న భయం ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ ఉన్నప్పటికీ, అసోం, బంగ్లాదేశ్‌లు సరిహద్దులుగా ఉన్నందున ఈ రాష్ట్రానికి అక్రమ వలసదారుల సమస్య అధికం. ముస్లింలను మాత్రమే మినహాయించిన ఈ చట్టం దేశవ్యాప్త ఎన్నార్సీతో కలసి ముస్లింల వేటకు ఉపకరిస్తుందని మిగతాదేశంలో ఉద్యమాలు జరుగుతుంటే, మేఘాలయలో మాత్రం అక్రమవలసదారుల స్థిరీకరణకు ఉపకరిస్తుందన్న భయంతో ఆందోళనలు జరుగుతున్నాయి. అసోం మాదిరిగానే మేఘాలయకు కూడా అక్రమవలసదారులు ఏ మతానికి చెందినవారైనా వారిని పంపించివేయడమే కావాలి. కానీ, కొత్తచట్టంతో వారంతా సక్రమమైనప్పుడు అది సాధ్యపడదని వారి వాదన. అత్యంత శక్తివంతమైన ఆరోషెడ్యూల్ అండగా ఉండగా మీరు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని కేంద్రం మేఘాలయ వాసులను సముదాయిస్తున్నది. ఆరోషెడ్యూల్ ప్రాంతాలకు పౌరసత్వ సవరణ చట్టం నుంచి పూర్తి మినహాయింపు ఇస్తూ కేంద్రప్రభుత్వం అనంతరకాలంలో తీసుకున్న దిద్దుబాటు చర్యలు వారి భయాలను పోగొట్టలేకపోయాయి. ఆరోషెడ్యూల్ ప్రాంతాలకు ప్రత్యేక రక్షణలతో పాటు, ఇతరుల ప్రవేశానికి అధికారిక అనుమతి అవసరమన్నది తెలిసిందే. కానీ, పౌరసత్వ చట్ట సవరణతో అన్ని లెక్కలూ మారిపోయిన తరువాత ఆరోషెడ్యూల్ తమకు రక్షణనివ్వదని స్థానిక ఆదివాసీల వాదన. అసోంలోని అధికప్రాంతాలు ఆరోషెడ్యూల్‌కు ఆవల ఉన్నందున అక్కడ మరింత అగ్గిరేగిన విషయం తెలిసిందే. దానితో పోల్చితే దాదాపు మొత్తం మేఘాలయ ఈ షెడ్యూల్ పరిధిలోకే వస్తుంది. కానీ, బయటివారి ప్రవేశాన్ని మరింత బలంగా కట్టడిచేయగలిగే ఇన్నర్‌లైన్ పర్మిట్ (ఐఎల్‌పి) తమ రాష్ట్రానికీ ఇవ్వనంతవరకూ భయాలు తీరవనీ, శాంతించేది లేదని మేఘాలయ అంటున్నది.

పౌరచట్టంతో అక్రమవలసదారులందరినీ పౌరులుగా మార్చేశాక, ఈ ఇన్నర్‌లైన్ పర్మిట్‌తో కూడా పెద్ద ప్రయోజనం ఉండదన్న వాదనలు అటుంచితే, అది ఇప్పటికే ఈశాన్యంలోని అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరంలో ఉన్నది. సీఏఏ అనంతర ఆందోళనలకు జడిసి మణిపూర్‌లోనూ కేంద్రం ఇటీవల దానిని అనుమతించింది. పౌరచట్టం ఆమోదించగానే అసోం మాదిరిగానే మేఘాలయ కూడా తీవ్రంగా మండిపడింది. తమకూ ఐఎల్‌పి ఇవ్వవలసిందిగా మేఘాలయ అసెంబ్లీ తీర్మానం కూడా చేసింది. కానీ, కేంద్రం ఇప్పటివరకూ సానుకూలంగా స్పందించకపోవడమే ఈ ఉద్రిక్తతలకు కారణం. దేశంలోని ఇతర ప్రాంతాలనుంచి, పొరుగుదేశం నుంచి మేఘాలయకు ఆదివాసీయేతరులు వచ్చిపడుతూండటంతో స్థానికులకూ వారికీ మధ్య వైరం హెచ్చుతున్నది. గత నాలుగైదు దశాబ్దాల్లో కనీసం నాలుగుసార్లు ఆదివాసులకూ, స్థానికేతరులకూ మధ్య తీవ్రస్థాయి ఘర్షణలు రేగాయి. వందలాదిమంది ఆదివాసీయేతరులను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన ఘటనల్లో తీవ్ర రక్తపాతం జరిగింది. సీఏఏపై తగ్గేది లేదని పాలకులు కఠినంగా చెబుతున్నప్పుడల్లా మేఘాలయ రెచ్చిపోతున్నది. ఇప్పుడు సీఏఏ, ఐఎల్‌పిలపై స్థానికులకు, ఆదివాసీయేతరులకూ మధ్య జరిగిన ఒక సమావేశం అనంతరం ఖాసీ విద్యార్థి సంఘం ఈ నిప్పు రగల్చిందని అంటున్నారు. సుదీర్ఘకాలం తరువాత కాస్తంత శాంతిబాట పట్టిన మేఘాలయలో పౌరచట్టం మీద ప్రజలకున్న భయాలు మిలిటెంట్ సంస్థలకు ఊపిరినిస్తున్నాయి. ఆదివాసీయేతరులు నెలరోజుల్లోగా రాష్ట్రాన్ని విడిచిపోకపోతే మారణహోమం తప్పదని ఒక ఆదివాసీ మిలిటెంట్ సంస్థ అల్టిమేటమ్ జారీ చేసింది. ప్రజల్లో భయాలు, వైషమ్యాలు పెంచే ఇటువంటి ప్రకటనలు ప్రచురించవద్దని బీజేపీ మిత్రపక్షంగా ఉన్న అక్కడి ప్రభుత్వం మీడియాపై ఆంక్షలు పెడుతున్నది కానీ, ఆ పనిచేస్తున్నది కొత్త పౌరచట్టమే. ఒక చట్టం అమలువల్ల కలిగే సామాజిక, మానవ నష్టాలను గుర్తించడానికి పాలకులు నిరాకరిస్తున్న దుస్థితి ఇది.

# 'ఆప్' తీరుకు ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు!



■ యోగేంద్ర యాదవ్

ఢిల్లీ అల్లర్ల విషయంలోనూ, కన్హయ్య కుమార్‌పై కేసు విషయంలోనూ వ్యవహరిస్తున్న తీరును బట్టి ఆమ్ ఆద్మీ పార్టీ, అరవింద్ కేజ్రీవాల్ పెద్ద దగా చేశారని చాలామంది ఆందోళన చెందుతున్నారు. కానీ ఆ పార్టీ రచించుకుంటున్న ఒక దీర్ఘకాలిక వ్యూహాన్ని ఎవ్వరూ గమనించటం లేదు. నేటి మోదీ పాలిత భారత దేశానికి తగ్గట్టుగా తన్ను తాను విజయవంతంగా మలచుకున్న మొట్టమొదటి బీజేపీయేతర పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీయేనని చెప్పాలి. దేశంలో ఒక అనివార్య రాజకీయ వాస్తవమై నిలిచిన హిందుత్వ తరహా జాతీయవాదానికి కేజ్రీవాల్ లొంగిపోవటమే కాదు, రాజకీయ దందాలో తనకోసం తెరుచుకున్న ఒక కొత్త అవకాశాన్ని చప్పున పసిగట్టారు.

హిందుత్వ రాజకీయాలకు అంతకంతకూ డిమాండు పెరుగుతూండటంతో– ఆ విషయంలో బీజేపీతో పోటీపడటానికి మరో సరఫరాదారుకు జాగా దొరికింది. ఇప్పుడు ఆ జాగాను సొంతం చేసుకోవటానికే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నిస్తోంది.

ఢిల్లీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత ఆప్ తీసుకున్న రాజకీయ నిర్ణయాలు ఆ పార్టీ ఇకముందు ఏ మార్గంలో పయనిస్తుందో చెప్పకనే చెప్పాయి. దేశద్రోహ నేరం మీద కన్హయ్య కుమార్, ఉమర్ ఖాలిద్, అనిర్బన్ దాసులపై విచారణ జరిపేందుకు అనుమతినివ్వటం ఆప్ ఉద్దేశపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయం. ఆప్ అధికార ప్రతినిధి మాత్రం ఇది రొటీనుగా ఇచ్చే పాలనాపరమైన అనుమతి మాత్రమే అంటున్నారు. ఆ మాట నమ్మటానికి చాలా అమాయకత్వం కావాలి. ఎందుకంటే– ఒకటి: ఈ అనుమతి ఇచ్చింది ఏదో మామూలు నేరంపై విచారణకు కాదు, దేశద్రోహంపై విచారణకు; అది ఒక రాజకీయ నేరం. రెండు: ఏది దేశద్రోహ నేరం కిందకు రాదో చెప్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన నిర్దేశాలను ఈ కేసు ఏ మాత్రం లెక్కలోకి తీసుకోవటం లేదు. మూడు: స్వయానా ఢిల్లీ ప్రభుత్వ న్యాయ సలహాదారే ఈ కేసు నిలవదనీ, దీని విచారణకు అనుమతి ఇవ్వవద్దనీ ప్రభుత్వానికి సలహా ఇచ్చి వున్నాడు. ఇక చివరగా: ఇది నిజంగా ఒక రొటీను విషయమే అయితే, ఈ విషయంపై నిర్ణయం తీసుకోవటానికి ఢిల్లీ ప్రభుత్వం సంవత్సరానికి పైగా ఎందుకు తాత్సారం చేసింది?

ఒకటి మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. కన్హయ్య కుమార్, ఉమర్ ఖాలీద్‌లకు సానుభూతిపరుడిగా కనపడటమన్నది తన పార్టీ జాతీయవాద కీర్తికి భంగమనీ, దాని వ్యాప్తికి ఆటంకమనీ కేజ్రీవాల్ ఒక అంచనాకి వచ్చారు. ఈ కోణంలో ఆలోచించి చూసినప్పుడు, ఈ పార్టీ ఆర్టికల్ 370 ఎత్తివేతను సమర్థించటమూ, జమ్మూకశ్మీరు రాష్ట్ర పునర్విభజనను స్వాగతించటమూ పెద్ద ఆశ్చర్యం కలిగించదు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికీ సామాజిక వైవిధ్యతకూ సమాఖ్య స్ఫూర్తికీ మొక్కుబడిగా మద్దతు తెలుపుతుంది. కానీ ఇక మీదట అలా వుండదు. ఐక్యత అంటే ఒకేలా ఉండటమే అని నమ్మే తీవ్ర జాతీయవాదపు పరిధుల్లోనే ఆ పార్టీ పని చేస్తుంది. అంతేకాదు, ఈ జాతీయవాదం బీజేపీ మార్కు జాతీయవాదం కంటే మరింత కఠినంగానూ విచక్షణారహితంగానూ కూడా ఉండవచ్చు.

ఆప్ రాజకీయంగా ఆశిస్తున్న స్థితి ఏమిటో ఈమధ్య ఢిల్లీ అల్లర్ల సందర్భంగా ఆ పార్టీ వ్యవహరించిన శైలిలోనూ వెల్లడవుతోంది. లౌకికవాదం పట్ల వ్యూహాత్మక మౌనం, ఎన్నికల ప్రచారంలో షహీన్ బాగ్ వైపు అస్సలు రాకపోవటం... వీటిని తెలివైన ఎన్నికల ఎత్తుగడలుగా భావించవచ్చు. కానీ నగరంలో ఒకప్రక్క హిందూ–ముస్లింల మధ్య ఘోరమైన హింస జరుగుతుంటే, ఈ పార్టీ ఉద్దేశపూర్వకంగా నిర్లిప్తంగా ఉండటమన్నది, ఈ పార్టీ ఎంచుకున్న విస్పష్టమైన రాజకీయ మార్గాన్ని సూచిస్తుంది. మతపరమైన హింసపై మంచి అవగాహన ఉన్న హర్ష్ మందర్ ఈ హింస జరుగుతున్నప్పుడు ఆమ్ ఆద్మీ ప్రభుత్వం తీసుకోగలిగివుండీ తీసుకోని చర్యలేమిటో చెప్పారు. గొప్ప మెజారిటీతో నగరంలో ఎన్నికైన ఈ పార్టీ, హింస జరుగుతున్న ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు గానీ, బాధితులకు విశ్వాసం కలిగించే ప్రయత్నాలు కానీ చేయనేలేదు, అసలు దరిదాపుల్లోనే కనిపించలేదు. హింసను అదుపు చేయటానికి పాలనాయంత్రాంగాన్ని వాడుకోలేదు. ఉపశమన చర్యలు తీసుకోవటంలో తాత్సారం చేసింది. బాధితులకు చేయాల్సింది చేయటం మానేసి, ఆ గందరగోళంతో తనకు సంబంధం లేనందుకు సంతోషిస్తున్నట్టు కనపడింది. ఇది పాలనా వైఫల్యం కాదు, రాజకీయ ఇచ్ఛ లేకపోవటం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, అధికసంఖ్యాక హిందువుల్ని నొప్పించకూడదనుకోవటం.




> ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపు పట్ల వెల్లువెత్తిన ఉత్సాహంపై చన్నీళ్ళు చల్లినందుకూ, తన లౌకిక అభిమానులకి తగిన శాస్తి చేసినందుకూ మనం అరవింద్ కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలుపుకోవాలి. రాజకీయ ప్రత్యామ్నాయాలకీ ప్రత్యామ్నాయ రాజకీయాలకీ మధ్య చాలా తేడా ఉందని మనకి తెలిసొచ్చేలా చేసినందుకు కూడా ఆయనకి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మోదీని గద్దె దించటానికి ఆప్ మనకు సాయపడవచ్చు, కానీ మన గణతంత్రాన్ని పరిరక్షించుకోవడంలో మాత్రం అది సాయపడదు.

అంతమాత్రాన, ఆప్‌ను ముస్లిం వ్యతిరేక పార్టీ అనలేం, కనీసం ప్రస్తుతానికి. కానీ అది ఎంతవరకూ మైనారిటీల పక్షాన నిలబడుతుందన్నది ఆయా సందర్భాల్లో అధిక సంఖ్యాకుల్లో ఉన్న సెంటిమెంటును బట్టి ఆధారపడి వుంటుంది. ఢిల్లీలో ముస్లింలకు తాను తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని ఆప్‌కు తెలుసు. కాబట్టి ఊరికే ముస్లిం అనుకూలత కనబరిచి హిందూ ఓట్లను పోగొట్టుకోదల్చుకోలేదు. అందుకే ఆ పార్టీ అయోధ్యపై వెలువడిన తీర్పును ఒప్పుకోవటమే కాదు, ఎదురేగి స్వాగతించింది కూడా.

ఇదంతా చూసి ఆప్‌ను బీజేపీకి అనుబంధ పార్టీ అనుకుంటే పొరపాటే. అదే నిజమైతే ఆ పార్టీ ముమ్ముందు బీజేపీకి ఎన్నికలపరంగా మద్దతునివ్వాలి. కానీ అలా జరగదు సరికదా, బీజేపీకి అది దేశంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన పోటీదారుగా నిలబడగలదు. ఒకేరకమైన భావజాలం ఉన్నంత మాత్రాన అది స్నేహపూర్వకమైన స్పర్థకు దారితీస్తుందనుకోవటం పొరపాటు; అది చాలాసార్లు తీక్షణమైన, కఠినమైన, వ్యక్తిగత స్థాయి యుద్ధానికి దారితీస్తుంది. బహుశా ఆప్ ఇక ఏదో ఒక్క రాజకీయ దృక్కోణానికి నిబద్ధమై ఉండాలనే బరువు మోయదు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం ఈ విషయాలని తీసుకొని బీజేపీ మీద దాడి చేయటం తగ్గిస్తుంది. పాలనా సంబంధ విషయాలపై మాత్రమే విమర్శలు ఎక్కుపెడుతుంది. ఈ రకమైన వ్యవహార శైలికి మనం ఇంకేదైనా పేరు వెతకాలి. 'మృదు హిందుత్వ' (సాఫ్ట్ హిందుత్వ) అన్న పేరు సరైనదే కానీ, అది మాత్రమే సరిపోదు. ఈ పార్టీ రాజకీయంగా ఆశిస్తున్న స్థితికి కరుడుగట్టిన జాతీయవాదం కీలకం. ఈ పార్టీ నియో లిబరల్ ఆర్థిక నమూనాను వ్యతిరేకిస్తుందని ఆశపడేవారు ఈ పార్టీ ఆర్థిక విధానాన్నిగానీ, దాని లేమినిగానీ చూసి భంగపడతారు. మృదు హిందుత్వ, కరుడుగట్టిన జాతీయవాదం, అస్పష్ట ఆర్థిక విధానం, ప్రజాభిప్రాయానికి దాస్యం చేయటం... ఇదీ ఆప్ బ్రాండ్‌కు సరైన వర్ణన.

కాబట్టి ఆప్ వ్యవహరిస్తున్న తీరులో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ఈ పార్టీ 'మీడియన్ ఓటర్ థియరీ'ని (మధ్యస్థ ఓటరు సిద్ధాంతాన్ని) చాలా శ్రద్ధగా పాటిస్తున్నదని చెప్పొచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం, ఏ పార్టీ అయితే అటూయిటూ కాని ఓటర్ల ('మధ్యస్థ' ఓటర్ల) అభిప్రాయాన్నిసరిగ్గా పట్టుకోగలుగుతుందో ఆ పార్టీయే ఓట్ల దందాలో గెలుస్తుంది. ఈ మధ్యస్థ ఓటరు మితవాదంవైపు మొగ్గుచూపిస్తే పార్టీ కూడా అటువైపే మొగ్గు చూపాలి. మొక్కవోని ఓట్ల వెంపర్లాటలో ఆప్ పాటిస్తున్నది ఈ సూత్రాన్నే. సంఘ్ పరివార్ ఈ మధ్యస్థ ఓటర్ల అభిప్రాయాన్ని మితవాదం వైపు మొగ్గేట్టు చేసింది. ఆప్ ఇప్పుడు ఈ ఓటర్ల అభిప్రాయంతో తన అభిప్రాయాల్ని పోల్చుకునేందుకు తహతహలాడుతోంది. ఈ పార్టీ దగా చేసినప్పుడల్లా రాజకీయ విశ్లేషకులు ఇంకా ఆశ్చర్యపోవటమన్నదే అసలు ఆశ్చర్యపడాల్సిన విషయం. అందమనేది చూసేవాళ్ల కళ్ళల్లో ఉంటుందంటారు, వంచన అనేది కూడా అంతే.

ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపుపట్ల వెల్లువెత్తిన ఉత్సాహంపై చన్నీళ్ళు చల్లినందుకూ, తన లౌకిక అభిమానులకి తగిన శాస్తి చేసినందుకూ, మనం నిజానికి అరవింద్ కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలుపుకోవాలి. రాజకీయ ప్రత్యామ్నాయాలకీ ప్రత్యామ్నాయ రాజకీయాలకీ మధ్య చాలా తేడా ఉందని మనకి తెలిసొచ్చేలా చేసినందుకు కూడా ఆయనకి ధన్యవాదాలు తెలుపుకోవాలి. ఆయన ఇప్పుడు రాజకీయంగా ఆశిస్తున్న స్థితి ఆయనకు ఢిల్లీ అవతల ఏమన్నా ఒనగూరుస్తుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. కాని ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పొచ్చు: మోదీని గద్దె దించటంలో ఆప్ మనకు సాయపడవచ్చు, కానీ మన గణతంత్రాన్ని మళ్ళీ దక్కించుకోవటంలో మాత్రం అది సాయపడలేదు. ■

## జనవాక్యం

### ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం!

ఉద్యోగులకు రావలసిన నాలుగు విడతల కరువు భత్యం ఇంతవరకు చెల్లించలేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎలాంటి కమిటీలు లేకుండా కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తెస్తానని హామీ ఇచ్చింది. కానీ, 9 నెలలు గడిచిపోయినా హామీ హామీలానే ఉండిపోయింది. కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఆరు నెలలకోమారు కరువు భత్యం ప్రకటిస్తున్నది కానీ రాష్ట్రం మాత్రం ప్రకటించడం లేదు. న్యాయంగా ఇవ్వాల్సిన డీఏలు కూడా ఉద్యమాలు చేసి తెచ్చుకోవలసిన అవసరం ఏర్పడడం బాధాకరం ! మరో పక్క వేతన సవరణ సంఘం కాలపరిమితిని పెంచుతూ పోతున్నారు. ఇలా ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక పరమైన సమస్యలను ఏమాత్రం పట్టించుకోక పోవడం చాలా ఆశ్చర్యకరం. కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను నిర్వహించక పోవడం వలన సిఫార్సులతో కొంతమంది ఉపాధ్యాయులు అక్రమ బదిలీలు పొందుతున్నారు. దీనివలన సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. వారికి రావాల్సినవన్నీ వెంటనే అందించాలి.

**– తరిగోపుల నారాయణస్వామి ,**
రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

### వృద్ధాప్య పెన్షన్ కనీసం పదివేలు ఉండాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అడగకుండానే ఆటోవాళ్లకు పదివేలు ఇచ్చాడు. అదేవిధంగా ముసలివాళ్ళకిచ్చే వృద్ధాప్య పెన్షన్ కూడా నెలకు పదివేలు ఇవ్వవలసిన అవసరం ఉంది. ఏవిధమైన ఆధారంలేని వాళ్ళేకదా ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నది. ముసలి వృద్ధదంపతులకు ఈరోజుల్లో పదివేలు లేనిదే కాపురం గడవదు. ఉల్లిపాయలు కేజీ వంద, కూరగాయలు కేజీ 50 ....60 రూపాయల కనీసం పలుకుతున్నాయి. రిటైర్ అయిన ఉద్యోగులు నెలకు 30 వేలనుండి 70 ....80 వేల దాకా పొందుతున్నారు. ఐదు సంవత్సరాలు అన్ని సౌకర్యాలు పొంది నెలకు లక్షల్లో జీతం తీసుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా భారీమొత్తంలో పెన్షన్ ఇస్తున్నారు కదా! ముసలివాళ్ళకి నెలకు పదివేలు పెన్షన్ ఇచ్చినందు వల్లల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీలేదు. వృద్ధులను ఆదుకోవడం నాగరిక సమాజ లక్షణం.

**– నార్నె వెంకట సుబ్బయ్య**

### త్యాగధనులకు అండగా నిలవాలి

అమరావతి సంపూర్ణ రాజధానిగా అభివృద్ధి చెందటం 2050కి పూర్తి కావచ్చు. 1956 లో కొన్ని గ్రామాల సముదాయంగా ఉన్న హైదరాబాద్ భాగ్యనగరంగా రూపుదిద్దుకోటానికి 58 సంవత్సరాలు పట్టలేదా? అమరావతిలో కేవలం 3 ఏళ్ళ(భూసేకరణ జరిగిన తరువాత) కాలంలో సచివాలయ భవనాల సముదాయం, శాసనసభా భవనం, రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన భవనాలు నిర్మింపబడి పూర్తిస్థాయిలో పనిచేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా దిశానిర్దేశం లేకుండా, ఆర్థిక స్వావలంబనే లేకుండా ఏర్పాటు చేసిన నూతన రాష్ట్ర చరిత్రలో 5 సంవత్సరాలు ఎంత చిన్న సమయమో చెప్పాల్సిన అవసరం లేదు కదా! కానీ మూడేళ్లలోనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేయగలిగిన నాలుగు అంగాలు అమరినై అంటే అది అభివృద్ధి కాదా? గవర్నరు నివాసం, న్యాయాధికారుల నివాసాలు, ఎమ్మెల్యేల నివాస సముదాయం, కార్యదర్శుల, సచివాలయ(గజిటెడ్, నాన్–గజిటెడ్, నాల్గవ తరగతి) ఉద్యోగుల నివాసాలు 90 శాతం నిర్మింపబడి ఉంటే అభివృద్ధి జరగలేదంటే ఎవరైనా నమ్ముతారా? రాష్ట్రం నాలుగు మూలలనుండి రాజధానిని కలపటానికి ఉద్దేశితమైన రహదారులు నిర్మాణ దశలో ఉంటే అభివృద్ధిగా భావించలేమా? కొన్ని ప్రతిష్ఠాత్మకమైన విద్యాలయాలు ప్రారంభమై పనిచేయటం గమనించలేమా!. 'అన్నప్రాసన నాడే ఆవకాయ' తినాలనుకొనే మూర్ఖ స్థితిలో ప్రజాలుంటారా ఎక్కడైనా? రాజధాని నిర్మాణ క్రమంలో జరిగిన పనులు అసలు జరగనట్టు అక్కడ స్మశాన నిశబ్దం, ఎడారి వాతావరణం, నీటి ముంపు ఉన్నదన్నట్టు ప్రచారమేమిటి.?. రాజధాని అంటే పబ్బులు, క్లబ్బులు, భూమాఫియాలు, డాన్లు ఉన్నదే అనుకొంటే 'నిజమే' అమరావతి ఆ విధంగా అనుకున్నంత త్వరగా అభివృద్ధి చెందటం కష్టమే. 'తలచుకున్నప్పుడే తాత పెళ్ళి' లాగా జరగాలంటే సాధ్యమా? ఎప్పుడో ఉచితంగా జీవనోపాధికై ఇవ్వబడి తరతరాలుగా దానిమీదే ఆధారపడి బతుకుతున్న పేదల (అసైన్డ్) భూమి ఇప్పుడు ఇళ్ల స్థలాలకోసమని ప్రభుత్వం లాగేసుకుంటే ఆవేదనతో కాగిపోతున్న బడుగు రైతులు, బంగారం పండిస్తున్న పంట పొలాలను రాజధానికోసం ఇచ్చిన రైతులు ఆవేదనతో నిస్సహాయ స్థితిలో 75 రోజులుగా చేస్తున్న ఉద్యమానికి కళ్ళు చెమరుస్తున్నాయి. ఈ తరుణంలో త్యాగధనులైన రైతులకు, సాధారణ ప్రజలకు అందరం అండగా నిలబడకుంటే దశాబ్దాలు తిరోగమనంలోకి పోయే ప్రమాదముంది.

**– పన్నాల సత్యనారాయణ మూర్తి**
అధ్యక్షుడు, ఆంధ్ర ప్రయోజన పరిరక్షణ సమితి

### దేవుడు కూడా మాస్క్ పెట్టుకునే ఉన్నాడు



*దయ్యాన్ని నమ్మలేదు దైవాన్ని కూడా నమ్మలేదు*
*మృత్యువే ఏడుస్తూ చెప్తుంటే*
*కరోనాను నమ్మక తప్పలేదు*
*ఐసొలేషన్ వార్డులను కొత్తగా సృష్టించేదేమిటి?*
*ఇక్కడ అవి చిరకాలంగా ఉండనే ఉన్నాయి*
*ప్రయాణ సాధనం ఎంత గొప్పదైతే అంత ప్రమాదం*
*అందరికీ అందరిమీదా అనుమానం*
*కనిపించని సూక్ష్మజీవి మీద కరవాలం ఝుళిపించి*
*జీవితం వైపు బరిలో నిలబడ్డాడు డాక్టర్*
*తెల్లని వస్త్రాలతో అంతకంటే తెల్లని మనసుతో*
*మరణ ప్రాంగణంలోకి తెగించి వెళ్లింది సిస్టర్*
*మందులు, ధైర్య వచనాలు కూడా రోగి వెన్నంటే ఉన్నాయి*
*ఉనికి కోసం, ఊపిరి కోసం పోరాడుతున్న*
*రోగి మనసొక ఉరిభూమి*
*అతని ఇంట్లో క్షణాలు రంపపు ముళ్లు*
*మృత్యువు అంచుల దాకా వెళ్లి వచ్చిన వాడు చెప్తున్నాడు*
*అక్కడ దేవుడు కూడా మాస్క్ పెట్టుకునే ఉన్నాడట!*

**– అమ్మంగి వేణుగోపాల్**

# చరిత్ర ధన్యుడు మధునాపంతుల

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి సిద్ధార్థి నామ సంవత్సరం ఫాల్గుణమాసంలో పౌర్ణమి రోజున (1920 మార్చి 5) తూర్పుగోదావరి జిల్లా ఐలెండు పోలవరంలో పూర్ణచంద్రుడిలా మాతామహుని ఇంట ఉదయించారు. తండ్రి సూర్యనారాయణమూర్తి, తల్లి సుబ్బలక్ష్మి.

విశ్వనాథ వారి పేరు వినగానే ' రామాయణ కల్పవృక్షం' స్ఫురించినట్లు మధునాపంతుల వారి పేరు వినగానే 'ఆంధ్రపురాణం' జ్ఞప్తికి వస్తుంది. సంప్రదాయ కవిత్వం రాసే కవులలో అత్యంత నవీనుడు, అభినవాంధ్ర కవులలో అత్యంత సంప్రదాయ కవి తల్లజుడు మధునా పంతుల అని సాహిత్యవేత్తలు అందరూ ముక్తకంఠంతో ప్రశంసించారు.

12వ శతాబ్దంలో కశ్మీర్ పండితుడు కల్హణుడు కశ్మీరు రాజుల చరిత్రను గ్రంథస్థం చేశాడు. 'రాజతరంగిణి' అనే పేరుతో చరిత్రను గ్రంథస్థం చేసిన మొదటి కావ్యమది. అటు తరువాత ఆ రీతిలో ఆంధ్రదేశచరిత్రను గ్రంథస్థం చేసిన వారు మధునాపంతులవారే. ఈ కారణంగా ఆయన 'ఆంధ్ర కల్హణుడు' గా సుప్రసిద్ధులయ్యారు. 'రాజమహేంద్రిలో నడయాడుతున్న నన్నయ' అని మధునాపంతుల వారిని కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ప్రశంసించారు.

మహాకావ్యం 'ఆంధ్ర పురాణం'తో పాటు తోరణం, శ్రీఖండం, చైత్రరథం, కేళాకుళి, సదాశివ సంచాశిక మొదలైన ఖండ కావ్య కృతులు మధునాపంతుల వారి లేఖిని నుంచి వెలువడ్డాయి. ఆయన మరో సుప్రసిద్ధ గ్రంథం 'ఆంధ్ర రచయితలు'.

నన్నయగారిపైన తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటూ మధునాపంతుల వారు ఎన్నో వ్యాసాలను రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ వ్యాసాలను 'వ్యాసపీఠం' పేరుతో ప్రచురించారు. 'తెలుగు సారస్వత ప్రపంచమును నిరంతరముగా వెలిగించిన దివ్య తేజోమయుడు' అనీ, . 'వాఙ్మయవాహినికి శుచిత్వ సిద్ధిని ప్రసాదించిన వాగనుశాసనుడు' అనీ నన్నయపైన తమ అపార భక్తి ప్రపత్తులను మధునాపంతుల వారు ప్రకటించుకున్నారు. నన్నయ గురించి ఇంకా ఇలా అన్నారు: 'నన్నయ నాటికి తెలుగు జాతి వ్యవహరించే భాష తక్కువది కాదు. ఎంతో తియ్యనైనది. రసగూఢమైన భాష. ఛందోలావణ్యంతో తరంగితమై ఉన్న నాటి తెలుగు వాఙ్మయం గోక్షీరం వంటిది. గాఢ ప్రతిభా సంపన్నుడైన నన్నయ ఆ పాల నుండి నవ్యనవనీతం ఎత్తి తీసినాడు. ఆ వెన్న వెచ్చబెట్టినాడు. గుమగుమలాడే గోఘృతం అయింది. అదే ఆంధ్రమహాభారత సారస్వతం. వెయ్యేండ్లు అన్నమాట ఏమిటి? ఆ నెయ్యి కావ్యప్రపంచంలో కల్పాంతస్థాయి ఉత్తరోత్తర యుగాల సాహిత్య జీవులకూ తేజోదాయి. ఋషి తుల్యుడు నన్నయ. ఆయన తెలుగు పద్యం రసప్రపూర్ణ సరోవరంగా భావుకులను పిలిచి అవగాహనం చేసుకోమంటుంది'. అలా నన్నయగారిని వేనోళ్ళ ప్రశంసిస్తూ ఆ వాగామృతధారలో పాఠకుల నోలలాడించిన కమనీయ సారస్వతావతారమూర్తి మధునాపంతుల వారు. ఆంధ్రభాషోద్ధరణకు నడుము కట్టిన నన్నయభట్టారకుని ఆంధ్ర భాషా సేవను, సభ్యరమణీయమైన సారస్వత అభినివేశమును పొందికైన పలుకుబడితో రసరమ్యంగా ఆయన అందించినారు.

పద్యరచన అంటే మధునాపంతుల వారికి ప్రాణప్రదం. 'ఆంధ్రపురాణం'లో

*'ఛందస్సుందరమైన పద్యకవితా సారస్వతంబన్నమా*
*డెందంబూరి సముద్రమై పొరలి గొండ్లింజేయునానందని*
*ష్యందంబై ససిలేని కైతకు లోనైయున్న నే డామహ*
*స్సౌందర్యం బెటు గూరు భారతి భవిష్యం బింక బొల్పారెడిన్'*

అని పద్యరచన పట్ల తమ ఆసక్తిని తెలియజేశారు. 'ఆంధ్రపురాణం'లో శాతవాహనపర్వంలో కావ్యహోమం, చాళుక్యపర్వంలో భారతావతరణం, కాకతీయ పర్వంలో రాణీ రుద్రమాంబ సమర శౌర్యం చాలా ప్రసిద్ధి పొందిన ఘట్టాలు. ఇంకా పునఃప్రతిష్ఠాపర్వం, విద్యానగరపర్వం, శ్రీ కృష్ణదేవరాయపర్వం, విజయపర్వం, నాయకరాజ పర్వం రసవత్తరమైన పద్యాలతో రసజ్ఞులను ఆకట్టుకున్నాయి.

రాణి రుద్రమ ఆంధ్రసామ్రాజ్ఞిగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తుంటే ఓర్వలేని శత్రువులు అసూయతో

*'ఆడుదానికి రాజ్య పట్టాభిషేక*
*వైభవ ప్రాభవములె సెబాసు! మనకు*
*ఇంక ముందాంధ్ర భూమిలో ఇంటనింట*
*కొదవలేదంట పసువు గుంకుమపంట'* అని అనుకున్నారట.

ఈ పద్యంలోని అంత్యప్రాసలు శ్రవణసుభగంగా ధ్వనిస్తాయి. పదలాలిత్యానికీ శబ్ద సౌందర్యానికి అంత్యప్రాసకు 'ఆంధ్రపురాణం' లోని ఎన్నో పద్యాలు ఉదాహరణలుగా నిలుస్తాయి.

దేవగిరి ప్రభువు మహాదేవరాజు ఓరుగల్లు కోటముట్టడించడానికి ఎదురు చూస్తున్నాడని సంస్థానోద్యోగి చెప్పినప్పుడు

*'అంతట ఆంధ్రరాజ్ఞి వదనాబ్జము ద్రిమ్మింగిన కెంపునవ్వుక*
*ల్పాంత నటద్ఘనాఘన విహారతటిల్లతికా సహస్రవి*
*క్రాంతికి స్వాగతంబిడె చకచ్చక దీప్తు విచ్చుగత్తున్*
*సంతన పెట్టె రాజపరిషత్తున కబ్బుర పాటు గొప్పుచున్'*



> ఆంధ్ర మహోజ్జ్వల చరిత్ర గురించి మణులవంటి పద్యాలతో చక్కని మణిహారంను గుది గుచ్చి తెలుగు భాషామతల్లిని అలంకరించిన మహాకవులు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి. సాహిత్య చరిత్రను ధిషణతో సుసంపన్నంచేసి స్వర్ణయుగంగా తన కాలాన్ని సాహిత్యాన్ని తెలుగుభాషా సరస్వతికి సమర్పించిన ధన్యులు మధునాపంతులవారు.

అని రుద్రమను మధునాపంతుల వారు అభివర్ణించారు.

తమ పైకి శత్రువు దండెత్తివస్తాడనేమాట వినగానే ఆమె అబ్జమువంటి ముఖము మింగినకెంపు అంటారు కవి. కోపంతో ఎరుపెక్కిందనో, జేవురించిందనో చెప్తే సామాన్యంగా ఉండి ఉండేది కదా. మింగిన కెంపు అనడంలో చక్కని భావుకత వున్నది. ఆమెలోని శౌర్యము, ఉద్రేకము రాజపరిషత్తునకు ఆశ్చర్యము గొల్పింది అని ఆంధ్ర పౌరుషాన్ని చక్కని పదబంధంతో మధునాపంతుల వారు వ్యక్తం చేశారు.

విద్యానగర పర్వంలో హరిహరరాయ, బుక్కరాయ, విద్యారణ్యస్వామి వంటి వారి చరిత్ర సరళమధురంగా సాగుతుంది. శ్రీనాథ డిండిమభట్టు శాస్త్రార్థ ప్రౌఢ శాస్త్రచర్చను మధునాపంతుల వారు సహృదయ హృదయంగమంగా వర్ణించారు.

కనకాభిషేక ఘట్టంలో

*ఆంధ్రకవి సార్వభౌమ హేమాభిషేక*
*పరమసమ్మాన మంగళాచరణగాన*
*వాద్యనిస్వాన మది యొక్క స్వాతివాన*
*తనుపుగా మొగ్గవిచ్చెముత్యాశా'*

అనే తేటగీతి పద్యం సుదీర్ఘ సమాస భూయిష్ఠమై పాఠకుని హృదయానికి హత్తుకునిపోతుంది. శ్రీరంగధామేశ్వరిపై ఆంధ్రాభ్యుదయ శుభాకాంక్ష పద్యాలతో ఆంధ్రపురాణం పూర్తి అవుతుంది.

*'శతధాక్లుప్త సహస్రధా వివృతక్షానే కశ:కోటిశ*
*స్తత విశ్వోదయ రమ్యరమ్యతర శశ్వత్పుష్టి కళ్యాణి కా*
*రతి పాత్రంబును నెత్తు మమ్మొదలి పేరంటాలివౌ నీదుకం*
*టితుదన్ మ్రెగ్గె వికుంఠనాయక చిరంటీ! ఆంధ్రసామ్రాజ్యముల్'*

అంటూ ఆంధ్రుల, ఆంధ్ర సామ్రాజ్య క్షేమమును కోరుతూ అమ్మవారి పరంగా చేసిన ఈ స్తుతి కవికి గల సామాజిక బాధ్యత, ఆంధ్రాభిమానము సువ్యక్తమవుతాయి. మధునాపంతులవారు. ఆంధ్ర మహోజ్జ్వల చరిత్రను మణుల వంటి పద్యాలతో చక్కని మణిహారమును గుది గుచ్చి భాషా మతల్లిని అలంకరించి ఆంధ్రులందరికీ గర్వకారకులయినారు. సాహిత్య చరిత్రను ధిషణతో సుసంపన్నంచేసి స్వర్ణయుగంగా తన కాలాన్ని సాహిత్యాన్ని తెలుగుభాషా సరస్వతికి సమర్పించిన ధన్యులు మధునాపంతులవారు. ఆయన సమకాలీన మహాకవుల పొగడ్తలను పొందిన శేముషీ ధురంధరుడు.

ప్రాచీన సాహిత్యాన్ని ఆపోశనపట్టిన మధునాపంతువారు ఆధునిక కవుల సాహిత్యాన్నీ చదివారు. ఆధునికకవులను కొనియాడుతూ పలు ప్రసంగాలు చేశారు. భావకవిత్వ మాధురీ దర్శనములో ఆంధ్రావళికి రమ్యాలోకమునిచ్చిన రాయప్రోలు సుబ్బారావు, శిరీషపేశమైన విమర్శనాత్మక సాహిత్యరచనమునకు కర్ణాటక గాంధర్వధారను పారింపజేసిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, 'సాహితీసమితి', 'నవ్యసాహిత్య పరిషత్' ను ప్రతిభా వైభవంతో నడపి గీతినాటికా ప్రక్రియకు ఖ్యాతి తెచ్చిన విద్వజ్ఞుడు తల్లావఝుల శివశంకరశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి వెరసి ఈ నలుగురు అభినవాంధ్ర సారస్వతమును నందన ప్రసవముగా పరిమళింపజేసిన తోబుట్టువులని వారి పట్ల తమ ఆత్మీయతను మధునాపంతువారు చాటుకున్నారు.

చిలకమర్తివారిని ప్రస్తుతిస్తూ 'ఐకమత్యము అను పంచాక్షరీనామమంత్రము ప్రతిమానవుడు పునశ్చరణము చేసి యాచరింపవలెనని ఘోషించినవారాయన' అని చెప్పడం సమకాలికుడైన మరొక కవిని గురించి ఇంతచక్కని ఆత్మీయ ప్రసంగము చేయడం మధునాపంతువారి సంస్కారమునకు నిదర్శనము. పానుగంటివారి గురించి చెప్తూ 'ఆర్జవము, సామరస్యము, ప్రేమ, ధర్మదీక్ష, శివేతరక్షతి, జగత్కల్యాణము పానుగంటి వారి మనోరథము' అని అన్నారు. పానుగంటి వారి సాహిత్య సృష్టి తెలుగువారికి సనాతనమైన పుష్టి, వారి కృష్ణభక్తి సర్వారాధ్యము. పానుగంటివారి యశోలక్ష్మికి 'సాక్షి' వ్యాసాలు స్వర్ణసింహాసనమును ఘటించినవని' పానుగంటి వారిని కొనియాడిన సహృదయుడు మధునాపంతువారు.

పండితుడైన కవి, పరిశోధకుడైన విమర్శకుడు కనుకనే మధునాపంతుల వారు తమ 'ఆంధ్ర రచయితలు'లో పలువురు రచయితల అంతర ప్రతిభా స్వరూపాన్ని విస్పష్టంగా ఆవిష్కరించారు. బహుభాషావేతృత్వం, నిరంతరాయ సాహిత్య కృషి వంటి మహా లక్షణాలు కలిగిన అసమాన ప్రతిభాశాలి కనుకనే మధునాపంతుల వారిని విశ్వనాథ వారు 'కవిప్రభువు'అని ప్రశంసించారు.

ఆయన ఖండ కావ్యాల పైన సుప్రసిద్ధ విమర్శకులు రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు చక్కని విమర్శా వ్యాసాలు రచించారు. ఆయన 'రత్న పాంచాలిక' నాటకం ప్రసిద్ధ నాటక ప్రయోక్త వాడ్రేవు సుందరేశ్వరరావు దర్శకత్వంలో పలు ప్రదర్శనలకు నోచుకున్నది.

*'బుధులెన్నుతియించ నాంధ్రచరితల్ పూర్వోక్తమార్గమ్మునన్*
*సుధబంచ రచించె భవ్యకవితా శోభాయమానుడుశ్రీ*
*మధునాపంతు వంశమండనుడు శ్రీమత్సత్యనారాయణుం*
*డుధరన్ కీర్తివహింపనాదు కయిమోడ్పుల్ తత్కవిస్వామికిన్'*

అని వానమామలై వరదాచార్యులు మత్తేభ పద్యంలో ఈ కవి దిగ్గజాన్ని ప్రశంసించారు.

**– ఎర్రమిల్లి శారద**

(నేడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి శత జయంతి)

కరోనా కేర్



# ఈ మాస్క్ మేలు!

**కరోనా వైరస్ సోకకుండా ఉండాలంటే ముఖానికి మాస్క్ ధరించాలనే విషయం అందరికీ తెలిసిందే! అయితే మాస్క్ ఎంపిక మొదలు, ధరించి, తీసే విధానాల పట్ల కూడా అవగాహన అవసరం.**

**ఈ మాస్క్ మేలు!**

ఎన్ 95, ఎన్ 99 మాస్క్‌లు రెండూ సురక్షితమైనవే! ఈ రెండింటిలోనూ పీల్చే గాలిని వడగట్టే ఫిల్టర్లు ఉంటాయి. అయితే ఎన్ 95 పీల్చుకునే గాలిని 95% శుద్ధి చేస్తే, ఎన్ 99, గాలిని 99% శుద్ధి చేస్తుంది. కాబట్టి ఎన్ 99 మాస్క్‌తో వైరస్ సోకే అవకాశం తక్కువ.

**వాడే పద్ధతి..**

- ఆల్కహాల్‌తో తయారైన హ్యాండ్ వాష్ లేదా సబ్బుతో చేతులు తరచుగా కడుక్కుంటూ, మాస్క్‌లు కూడా వాడుతూ ఉంటేనే కరోనా వైరస్ నుంచి పూర్తి రక్షణ దక్కుతుంది. కాబట్టి మాస్క్ ధరించి, తీసిన ప్రతిసారీ చేతులు శుభ్రం చేసుకోవాలి.
- మాస్క్ ధరించినప్పుడు ముక్కు, నోరు పూర్తిగా కవర్ అయ్యేలా చూసుకోవాలి.
- మాస్క్ తడిస్తే వెంటనే మార్చాలి.
- సింగిల్ యూజ్ మాస్క్‌లను తిరిగి వాడకూడదు.
- మాస్క్‌ను ముందు నుంచి కాకుండా, వెనక వైపు నుంచి తొలగించాలి.
- మాస్క్ ముందరి భాగాన్ని చేతులతో తాకకూడదు. పొరపాటున తాకితే వెంటనే చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- తొలగించిన మాస్క్‌ను మూత ఉన్న చెత్త డబ్బాలో వేసి, సబ్బుతో చేతులు కడుక్కోవాలి.

న్యూస్‌మేకర్



సమస్యలను పరిష్కరించగల సమర్థత ఉన్న నాయకురాలిగా భారత సంతతికి చెందిన సీమావర్మ మీద అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అపారమైన నమ్మకం. 2017లో సెనేట్ ఆమెను సీఎంఎస్ (సెంటర్స్ ఫర్ మెడికేర్ అండ్ మెడికేడ్ సర్వీసెస్)అడ్మినిస్ట్రేటర్‌గా ఎన్నుకొంది. దేశానికి కోవిడ్ లాంటి ఆపద చుట్టుముట్టగానే 'వైట్‌హౌస్ కరోనా టాస్క్‌ఫోర్స్'లో సభ్యురాలిగా ఆమెకు కీలక బాధ్యతలు అప్పజెప్పారాయన. అమెరికాలో శక్తిమంతురాలైన రాజకీయ నాయకురాలుగా ఎదిగిన సీమ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం.

# సంస్కరణల సాహసి!

అగ్రరాజ్యం అమెరికాను కోవిడ్ - 19 వణికిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఈ విపత్తును ఎదుర్కొనేందుకు జనవరి 30న వైట్‌హౌస్‌లో 'కరోనా టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేశారు. తాజాగా ఇందులో భారతీయ అమెరికన్ సీమావర్మకు ట్రంప్ చోటు కల్పించారు. ఆమె శక్తిసామర్థ్యాలపై ట్రంప్‌నకు ఎంతో నమ్మకం అంటే అతిశయోక్తి కాదని ఆమె గత విజయాలు రుజువుచేస్తాయి.

**హెల్త్‌కేర్ సంస్కరణల రూపశిల్పి...**

సీమావర్మ 1993లో యూనివర్సిటీ ఆఫ్ మేరీ ల్యాండ్ కాలేజీ పార్క్ నుంచి లైఫ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ చదివారు. తరువాత హెల్త్ పాలసీ కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఆ అనుభవం తరువాత ఆమె రాజకీయ ఎదుగుదలకు బాగా ఉపయోగపడింది. ఆ రంగంలో 20 ఏళ్లుగా గడించిన అనుభవంతో అమెరికాలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన హెల్త్‌కేర్ సంస్కరణల రూపకల్పనలో పాలు పంచుకున్నారు. అలా హెల్త్‌కేర్ సంస్కరణల రూపశిల్పిగా పేరుతెచ్చుకున్నారు.

2001లో 'ఎస్వీసీ' ఇంక్ పేరుతో ఆమె ఒక కన్సల్టింగ్ సంస్థను స్థాపించారు. 2004లో ఇండియానా గవర్నర్‌గా మిచ్ డానియల్స్ ఎన్నికయ్యారు. అప్పుడు ఆయనకు ఇండియానా ప్రాథమిక ఆరోగ్య పథకాన్ని రూపొందించడంలో సహకరించారు. ఆ పథకం అక్కడ బాగా సక్సెస్ అయింది. దాంతో అమెరికాలోని మిగిలిన రాష్ట్రాలు కూడా క్రమంగా ఆ విధానానికి మారాయి. ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఆమెకు అప్పుడు ఉపయోగపడింది. ఆమె సాధించిన ఫలితాలు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయి.

**ట్రంప్ దృష్టిలో...**

బరాక్ ఒబామా ప్రెసిడెంట్‌గా ఉండగా తెచ్చిన 'ఒబామా కేర్'ను ఉపసంహరించుకోవడానికి, నూతన ఆరోగ్య సంరక్షణ సంస్కరణలు తేవడానికి సమర్థమైన సలహాదారు కోసం అన్వేషిస్తున్న క్రమంలో సీమావర్మ ట్రంప్ దృష్టిలో పడ్డారు. అలా 2017లో సెనేట్ ఆమెను సీఎంఎస్ (సెంటర్స్ ఫర్ మెడికేర్ అండ్ మెడికేడ్ సర్వీసెస్) అడ్మినిస్ట్రేటర్‌గా ఎన్నుకొంది. అమెరికా ప్రభుత్వంలో ఆరోగ్యరంగానికి సంబంధించిన అత్యున్నత పదవి ఇది. 13 కోట్ల మంది ప్రజలకు ఈ సంస్థ ఆరోగ్య సేవలందిస్తోంది. వాషింగ్టన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె భగవద్గీత మీద ప్రమాణం చేసి పదవిని చేపట్టారు. ఒబామా కేర్ స్థానంలో ట్రంప్ నూతన ఆరోగ్యబీమాను రూపొందించే బాధ్యతను సీమావర్మకు అప్పజెప్పారు. సీఎంఎస్ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'ఒబామాకేర్' పథకంలో ఆమె కీలక సంస్కరణలు తెచ్చారు. 2017లో అమెరికాలో టాప్ -50 రాజకీయ నాయకుల జాబితాలో సీమావర్మ 26 వ స్థానాన్ని దక్కించుకున్నారు.

> 'ఒబామా కేర్' స్థానంలో ట్రంప్ నూతన ఆరోగ్యబీమాను రూపొందించే బాధ్యతను సీమావర్మకు అప్పజెప్పారు. సీఎంఎస్ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఒబామాకేర్ పథకంలో ఆమె కీలక సంస్కరణలు తెచ్చారు.



కరోనా టాస్క్‌ఫోర్స్‌లో తనను నియమించినందుకు సీమా వర్మ స్పందించారు. "అమెరికా ప్రజలకు సేవ చేయడానికి, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో అవసరమైన భద్రతా ప్రమాణాలను అమలు చేస్తాను" అన్నారు. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడంతో పాటు రోగుల సంరక్షణపై దృష్టి సారిస్తామని ఆమె ట్వీట్ చేశారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# కుమిలిపోతోంది... ఏం చేయాలి?

నా ఫ్రెండ్‌కు పెళ్లయి ఏడేళ్లు అవుతోంది. ముగ్గురు పిల్లలు. ఆమె భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పుడప్పుడు ఇండియా వస్తాడు. అయితే అతనికి పెళ్లికి ముందు నుంచే ఒక అమ్మాయితో సంబంధం ఉంది. అతని తల్లిదండ్రులకు విషయం తెలిసినా దాచిపెట్టి పెళ్లి చేశారు. పెళ్లయ్యాక విషయం నా స్నేహితురాలికి తెలిసింది. పిల్లలు పుడితే మారతాడనుకుంది. కానీ అతను ఇంట్లో కన్నా ప్రియురాలితోనే ఎక్కువ గడుపుతున్నాడు. అత్తమామలకు చెబితే 'నీకేం లోటు చెయ్యడం లేదు కదా' అంటున్నారు. పుట్టింట్లో చెప్పలేక, బాధ భరించలేక సతమతమవుతోంది. కనీసం పిల్లలతో కూడా అతను సరిగా గడపడం లేదు. ఏం చేయాలో తెలియని స్థితిలో నా స్నేహితురాలు కుమిలిపోతోంది. ఏదైనా సలహా ఇవ్వండి.

- మనీషా

పెళ్లయ్యాక మీ స్నేహితురాలి భర్త అక్రమసంబంధం గురించి తెలిసినప్పుడే ధైర్యం చేసి తాడో పేడో తేల్చుకోవలసింది. పిల్లలు పుడితే మారతాడని ఆమె అనుకుంది. విషయం తెలిసినా ఊరుకుంది కదా అని అతను అనుకున్నాడు. అత్తమామలు సహజంగానే కొడుకు పక్షానే ఉంటారు. ఇప్పుడు మీ స్నేహితురాలికి అటు పుట్టింటి ఆసరా లేదు. ఇటు ఉద్యోగం లేదు. పైగా ముగ్గురు చిన్న పిల్లలు. ఈ పరిస్థితుల్లో చట్టపరమైన చర్యలు కోరినా ఏళ్లు పడుతుంది. అందుకే ఆర్థికంగా బలపడటానికి ప్రయత్నించాలి. మీ ఫ్రెండ్ చదువుకుని ఉంటే ఏదన్నా ఉద్యోగంలో చేరాలి. ఆర్థిక స్వావలంబన ధైర్యాన్నిస్తుంది. అలాగే తన పేరున, పిల్లల పేరున స్థిరచరాస్తులు సమకూరేలా చూసుకోవాలి. అప్పుడు ఆమెకే తెలుస్తుంది భర్తను ఎలా మార్చుకోవాలో.

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com



స్త్రీ శక్తి

# మట్టి లేకుండా పంటలు పండిస్తారు!



**ఆమె వ్యవసాయ క్షేత్రం ఇండోర్‌లో ఉంటుంది. అందులో ఆమె ఒక శాస్త్రవేత్త, ఒక రైతు. తన బృందంతో కలిసి ప్రతీ మొక్కను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విచిత్రమేమిటంటే ఆమె పెంచే మొక్కలు మట్టిలో పెరగవు. నీటిలోనే పెరుగుతాయి. ఇలా 'హైడ్రోపోనిక్స్' పద్ధతిలో సాగుతున్న ఈ వ్యవసాయంలో రసాయనాలు, పురుగుల మందులు ఉండవు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన పంటలను 'సిటీ గ్రీన్స్' (స్టార్టప్) పేరిట అందిస్తున్నారు శ్వేతా ఉనియాల్. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...**

"మా స్టార్టప్ ఒకరకంగా ప్రయోగాల వేదిక అని చెప్పొచ్చు. పంటలను వృద్ధి చేసే క్రమంలో మట్టి, వర్షం, ఉష్ణోగ్రత, వాతావరణం, పురుగుమందులు... ఇలాంటి వాటితో పనిలేకుండా... నీటిలో మొక్కల పెంపకం ప్రక్రియపై దృష్టి పెట్టాలనుకున్నాం. అలా 'సిటీ గ్రీన్స్' స్టార్టప్‌ను 2017లో కర్ణాటకలో ప్రారంభించాం.

**పిల్లలకు మంచి ఆహారం అందించాలనే...**

మాది బెంగళూరు. 'ఫుడ్ అండ్ న్యూట్రిషన్'లో మాస్టర్స్ చేశా. న్యూట్రిషనిస్ట్‌గా లండన్‌లో నాలుగేళ్లు, న్యూజిలాండ్‌లో మూడేళ్లు పనిచేశా. ఆ తర్వాత 2010లో బెంగళూరుకు వచ్చేశా. ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీని కొంతకాలం నిర్వహించా. బయట దొరికే ఆహారం కలుషితంగా ఉందని, మా పిల్లలకు మంచి ఆహారాన్ని అందించాలనుకున్నాం. దీనికి పరిష్కారంగా 'హైడ్రోపోనిక్స్' పద్ధతిలో వ్యవసాయం చేయాలని నేను, నా భాగస్వామి ఈ ప్రక్రియను మొదలెట్టాం. దీన్ని ప్రారంభించడానికి ముందు ఎన్నో ప్రయోగాలు చేశాం. ఈ విధానంలో మట్టి వినియోగం ఉండదు. నీటితోనే మొక్కల పెంపకం ఉంటుంది.

**ఎన్నో పరిశోధనలు...**

వివిధరకాల ఆకుకూరలు, కూరగాయలు, స్ట్రాబెర్రీ... ఇలా ఎన్నింటినో ఈ పద్ధతి ద్వారా పెంచుతున్నాం. నీటితో పెంచిన పంటలు కాలుష్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. మా వ్యవసాయ క్షేత్రంలో హైడ్రోపోనిక్స్, వర్టికల్ ఫార్మింగ్‌లో రకరకాల పరిశోధనలు నిర్వహిస్తున్నాం. మాకు అహ్మదాబాద్‌లో 8,700 ఎకరాల భూమి ఉంది. అక్కడే అధ్యయనంతో పాటు పంటలు పండిస్తున్నాం. మన దేశంలో ఇదే అతిపెద్ద సెంటర్. మా ఉత్పత్తులను పరీక్షించిన తర్వాతే మార్కెట్‌కు పంపుతాం. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, ముంబయి, ఢిల్లీ, చెన్నై... ఇలా పలు నగరాల్లో మా వినియోగదారులున్నారు. ప్రస్తుతం అర్బన్ కుటుంబాల్లో తమ బిడ్డలకు ఆరోగ్యకరమైన ఫుడ్ పెట్టాలనే చైతన్యం తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఇది ఆరోగ్యానికే కాదు... పర్యావరణ పరిరక్షణకు కూడా శుభ పరిణామంగా చెప్పొచ్చు.

**భవిష్యత్ హైడ్రోపోనిక్స్‌దే...**

మేము అనుసరిస్తున్న హైడ్రోపోనిక్స్ విధానాన్ని పట్టణ రైతులకు, ఆసక్తి ఉన్న యువతకు, మహిళలకు నేర్పుతున్నాం. నగరాల్లో టెర్రస్ గార్డెనర్స్‌కు కూడా హైడ్రోపోనిక్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. నిజం చెప్పాలంటే హైడ్రోపోనిక్స్‌దే భవిష్యత్. ఆయా ప్రభుత్వాలు కూడా ప్రస్తుతం దీనిపై దృష్టి పెడుతున్నాయి. ఈ విధానంలో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. హైడ్రోపోనిక్స్ పద్ధతిలో ఇండోర్, అవుట్‌డోర్ సిస్టమ్‌లో మొక్కలు పెంచొచ్చు. ఇండోర్ సిస్టమ్‌లో ఈ విధానంలో మొక్కలు పెంచడం కాస్త ఖర్చుతో కూడిన పని. ఎవరైనా ఇంట్లోగాని, బయట గానీ హైడ్రోపోనిక్స్ వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేసుకోవాలనుకుంటే కూడా వారికి మా సేవలు అందుబాటులో ఉంటాయి.

సాధారణంగా మొక్కలకు సూక్ష్మ, స్థూల పోషకపదార్థాలు అవసరముంటాయి. మట్టి ఆధారిత వ్యవసాయ క్షేత్రాలకు ఎలాంటి పోషకాలు అవసరమో కూడా డిజైన్ చేసి క్లయింట్లకు ఇస్తాం. పొలాన్ని బట్టి ఆ మట్టిలో లోపించిన పోషకాలను అందించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. మొక్కలు నీటి సహాయంతో పెరిగేటప్పుడు అందులో పోషకాలు ఉండవు. అందుకే ఉత్పత్తి వృద్ధి రేటు పెంచాలంటే ఈ పద్ధతిని అనుసరించేటప్పుడు సమతుల్యతగల పోషకాల పద్ధతిని పాటించాలి. ఇందులో మేము చేసిన అధ్యయనాలు, పరిశోధనల కృషిని గమనించి 'ఎకోసిస్టమ్ పార్టనర్స్' మా స్టార్టప్‌కు మద్దతును అందిస్తున్నారు.

**అవగాహన సైతం...**

హైడ్రోపోనిక్స్‌లో అన్ కేటగిరైజ్డ్, వర్టికల్ ఫార్మింగ్, ప్లాంట్ న్యూట్రిషన్, అర్బన్ ఫార్మింగ్, మూలికలు, గ్రీన్స్, కూరగాయలు వంటి విభాగాలుంటాయి. అన్నింటిలో శిక్షణ ఇస్తాం. అవగాహన పెంచుతాం. సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన అన్ని కోణాలనూ గార్డెనింగ్‌లో అనుసరించేలా కృషి చేస్తున్నాం. పట్టణ వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ పంటల ద్వారా నగరవాసులను పట్టి పీడిస్తున్న క్రానిక్ లైఫ్‌స్టయిల్ జబ్బులను తగ్గించడానికి కృషి చేస్తున్నాం. ఈ రంగంలో మా ప్రగతికి గుర్తింపుగా 'అగ్రీ ఉడాన్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ యాక్సిలిరేటర్ 2.0'లోని 40 స్టార్టప్‌లో బెస్ట్‌గా ఎంపికయ్యాం. ఈ సందర్భంగా మేము అందరికీ చెప్పేది ఒక్కటే... కాలుష్యరహిత, పోషకసహిత, తాజా పంటలనే తినండి. ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించండి.

• నాగసుందరి

## కష్టమేమీ కాదు...

మట్టిని ఉపయోగించకుండా మొక్కలను పెంచే విధానం హైడ్రోపోనిక్స్. మొక్కల వేర్ల వ్యవస్థ వ్యాప్తికి మట్టిగుళికలు, కుళ్లిన నాచు వంటివి వాడతారు. మట్టి కన్నా కూడా ఇందులో ఖనిజాల స్వీకరణ శక్తి బాగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల మొక్క వేర్లకు పోషకాలు నేరుగా అందుతాయి. ప్లాంట్ సైన్స్ తెలుసుకోవడంతో పాటు మొక్కలకు సరైన వాతావరణం కల్పిస్తే హైడ్రోపోనిక్ పద్ధతిలో పంటలు పండించడం కష్టమేమీ కాదు.



అధ్యయనం

# డైరెక్టర్ పదవి.. ఆమెకు దూరం!

పనిచేసే చోట లింగ వివక్ష, వేతనంలో అంతరం... ఇవి ఎన్నో ఏళ్లుగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు. వాటికి తోడు పదోన్నతుల్లోనూ వారికి న్యాయం జరగడం లేదు. అన్ని అర్హతలు, సామర్థ్యం ఉన్నాకూడా స్వతంత్ర హోదా ఉన్న డైరెక్టర్ పదవి మాత్రం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేసే చాలా మంది మహిళలకు ఇప్పటికీ అందని ద్రాక్షే. మహిళలు సరైన నిర్ణయాలు తీసుకోరని, బలహీనులని... ఇలా ఏదో ఒక సాకుతో వారిని డైరెక్టర్ హోదాకు ఎంపికచేయని కంపెనీలు బోలెడున్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి.

భారతదేశంలోని 1000 పెద్ద కంపెనీల్లో కనీసం 150 కంపెనీలు స్వతంత్ర డైరెక్టర్ హోదాలో మహిళను నియమించాల్సి ఉంది. గడువు సమీపిస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వాటి నిరాసక్తతకు అద్దం పడుతున్నాయి. అయితే చాలా కార్పొరేట్ కంపెనీలు మహిళల్ని స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించేందుకు ఆసక్తి చూపడం లేదని, ఏకాభిప్రాయానికి రావడం లేదని 'ప్రైమ్ డేటాబేస్' సంస్థ నిర్వహించే 'ఎన్ఎస్ఈఇన్ఫోబేస్ డాట్ కామ్' నివేదిక చెబుతోంది.

**సెబీ ఆదేశించినా...**

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 2018లో నియమించిన ఉదయ్ కోటక్ కమిటీ ఏప్రిల్ 1 2019 నాటికి 150 పెద్ద కంపెనీల్లో కనీసం ఒక మహిళా ఉద్యోగి అయినా స్వతంత్ర డైరెక్టర్‌గా ఉండాలని సూచించింది. 2020 వచ్చేసరికి 1000 ప్రముఖ కంపెనీల్లో ఒక ఉద్యోగిని బోర్డ్ డైరెక్టర్‌గా ఉండాలని చెప్పింది. కంపెనీ యాక్ట్ చట్టం 2013 కూడా కొన్ని రకాల కంపెనీల్లో తప్పనిసరిగా ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించాలని ఆదేశించింది. ఈ నిబంధన అక్టోబర్ 2014 నుంచి అమలులో ఉంది. కంపెనీ బోర్డ్ రూమ్స్‌లో జెండర్ వ్యత్యాసం ఉండాలనే లక్ష్యంతో ఈ నియమం పెట్టారు. దాంతో కొన్ని కంపెనీలు అమలుచేశాయి.



2015లో 1,676 ఉన్న మహిళా డైరెక్టర్ల సంఖ్య 2020 ఫిబ్రవరి 21 నాటికి 2,412కు పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో నమోదై ఉన్న 1,829 కంపెనీల్లో 1,755 కంపెనీల్లో మాత్రమే ప్రస్తుతం 1,930 మంది మహిళలు బోర్డ్ డైరెక్టర్లు (ఎగ్జిక్యూటివ్, నాన్‌ఎగ్జిక్యూటివ్ కలిపి)గా పనిచేస్తున్నారని ప్రైమ్ డేటాబేస్ నివేదిక చెబుతోంది.

"మహిళా ఉద్యోగుల ప్రమోషన్‌లో వివక్ష కొనసాగుతూనే ఉంది. అందుకు కారణం నిర్ణయాలు తీసుకొనే వారంతా మగవాళ్లే కావడం" అంటారు బయోకాన్ సంస్థ యజమాని కిరణ్ మజుందార్ షా. అయితే స్వతంత్ర డైరెక్టర్ పదవికి అర్హులైన ఉద్యోగినులు చాలామందే ఉన్నారని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిభ



# మైక్రోసాఫ్ట్ మెచ్చిన వీడియోగేమ్

ఒక కొత్త ఆలోచన విజయానికి దారులు వేస్తుంది. గుర్తింపునూ తీసుకొస్తుంది. ఇందుకు మంచి ఉదాహరణ లూథియానాకు చెందిన పదమూడేళ్ల నమ్య జోషి. స్థానిక సెయింట్ పౌల్ మిట్టల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న నమ్య మైన్‌క్రాఫ్ట్ పేరుతో వీడియోగేమ్ తయారుచేసి మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లను కలిసే అవకాశం దక్కించుకుంది. యంగ్ ఇన్నోవేటర్స్ సమ్మిట్‌లో భాగంగా సత్య నాదెళ్ల కొత్త కొత్త ఆవిష్కరణలు చేసిన యువతను కలుసుకున్నారు. అందులో భాగంగా నమ్య ఐడియాను సత్య నాదెళ్ల అభినందించారు. నమ్య తయారుచేసిన వీడియో గేమ్ పిల్లల్లో చదువుకోవాలనే ఆసక్తిని పెంచుతుంది. ఒకవేళ పిల్లలు పుస్తకాలు చదవడం పట్ల ఆసక్తి చూపకపోతే ఆ పాఠాలను మైన్‌క్రాఫ్ట్‌లో చూపించి ఆసక్తి కలిగేలా చేయవచ్చు. అంతేకాదు క్లాస్‌లో చెప్పే పాఠాలను ఇంటరాక్టివ్ సెషన్స్‌గా మార్చడానికి నమ్య కృషి చేస్తోంది. ఒక గేమ్ స్కూల్ కరిక్యులమ్‌తో ఇంటిగ్రేట్ చేయడమనే నమ్య ఆలోచనను అందరూ మెచ్చుకున్నారు. "మా అమ్మ ల్యాప్‌టాప్‌లో మైన్‌క్రాఫ్ట్ ఇన్‌స్టాల్ చేసి నా సొంతంగా ప్రయత్నించాను. బేసిక్స్‌ను అర్థం చేసుకున్నాను. కొన్ని ట్యుటోరియల్స్ చూశాను. ఆ తరువాత మైన్‌క్రాఫ్ట్ వీడియోగేమ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాను" అంటారు నమ్య. తను ఇప్పటి వరకు 100 మందికి పైగా టీచర్లకు మైన్‌క్రాఫ్ట్ ఉపయోగించే విషయంలో శిక్షణ అందించింది.




## 5 తేడాలు గుర్తించండి



## సరైన నీడను గుర్తించండి



## మంచిమాట

నీ గురించి పదిమంది గొప్పగా చెప్పుకోవాలంటే... నువ్వు వందమంది గొప్పవాళ్ల గురించి తెలుసుకోవాలి.

- డా. సర్వేపల్లి రాధాకృష్ణన్

## డైలీ సుడోకు -298

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | 5 | | 2 | | |
| | | 7 | | 6 | 1 | | | |
| 1 | | | 4 | | | | 6 | 3 |
| | | | | 1 | | 5 | | |
| | 4 | | | | | | 2 | |
| | | 9 | | 7 | | | | |
| 8 | 2 | | | | 3 | | | 1 |
| | | | 9 | 2 | | 3 | | |
| | | 6 | | 8 | | 7 | | |

**సుడోకు - 297 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 8 | 3 | 6 | 9 | 2 | 7 | 4 | 1 |
| 4 | 9 | 1 | 7 | 3 | 8 | 2 | 6 | 5 |
| 6 | 7 | 2 | 5 | 4 | 1 | 9 | 8 | 3 |
| 2 | 4 | 7 | 1 | 6 | 3 | 8 | 5 | 9 |
| 1 | 3 | 8 | 9 | 5 | 4 | 6 | 7 | 2 |
| 9 | 5 | 6 | 8 | 2 | 7 | 3 | 1 | 4 |
| 3 | 6 | 9 | 4 | 7 | 5 | 1 | 2 | 8 |
| 7 | 1 | 4 | 2 | 8 | 9 | 5 | 3 | 6 |
| 8 | 2 | 5 | 3 | 1 | 6 | 4 | 9 | 7 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 5 మార్చి 2020


*ఇంజనీరింగ్‌కు ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఐఐటీలు, నిట్‌లలో సీటు సాధించాలంటే జేఈఈ మెయిన్‌లో మంచి స్కోరు సాధించాల్సిందే. మెయిన్ పరీక్షను లోతుగా విశ్లేషిస్తే విద్యార్థులకు దీనిపై ఉన్న అనేక భయాందోళనలు తొలిగిపోతాయి. గత జనవరిలో నిర్వహించిన మెయిన్ పరీక్షలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఎలాంటి ప్రశ్నలు ఎక్కువగా వచ్చాయో తెలుసుకోవడం ద్వారా ఈసారి మంచి పర్సంటైల్ సాధించే అవకాశాలు మెరుగవుతాయి. ముఖ్యంగా ఆయా పాఠ్యాంశాల్లో మధ్యస్థం, సులువైన వాటిని ఎంచుకొని బాగా ప్రిపేరైతే మంచి పర్సంటైల్ తెచ్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో ప్రశ్నల స్థాయి ఏ విధంగా ఉంది, వాటి ఆధారంగా వచ్చే ఏప్రిల్‌లో ఉండే రెండో సెషన్‌కు ఎలా సిద్ధం కావాలో తెలుసుకుందాం...*

# సులువైన పాఠ్యాంశాలతో జేఈఈలో సక్సెస్



జనవరిలో నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షలో 41 శాతం సులభమైన ప్రశ్నలు ఇచ్చారు. వీటి ద్వారా దాదాపుగా 140 మార్కులు స్కోర్ చేయవచ్చు. దీన్ని బట్టి సరళమైన పాఠ్యాంశాలలో ప్రాధాన్యం ఉన్న అంశాలను ఎంచుకోవడంతో మెరుగైన మార్కులు సాధించవచ్చు అనే విషయం స్పష్టమవుతోంది.

**మొత్తమ్మీద జనవరి సెషన్ జేఈఈ మెయిన్ పరీక్షల్లో వచ్చిన ప్రశ్నల స్థాయి ఇలా ఉంది.**




దీన్ని బట్టి మొత్తం పరీక్షలో 83 శాతం ప్రశ్నలు సులభమైనవి, మధ్యస్థమైనవి. వీటికి సమాధానాలు ఇవ్వడం ద్వారా సాధారణ విద్యార్థులు కూడా మంచి పర్సంటైల్ సాధించవచ్చు.

## సబ్జెక్టుల వారీగా ప్రశ్నల స్థాయి






జగదీష్ కానుకొలను
సబ్జెక్టు నిపుణులు
రాజమహేంద్రవరం

*ముఖ్యమైన పాఠ్యాంశాలను తరచూ పునశ్చరణ చేసుకోవడం, పరీక్షలో తెలియని ప్రశ్నలను, వదిలివేసిన ఆ సమయాన్ని మిగతా వాటికి వినియోగిస్తే మొదటిసారి కంటే పర్సంటైల్‌ను పెంచుకునే అవకాశం ఉంది.*

## ఫిజిక్స్

**సులభమైన పాఠ్యాంశాలు**

- **ఎలక్ట్రోస్టాటిక్స్:** ప్రతీ సంవత్సరం ఈ పాఠ్యాంశం నుంచి నాలుగు ప్రశ్నలు అడుగుతున్నారు.
- **కరెంట్ ఎలక్ట్రిసిటీ:** ఇది చిన్న పాఠ్యాంశం. ఇందులో సులువుగా మార్కులు సాధించవచ్చు. ఈ పాఠ్యాంశం నుంచి కలర్ కోడ్ రెసిస్టెన్స్, ఓమ్స్ లా, తరచుదనం మీద ప్రశ్నలు ఇస్తున్నారు.
- **ఎలక్ట్రోమెగ్నటిజం:** ఇది చాలా సులువైన పాఠ్యాంశం. ఇందులోంచి ప్రతీ సంవత్సరం రెండు ప్రశ్నలు ఇస్తున్నారు.
- **సెమీ కండక్టర్స్:** ఇది అతి సులువైన పాఠ్యాంశం.
- **మోడ్రన్ ఫిజిక్స్:** ఈ పాఠ్యాంశం నుంచి 20 మార్కులను సులువుగానే పొందొచ్చు. ఇందులోంచి ఎక్స్‌రే, పరమాణు నిర్మాణం, రేడియో యాక్టివిటీ, ఫోటోఎలక్ట్రిక్ ఎఫెక్ట్, కేంద్రక విచ్ఛిన్నంపై ప్రశ్నలు అడుగుతున్నారు.
- **తరంగాలు:** ధ్వని తరంగాలు, డాప్లర్ ప్రభావం, వేవ్ ఆప్టిక్స్, స్ట్రింగ్ అంశాల నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు ఇస్తున్నారు.
- **థర్మోడైనమిక్స్:** ఇది చాలా సులువైన పాఠ్యాంశం. కనీసం మూడు ప్రశ్నలు ఇందులోంచి వస్తున్నాయి. అయితే కెమిస్ట్రీలో కూడా ఇదే పాఠ్యాంశం కనిపించినప్పటికీ సంజ్ఞాపరమైన బేధాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్త వహించాలి.

**అంశాల వారీ ప్రాధాన్యం**




## కెమిస్ట్రీ

**సులభమైన పాఠ్యాంశాలు**

- **కర్బన రసాయన శాస్త్రం:** మొదటి సంవత్సరం సిలబస్ నుంచి నామకరణం, రసాయన చర్యలలో రకాలు, ఆమ్లత్వం, క్షారత్వం పాఠ్యాంశాలు ప్రముఖమైనవి. అయితే కర్బన రసాయన శాస్త్రంలో రెండో సంవత్సరం సిలబస్‌కు అధిక ప్రాధాన్యం ఉంది. వీటిలో నామరసాయన చర్యలు, కర్బన పదార్థాల తయారీపై ఎక్కువ ప్రశ్నలు ఇస్తున్నారు. సుమారు 24 శాతం ప్రశ్నలు రెండో సంవత్సరం సిలబస్ నుంచి ఉంటున్నాయి.
- **అకర్బన రసాయన శాస్త్రం:** ఆవర్తన పట్టిక, రసాయన బంధం ముఖ్యమైన పాఠ్యాంశాలు. వీటిలో ఆవర్తన నియమాలు, ఫాజన్ నియమాలు, హైబ్రిడైజేషన్, మాలిక్యులర్ ఆర్బిటాల్ థియరీ, డైపోల్ మూమెంట్ కీలకమైన అంశాలు. డి-బ్లాక్ మూలకాలు, కాంప్లెక్స్‌లు కూడా ప్రాధాన్యం ఉన్న పాఠ్యాంశాలే. వీటిలో నామకరణం, క్రిస్టల్ ఫీల్డ్ థియరీ, ఐసోమెరిజం, లాంతనైడ్ సంకోచం ప్రధానమైనవి. ఎస్, పి-బ్లాకు మూలకాలు సైతం కీలకమే. ఇందులో ఫాస్పరస్, సల్ఫర్‌ల ఆమ్లాలు, ఆక్సైడ్‌లు, బోరాన్ అల్యూమినియం ఆక్సైడ్‌లు, డైమర్ల నిర్మాణాలు ముఖ్యమైనవి.
- **ఫిజికల్ కెమిస్ట్రీ:** మోల్ కాన్సెప్ట్, రిడాక్స్ చర్యలు అతి ముఖ్యమైన పాఠ్యాంశాలు. పరమాణు నిర్మాణంలో బోర్ పరమాణు నిర్మాణం, క్వాంటమ్ సంఖ్యలు, తరంగ ధైర్ఘ్యం, హైసన్‌బర్గ్ సూత్రాలు ప్రధానమైనవి. వాయుస్థితిలో వాండర్‌వాల్ సమీకరణం, కైనటిక్ థియరీ, అణు వేగాలు, ఆకర్షణ సూత్రాలు కీలకం. ఉపరితల రసాయనశాస్త్రం, రసాయన సమతాస్థితి సులువుగా మార్కులు సాధించగల పాఠ్యాంశాలు.

**అంశాల వారీ ప్రాధాన్యం**




## మ్యాథమెటిక్స్

**సులభమైన పాఠ్యాంశాలు**

- సరళ రేఖలు, జంట సరళరేఖలు, మాత్రికలు, లిమిట్స్, కంటిన్యుటీ, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, రెండు బిందువుల మధ్య దూరం కనుగొనటం, బైనామియల్ థీరమ్, అవకలనం, సమన్వయ జ్యామితి, లాగరిథమ్స్, త్రికోణమితి, అవకలన, సమాకలన గణితం, అవకలన కాలిక్యులస్, వృత్తాలు.

**అంశాల వారీ ప్రాధాన్యం**




## జాబ్ కార్నర్

### యాంత్రిక్

ఇండియన్ కోస్ట్‌గార్డ్ యాంత్రిక్ (మెకానికల్) ఖాళీల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: 37
- పోస్టులు - ఖాళీలు: యాంత్రిక్ టెక్నికల్ (మెకానికల్) - 19, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రికల్) - 3, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్) - 15
- అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం, పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత.
- వయసు: 1 ఆగస్టు 1998 - 31 జులై 2002 మధ్య జన్మించి ఉండాలి.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: మార్చి 16, 2020.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 22, 2020
- వెబ్‌సైట్: www.joinindiancoastguard.gov.in/

### డిప్లొమా టెక్నీషియన్

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ - బెంగళూరు, డిప్లొమా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: 12
- విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా
- ఎంపిక: రాతపరీక్ష, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24, 2020
- వెబ్‌సైట్: https://halindia.co.in/

### డేటా ఎంట్రీ ఆపరేటర్

బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) - బెంగళూరు, తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: 19
- భర్తీ చేసే పోస్టులు: డేటా ఎంట్రీ ఆపరేటర్, సపోర్టింగ్ స్టాఫ్.
- అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, డిగ్రీ, సంబంధిత పని అనుభవం.
- ఎంపిక: టెస్ట్ / ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 9, 2020
- వెబ్‌సైట్: www.becil.com



# కరోనా దెబ్బకు థియేటర్లు మూత పడతాయా?

తెలుగు చలనచిత్ర పరిశ్రమపై కూడా కరోనా ప్రభావం చూపుతోంది. ప్రముఖ హీరో ప్రభాస్ ముఖానికి మాస్క్ ధరించి విమానాశ్రయంలో కనిపించారు. ప్రతి ఒక్కరూ కరోనా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆచరణలో ఆయన చూపించారు. మరో అగ్ర హీరో మహేశ్ బాబు 'ముందు జాగ్రత్త తీసుకోవడం మంచిది' అని ప్రజలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిందీ సూచించారు. కరోనాపై ఆయన ఒక ట్వీట్ చేశారు. ప్రజలకు చేసే సూచనలు పక్కన పెడితే... చలన చిత్ర పరిశ్రమపై ఈ మహమ్మారి ఏవిధమైన ప్రభావం చూపిస్తుంది అనే అంశంపై చర్చించడానికి గురువారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని తెలుగు ఫిల్మ్‌చాంబర్‌లో సినిమా పెద్దలు అత్యవసరంగా ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి సమాయత్తం అయ్యారు. ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని బుధవారం సాయంత్రమే సందేశాలు వెళ్లాయి. ఈ సమావేశంలో ఏ నిర్ణయాలు తీసుకొంటారనే ఆసక్తి పరిశ్రమలో నెలకొంది. కరోనా ప్రభావం వల్ల విదేశాల్లో తమ తమ సినిమా చిత్రీకరణలు చేయాలని ప్రణాళికలు వేసుకున్న కొందరు రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరికొందరు విదేశీ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

కొన్ని రోజులు థియేటర్లు మూతపడతాయా? అనే సందేహాలు కొందరిలో వ్యక్తమవుతున్నాయి. కరోనా పుట్టినిల్లు చైనాలో కొన్ని ప్రాంతాలలో థియేటర్లు మూసేసిన సంగతి తెలిసిందే. సినిమా హాలులో ప్రజలు కిక్కిరిసి పోతారు. అక్కడ ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకే అవకాశం ఉండడంతో ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## హీరో కావడం బోనస్!

**- బ్రహ్మాజీ**



"నేను నటుడు అవుదామని చిత్రసీమకు వచ్చా. సినిమాలో నాకు మూడు సన్నివేశాలుంటే చాలనుకునే ఉద్దేశమే తప్ప మరొకటి లేదు. మధ్యలో నేను హీరో అవ్వడమనేది బోనస్! అప్పట్లో హీరో సూపర్‌హిట్ ఇస్తే... రెండేళ్ల వరకూ ఎటువంటి ఢోకా ఉండేది కాదు. ఇప్పుడు ప్రతి శుక్రవారం టెన్షనే. నాకు ఆ గోల లేదు. మంచి పాత్రల్లో నటిస్తూ, ముందుకు వెళుతున్నా. మా అబ్బాయి సంజయ్ హీరోగా పరిచయం అవుతుండటంతో కొంచెం టెన్షన్ ఉంది" అని బ్రహ్మాజీ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓ... పిట్టకథ'. చెందు ముద్దు దర్శకుడు. వి. ఆనందప్రసాద్ నిర్మాత. సంజయ్ రావు, విశ్వంత్ హీరోలు. నిత్యాశెట్టి హీరోయిన్. శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ "అమలాపురంలో వెంకటలక్ష్మి అనే అమ్మాయి అదృశ్యమవుతుంది. ఆమె అదృశ్యానికి గల కారణాలేంటి? అని దర్యాప్తు చేసే అధికారిగా కనిపిస్తా. నా పాత్ర సీరియస్‌గా సాగుతుంది. సినిమా స్ర్కీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా థ్రిల్స్ ఇస్తూ సాగుతుంది. మా అబ్బాయి సినిమా అని కాదు... నిజంగా మంచి చిత్రమిది. మంచి పాత్రతో సంజయ్‌ను తెలుగు ప్రేక్షకులకు దగ్గర చెయ్యాలని ఈ చిత్రం చేశా. తను సినిమాల్లోకి వస్తానని చెప్పినప్పుడు 'ప్రయత్నించు. వర్కౌట్ అయితే ఉండు. లేదంటే నచ్చింది చేస్కో' అని చెప్పా. కృష్ణవంశీ, అనిల్ రావిపూడి, మేర్లపాక గాంధీ తదితరులు సినిమా చూశారు. వాళ్లకు నచ్చింది. ప్రేక్షకులకూ నచ్చుతుందని ఆశిస్తున్నా" అన్నారు.

## త్వరగా చేయడం లేదని తిట్లు తిన్నా!

**- రఘు కుంచె**



"నటుడిగా, సంగీత దర్శకుడిగా నా ప్రయాణంలో ఈ చిత్రం చాలా ప్రత్యేకం" అని రఘు కుంచె అన్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటించడంతో పాటు సంగీతం అందించిన సినిమా 'పలాస 1978'. రక్షిత్ హీరో. కరుణకుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. శుక్రవారం సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రఘు కుంచె మాట్లాడుతూ "సినిమా చూసిన కల్యాణీ మాలిక్ 'ముత్యాల ముగ్గు'లో రావుగోపాలరావు గుర్తొచ్చారని చెప్పారు. త్రివిక్రమ్‌గారు ముందు సినిమా చూసుంటే 'అల... వైకుంఠపురములో' సముద్రఖని పాత్రకు నన్నే తీసుకునేవారని నాగశౌర్య అన్నారు. నా పాత్ర ఇప్పటికే సినిమా చూసినవాళ్లకు నచ్చింది. ఇద్దరు పెద్ద దర్శకులు వేషాలతో పాటు సంగీత దర్శకుడిగా అవకాశం ఇస్తానన్నారు. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నా. 30, 40, 50, 70ఏళ్లలో... దుస్తుల నుండి కేశాలంకరణ వరకు వైవిధ్యం చూపిస్తూ, ఓ వ్యక్తి జీవితంలో నాలుగు దశలను ఆవిష్కరించే పాత్ర పోషించా. ఓ దశ కోసం 'ఇంద్రుడు చంద్రుడు'లో కమల్ హాసన్, మరో దశ కోసం 'నార్కోస్' వెబ్ సిరీస్‌లో పాబ్లో పాత్రను స్ఫూర్తిగా తీసుకున్నా. భవిష్యత్తులో ఇటువంటి పాత్ర మళ్లీ చేయలేనేమో! అంత విలక్షణమైనది. సంగీతం విషయానికి వస్తే... శ్రీకాకుళంలో యాసలో జానపదాలను స్వరపరిచా. వాడుకలో ఉన్న 'నక్కిలీసు గొలుసు', 'బావ వచ్చాడు లప్పా' పాటలను కొత్తగా ఆవిష్కరించా. ఐదుగురు కొత్త సింగర్స్‌ను పరిచయం చేశా. జముకుల కుండ, తప్పెటగుళ్ల వంటి స్థానిక సంగీత వాయిద్యాలను ఉపయోగించా. చిత్రీకరణ చేసేటప్పుడు అక్కడ వినిపించే శబ్దాలను రికార్డు చేశా. నేపథ్య సంగీతం చేయడానికి 48 రోజులు తీసుకున్నా. త్వరగా చేయడం లేదని తిట్లు కూడా తిన్నా. ఒక టైమ్‌లో తమ్మారెడ్డి భరద్వాజగారి ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టేశా. పూర్తిగా స్థానిక సంగీతానికి పెద్ద పీట వేశా. నటుడిగా, సంగీత దర్శకుడిగా పూర్తి సంతృప్తినిచ్చిన చిత్రమిది. నన్ను మరో మెట్టు ఎక్కిస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు.

## నాకు అంతకుమించిన గౌరవం ఏముంటుంది?

**- అన్నపూర్ణమ్మ**



"చిత్రసీమలో నన్నంతా గౌరవంగా చూస్తారు. 'ఒసే.. ఇట్రా' అని ఎవరూ అనలేదు. 'అమ్మా... బావున్నావా?' అని నవ్వుతూ పలకరిస్తారు. 'అమ్మా' అన్నారంటే గౌరవం! అంతకు మించిన గౌరవం ఏముంటుంది? ఆరేళ్ల పిల్లాడి నుండి అరవైఏళ్ల వ్యక్తి వరకూ అందరూ నన్ను గుర్తుపడతారు. అంతకు మించిన అవార్డు ఏముంటుంది? నాకు వస్తున్న పాత్రలు, స్పందన పట్ల సంతోషంగా, సంతృప్తిగా ఉన్నాను" అని అన్నపూర్ణమ్మ అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. మాస్టర్ రవితేజ టైటిల్ పాత్రలో నటించాడు. నర్రా శివనాగేశ్వరరావు (శివనాగు) దర్శకత్వంలో ఎంఎన్ఆర్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ "పిల్లలతో కలిసి కుటుంబం చూడదగ్గ చిత్రమిది. ప్రేమ, హత్యాచార సన్నివేశాలు లేవు. తొలిసారి నా పేరు మీద ఓ సినిమా వచ్చింది. ఆనందమే కదా! కథాంశం విషయానికి వస్తే... 'నేను పని చేస్తా' అని ఓ పిల్లాడు ఇంటికొస్తాడు. అతడు నా మనవడే. కానీ, నాకు తెలియదు. పిల్లాడికి తెలుసు. ఇంట్లోవాళ్లకు పిల్లాడు నచ్చక, ఛాడీలు చెప్తారు. పిల్లాడు దూరమైన తర్వాత మనవడు అని తెలుస్తుంది. తర్వాత మనవణ్ణి ఎలా కలిశాననేది సినిమా. మంచి కథ. దర్శకుడు శివనాగు కష్టపడి తీశాడు. మన ఊళ్లలో ఉండే అందాలు చూపించాడు. జమున, సుధ, బాలాదిత్య, అర్చన, బెనర్జీ, రఘుబాబు, జీవా, హర్ష... పేరున్న నటీనటులతో తీసిన చిత్రమిది. మనవడిగా నటించిన మాస్టర్ రవితేజ బాగా చేశాడు. నిర్మాతలకు నాలుగు రూపాయలు వస్తే సంతోషిస్తా. భయభక్తులతో ఇండస్ట్రీలో అందర్నీ గౌరవిస్తూ ఉన్నాను కాబట్టే... ఇన్నాళ్లు ఉండగలిగా. ఇప్పుడు వెబ్ సిరీస్‌లూ చేస్తున్నా" అన్నారు.
















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 38,409.48 | 11,251.00 | 43,303 | 46,205 | 73.39 | 52.86 |
| 214.22 ↓ | 52.30 ↓ | 857 ↑ | 1225 ↑ | (20 పైసలు) ↓ | ↑ |

ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)



# సర్వత్రా భయం

## స్టాక్ మార్కెట్ మళ్లీ నష్టాల బాట

### 214 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్

### ఇంట్రాడేలో 945 పాయింట్ల ఊగిసలాట

ముంబై: దేశంలో కరోనా వైరస్ (కోవిడ్-19) కేసులు అనూహ్యంగా పెరగడంతో బుధవారం స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ నష్టాల బాటపట్టాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 945 పాయింట్ల మేర ఊగిసలాడిన బీఎస్ఈ సెన్సెక్స్.. చివరికి 214.22 పాయింట్ల నష్టంతో 38,409.48 వద్ద ముగిసింది. చివరి గంటలో లభించిన కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి 563 పాయింట్ల మేర కోలుకోగలిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ నిఫ్టీ 52.30 పాయింట్లు కోల్పోయి 11,251 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లు అధిక అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీల్లో ఇండస్ఇండ్ బ్యాంక్ అత్యధికంగా 3.85 శాతం నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్ 3.79 శాతం, ఐటీసీ 3.30 శాతం తగ్గాయి. అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు 2 శాతం పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. సన్‌ఫార్మా 3.14 శాతం బలపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ 2 శాతం పైగా పుంజుకున్నాయి. బీఎస్ఈలో బ్యాంకెక్స్, ఫైనాన్స్, బేసిక్ మెటీరియల్స్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, మెటల్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, హెల్త్‌కేర్, టెక్నాలజీ సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కన్పించింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 1.61 శాతం చొప్పున నష్టపోయాయి.

### కరోనాకు బీమా కవరేజీ కల్పించండి: ఐఆర్‌డీఏఐ

కరోనా వైరస్ చికిత్సకు బీమా కవరేజీ కల్పించేలా పాలసీలు రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) బీమా కంపెనీలను కోరింది. అలాగే కరోనాకు చికిత్సకు అయ్యే ఖర్చుల క్లెయిములను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించి బుధవారం సర్క్యులర్ జారీ చేసింది. దేశంలో ఇప్పటికే 28 మందికి ఈ వైరస్ సోకింది.



### రూపాయి విలవిల

» డాలర్ మారకంలో 75 దిశగా..

కరోనా ధాటికి రూపాయి రోజుకింత పతనమవుతోంది. బుధవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు తీవ్ర ఊగిసలాటలకులోనైంది. చివర్లో 20 పైసల తగ్గదలతో రూ.73.39 వద్ద ముగిసింది. దేశంలో కరోనా సోకిన కేసులు అనూహ్యంగా పెరగడంతో ఈక్విటీ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ రూపాయి హెచ్చుతగ్గులకు ప్రధాన కారణమయ్యాయి. రూపాయి మారకం రేటు మరికొన్నాళ్లపాటు ఒత్తిడిని ఎదుర్కోవచ్చని, డాలర్‌తో మారకం రేటు రూ.75కు బలహీనపడవచ్చని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి.

### బంగారం భగ్గు

» ఒక్క రోజులో రూ.1,155 పెరిగిన ధర

కరోనా భయాలతో దేశీయ మార్కెట్లో పసిడి ధర మళ్లీ భగ్గుమంది. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ పుంజుకోవడంతో దేశీయంగానూ రేట్లు ఎగబాకాయి. రూపాయి విలువ క్షీణత ధరలకు మరింత ఆజ్యం పోసింది. బుధవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం (పది గ్రాముల) ధర ఒక్క రోజులోనే రూ.1,155 పెరిగి రూ.44,383కు చేరుకుంది. వెండి కూడా పుత్తడి బాటలోనే పయనించింది. ఢిల్లీలో కిలో వెండి రేటు రూ.1,198 పెరిగి రూ.47,729కు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 1,638 డాలర్లు, వెండి 17.17 డాలర్లు పలికింది.



### కరోనా ప్రభావాన్ని అంచనా వేస్తున్నాం: సెబీ

క్యాపిటల్ మార్కెట్లపై కరోనా వైరస్ ప్రభావాన్ని అంచనా వేస్తున్నట్లు సెబీ శాశ్వతకాల సభ్యుడు ఎస్‌కే మొహంతి తెలిపారు. ఆర్థిక రంగ అభివృద్ధి సమాఖ్య (ఎఫ్ఎస్‌డీసీ) ఇంకా ఈ చర్చల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. ఆర్థిక మార్కెట్ల నియంత్రణ సంస్థల సర్వోన్నత మండలే ఎఫ్ఎస్‌డీసీ. "క్యాపిటల్ మార్కెట్‌పై కరోనా వైరస్ ప్రభావాన్ని సెబీ గమనిస్తోంది. అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం" అని మొహంతీ చెప్పారు.

### ఇన్ఫినిక్స్ మొబైల్ విడుదల రద్దు

కరోనా భయాల నేపథ్యంలో చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఇన్ఫినిక్స్.. భారత్‌లో తన కొత్త మొబైల్ విడుదల కార్యక్రమాన్ని రద్దు చేసుకుంది. ఈ వారాంతంలో కంపెనీ 'ఎస్5 ప్రో' అనే మోడల్‌ను ఇండియా మార్కెట్లో విడుదల చేయాలనుకుంది. చైనాకు చెందిన షామీ, రియల్‌మీ తమ కొత్త సిరీస్ మోడళ్ల విడుదలను వాయిదా వేసుకున్నట్లు మంగళవారం ప్రకటించాయి.

### ఓయోలో 5000 ఉద్యోగాల కోత

కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం కుదేలవుతోంది. అన్ని దేశాల్లోనూ పర్యాటక ప్రాంతాలు సందర్శకులు లేక వెలవెలబోతున్నాయి. ఈ పరిణామం హోటల్ పరిశ్రమపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ గడ్డు పరిస్థితుల్లో హోటళ్ల నష్ట నివారణ చర్యల్లో భాగంగా వ్యయాలను తగ్గించుకుంటున్నాయి. కొత్తగా ఉద్యోగుల నియామకాలను నిలిపివేయడంతోపాటు ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గొలుసుకట్టు హోటళ్ల నిర్వహణ స్టార్టప్ ఓయో కూడా ఖర్చులకు కత్తెరేసే పనిలో పడింది. అంతర్జాతీయంగా తన ఉద్యోగుల సంఖ్యను 5,000 మేర తగ్గించుకుంటోంది. దాంతో కంపెనీ ఉద్యోగులు 25,000కు తగ్గనున్నారు. ముఖ్యంగా చైనాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలకు కోత పెట్టనుంది.



## ఫెడ్ బాటలో ఆర్‌బీఐ?

» కరోనాను ఎదుర్కొనేందుకు వడ్డీ రేట్లు మరింత తగ్గింపు

» ద్రవ్య లభ్యత పెంపు.. ఇతర చర్యలనూ చేపట్టే అవకాశం

ముంబై: ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఎంచుకున్న బాటనే అనుసరించనుందా..? అవుననే సంకేతాలొస్తున్నాయి. కరోనాతో సమరంలో అవసరమైతే కీలక వడ్డీ (రెపో) రేట్లను మరింత తగ్గించే వెసులుబాటు తమకుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంపుతోపాటు మరిన్ని చర్యలను చేపట్టే అవకాశం ఉందని బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సూచనప్రాయంగా చెప్పారు. అంతకు కొద్ది సమయం క్రితమే, అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీరేటును ఏకంగా 0.50 శాతం తగ్గించింది. కరోనా వైరస్ తమ దేశ ఆర్థిక కార్యకలాపాలకు ముప్పుగా పరిణమిస్తోందని వడ్డీ రేట్ల తగ్గింపు సందర్భంగా ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ పేర్కొన్నారు. అమెరికాతోపాటు ఆస్ట్రేలియా, మలేషియా సెంట్రల్ బ్యాంకులు కూడా మంగళవారం వడ్డీ రేట్లను తగ్గించాయి. తమ ఆర్థిక వ్యవస్థకు మరో ఉద్దీపన ప్యాకేజీ కోసం కసరత్తు చేస్తున్నట్లు ఇండోనేషియా ప్రకటించింది. కరోనా కారణంగా తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న మార్కెట్లను స్థిరీకరించేందుకు తగిన చర్యలు చేపడతామని జపాన్, బ్రిటన్ సెంట్రల్ బ్యాంకులూ హామీ ఇచ్చాయి. కాగా, ఆర్‌బీఐ తదుపరి పరపతి సమీక్ష మార్చి 31 నుంచి ఏప్రిల్ 3 వరకు జరగనుంది. ఫెడ్ తరహాలో ఆర్‌బీఐ సైతం పరపతి సమీక్ష కంటే ముందే వడ్డీ రేట్లను తగ్గించినా ఆశ్చర్యపోనక్కర్లేదని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

### వ్యవస్థలోకి మరో రూ.లక్ష కోట్లు

కరోనా వైరస్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ అసాధారణ నిర్ణయాలు తీసుకునే యోచనలో ఉందని ముగ్గురు ప్రభుత్వ అధికారులు తెలిపారు. రెండో దఫా లాంగ్ టర్మ్ రెపో ఆపరేషన్స్ (ఎల్‌టీఆర్ఓ) ద్వారా ఆర్‌బీఐ మరో రూ.లక్ష కోట్ల నగదును మార్కెట్లోకి విడుదల చేసే ఆలోచనలో ఉందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రెండో దఫా ఎల్‌టీఆర్ఓ ఏప్రిల్ నుంచి ప్రారంభం కావచ్చన్నారు. ఫిబ్రవరి 6న ప్రకటించిన తొలి దఫా ఎల్‌టీఆర్ఓ ద్వారా ఆర్‌బీఐ వ్యవస్థలోకి రూ.లక్ష కోట్లు చొప్పించనుంది. షెడ్యూలులోని నాలుగు విడతల్లో ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. ఈ నెల 9న చివరి విడత ఆపరేషన్స్‌కానున్నాయి.

ఈ ఆపరేషన్స్‌లో భాగంగా ఆర్‌బీఐ రెపో రేటు(5.15 శాతం)కే నిధులను ఆఫర్ చేస్తుంది. తద్వారా ఓపెన్ మార్కెట్లో రుణాలు సేకరించేందుకు చెల్లించాల్సిన వడ్డీ రేటు కంటే చాలా చౌకగా నిధులను సేకరించేందుకు బ్యాంకులకు అవకాశం లభిస్తుంది. చౌకగా సేకరించే నిధులతో బ్యాంకులు తమ కస్టమర్లకు విస్తృతంగా, మరింత తక్కువ వడ్డీ రేటుకే రుణాలివ్వగలిగే అవకాశం లభిస్తుంది. మార్కెట్లో వినియోగ డిమాండ్‌ను పునరుద్ధరించేందుకు ఇది దోహదపడుతుంది.

### ఎగుమతులకు రూ.3.65 లక్షల కోట్ల గండి

కరోనా వైరస్ దెబ్బకు చైనాలో ఉత్పత్తి పూర్తిగా కుదేలైంది. తత్ఫలితంగా మున్ముందు నెలల్లో ప్రపంచ ఎగుమతులకు 5,000 కోట్ల డాలర్ల (రూ.3.65 లక్షల కోట్ల పైమాటే) మేర గండి పడవచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. చైనాతో పాటు యూరోపియన్ యూని యన్, అమెరికా అధికంగా నష్టపోనున్నాయని పేర్కొంది

### పరస్పర సహకారంతో చర్యలు అవసరం

కరోనా వైరస్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అగ్రరాజ్యాలన్నీ పరస్పరసహకారంతో విధానపరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద మార్కెట్ అయిన భారత్ కూడా ఇందులో భాగస్వామి కావడం చాలా కీలకమని వారంటున్నారు. 2008 ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనేందుకు అగ్రరాజ్యాలు పరస్పర సహకారంతో విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. కరోనా వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మళ్లీ అదే వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఓరియెంట్**

## కొత్త ఇన్వర్టర్ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియెంట్ ఎలక్ట్రిక్.. విద్యుత్‌ను ఆదా చేసే ఇన్వర్టర్ ఎయిర్ కూలర్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కూలర్లలో ఎలక్ట్రానికల్లీ కమ్యుటేటెడ్ మోటార్ (ఈసీఎం) టెక్నాలజీని వినియోగించారు. దీని వల్ల 50 శాతం వరకు విద్యుత్ వ్యయాలు ఆదా అవుతాయని కంపెనీ చెబుతోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారితంగా, వైఫైతో, అలెక్సా ఆధారంగా ఇచ్చే వాయిస్ కమాండ్స్, గూగుల్ అసిస్ట్‌తో పని చేసే స్మార్ట్ ఎయిర్ కూలర్లను కూడా కంపెనీ విడుదల చేసింది. కొత్త కూలర్ల ద్వారా వచ్చే రెండేళ్లకాలంలోనే ఎయిర్ కూలర్ల మార్కెట్లో 25 శాతం వాటాను సొంతం చేసుకోవాలన్న లక్ష్యంతో కంపెనీ ఉంది. మారుతున్న కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కొత్త ఎయిర్ కూలర్లను అభివృద్ధి చేశామని, వీటి వినియోగం చాలా సౌకర్యవంతంగా, పనితీరు మెరుగ్గా ఉంటుందని ఓరియెంట్ ఎలక్ట్రిక్ ఎండీ, సీఈఓ రాకేష్ ఖన్నా బుధవారంనాడిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రస్తుతం ఈ మార్కెట్లో తమ కంపెనీ మార్కెట్ వాటా 12 శాతం ఉందన్నారు. దక్షిణాదిలో కొత్త తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు అవసరమైన ప్రాంతాన్ని గుర్తించే పనిలో ఉన్నామని ఆయన చెప్పారు.




సాంప్రదాయ ఇండక్షన్ మోటార్లతో పోల్చితే ఈసీఎం మోటార్ల జీవితకాలం రెండింతలు ఎక్కువ ఉంటుందని, తక్కువ విద్యుత్ వినియోగం, తక్కువ ధ్వని వీటి ప్రత్యేకతని ఓరియెంట్ ఎలక్ట్రిక్ బిజినెస్ హెడ్ (హోమ్ అప్లయెన్సెస్) సలిల్ కపూర్ తెలిపారు. ఎయిర్ కూలర్ల వ్యవస్థీకృత మార్కెట్ పరిమాణం రూ.2,200 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

## మార్కెట్లోకి హింద్‌వేర్ స్నోక్రెస్ట్ సీలింగ్ ఫ్యాన్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హింద్‌వేర్ అప్లయెన్సెస్‌ను తయారు చేస్తున్న సోమని హోమ్ ఇన్నోవేషన్ లిమిటెడ్ 'హింద్‌వేర్ స్నోక్రెస్ట్' బ్రాండ్ కింద సీలింగ్ ఫ్యాన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రీమియం, డెకొరేటివ్, క్లాసిక్ కేటగిరీల కింద ఆరు మోడళ్లను అందుబాటులోకి తెచ్చింది. వీటి ధరల శ్రేణి రూ.1,499 నుంచి రూ.2,999 వరకు ఉంది. బుధవారంనాడిక్కడ వీటిని విడుదల చేసిన సందర్భంగా సోమని హోమ్ ఇన్నోవేషన్ సీఈఓ, హోల్‌టైమ్ డైరెక్టర్ రాకేష్ కౌల్ మాట్లాడుతూ.. వచ్చే మూడు నాలుగు నెలల్లో టేబుల్ ఫ్యాన్లు, ఎగ్జాస్ట్, వాల్ ఫ్యాన్లను కూడా మార్కెట్లోకి తెస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో వార్షికంగా 11 కోట్ల సీలింగ్ ఫ్యాన్లు అమ్ముడవుతుండగా.. వీటి విలువ రూ.8,000 కోట్ల వరకు ఉందని, 2022 సంవత్సరం వరకు ఈ మార్కెట్ రూ.12,900 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. మూడునాలుగేళ్ల కాలంలో ఫ్యాన్ల మార్కెట్లో ఐదు శాతం మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వినియోగదారుల నుంచి సమాచారం తెలుసుకుని తాము సీలింగ్ ఫ్యాన్ల కేటగిరీలోకి ప్రవేశించామని, ఈ మార్కెట్లో అపార అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు సోమని హోమ్ ఇన్నోవేషన్ టర్నోవర్ రూ.530-540 కోట్లకు చేరుకోవచ్చన్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో కంపెనీ వ్యాపారంలో ఫ్యాన్ల వ్యాపార వాటా 10 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు.



## మళ్లీ హైకోర్టును ఆశ్రయించిన కార్వీ

» ఎస్ఎఫ్ఐఓ విచారణ ఆపాలని విజ్ఞప్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): కార్వీ గ్రూపు మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. తమ సంస్థలపై ఎస్ఎఫ్ఐఓ విచారణకు ఆదేశిస్తూ కేంద్రం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కార్వీ, దాని అనుబంధ సంస్థలు ఈ పిటిషన్ దాఖలు చేశాయి. ప్రసారమాధ్యమాల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ తాము దాఖలు చేసిన వ్యాజ్యం విచారణలో ఉండగానే సెబీ ఉత్తర్వులు జారీ చేసిందని కోర్టు దృష్టికి తెచ్చింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | |
|---|---|
| 4వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 295 |
| 5వ తేదీకి.. | |
| చిత్తూరు | 343 |
| గోదావరి | 310 |
| విజయవాడ | 310 |
| విశాఖపట్నం | 350 |
| వరంగల్ | 298 |
| డజను గుడ్లు రూ. 54 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | |
|---|---|
| హైదరాబాద్ | 47 |
| వరంగల్ | 47 |
| మహబూబ్‌నగర్ | 47 |
| కరీంనగర్ | 47 |
| కర్నూలు | 47 |
| విశాఖపట్నం | 44 |
| గోదావరి | 40 |
| విజయవాడ | 51 |
| గుంటూరు | 51 |
| ఒంగోలు | 51 |
| చిత్తూరు | 65 |
| నెల్లూరు | 65 |
| అనంతపురం | 66 |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 42,230 | 43,840 | 44,710 | 43,800 | 43,340 |
| క్రితం ముగింపు | 42,020 | --- | 43,740 | 42,550 | 42,260 |
| 22 క్యారెట్లు | 40,220 | 40,600 | 41,130 | 40,560 | 41,280 |
| క్రితం ముగింపు | 40,030 | --- | 40,240 | 39,450 | 40,250 |
| వెండి (కిలో) | 46,700 | 48,000 | 47,700 | 47,700 | 50,000 |
| క్రితం ముగింపు | 45,200 | --- | 46,600 | 46,400 | 48,500 |

## ఎన్ఆర్ఐల చేతికి ఎయిరిండియా

» నూరు శాతం వాటాకు కేబినెట్ ఓకే

» ఏప్రిల్ 1 నుంచే బ్యాంకుల విలీనం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కంపెనీ ఈక్విటీలో ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) నూరు శాతం వాటా కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రవాసులైన భారత జాతీయులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇందుకు అడ్డంకిగా ఉన్న నిబంధనలనూ సవరించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఎయిర్ ఇండియాలో నూరు శాతం వాటా కొనుగోలుకు ఎన్ఆర్ఐలు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిన అవసరమూ ఉండదని తెలిపింది. ఆటోమేటిక్ పద్ధతిలో వీరు నేరుగా ఇందుకోసం బిడ్స్ దాఖలు చేయవచ్చు. హిందుజాలతో సహా పలువురు ఎన్ఆర్ఐలు భారత విమానయాన రంగంలో ప్రవేశించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

### 'విదేశీ'పై పరిమితులు

దేశీయ విమానయాన సంస్థల ఈక్విటీలో, విదేశీ సంస్థల పెట్టుబడులు 49 శాతం మించకూడదన్న నిబంధన ఎయిర్ ఇండియాకూ వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. దీంతో అంతర్జాతీయ విమానయాన సంస్థలేవీ ఎయిర్ ఇండియాపై పెద్దగా ఆసక్తి చూపక పోవచ్చని భావిస్తున్నారు.




### ఏప్రిల్ 1 నుంచే విలీనాలు

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీనాలపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎట్టి పరిస్థితుల్లో ఏప్రిల్ 1కల్లా ఈ విలీనాలు పూర్తి చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అనుమతుల పరంగా ఇందుకు ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. పది పీఎస్‌బీలను నాలుగు బ్యాంకులుగా విలీనం చేయాలని ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో నిర్ణయించింది.

### కంపెనీల చట్టానికి సవరణలు

కంపెనీల చట్టానికి తలపెట్టిన 72కు పైగా సవరణలకూ కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో ఈ చట్టంలో పేర్కొన్న కొన్ని అపరాధాలను నేరాలుగా పరిగణించడం ఆగిపోతుంది. రాజీకి అవకాశం ఉన్న 66 అపరాధాల్లో 23 అపరాధాలను పునర్ వ్యవస్థీకరిస్తారు.

## అమరరాజా, సాలమ్ ఎలక్ట్రిక్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తుల తయారీ, సరఫరా నిమిత్తం సాలమ్ ఎలక్ట్రిక్ (ష్యామెన్)తో అమరరాజా గ్రూప్‌నకు చెందిన అమరరాజా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఎక్స్‌టర్నల్ పవర్ సప్లయిస్, బ్యాటరీ చార్జర్లు, వాల్ ప్లగ్ ఇన్ పవర్ సప్లయిస్, కారు చార్జర్లు, వెహికిల్ పవర్ అడాప్టర్లు, పవర్ బ్యాంకులు, వైర్‌లెస్ చార్జర్లు తదితర ఉత్పత్తులను అమరరాజా ఎలక్ట్రానిక్స్ తయారు చేసి సాలమ్ ఎలక్ట్రిక్‌కు సరఫరా చేయనుంది. తొలుత చార్జర్లు, పవర్ బ్యాంకులను ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ఉన్న తమ అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో తయారు చేయనున్నట్టు ఒప్పందం కుదిరిన సందర్భంగా బుధవారంనాడిక్కడ నిర్వహించిన సమావేశంలో అమరరాజా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, తొలుత ఉత్పత్తుల తయారీకి అవసరమైన వనరులు తమ వద్ద ఉన్నాయని, అవసరాన్ని బట్టి విస్తరణ కార్యకలాపాలు చేపడతామని చెప్పారు.

## ముగింపు అనిశ్చితం

**టెక్ వ్యూ**

నిఫ్టీ మరింత అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై తదుపరి స్థాయి 11350 వరకు వెళ్లి బలమైన ఇంట్రాడే రియాక్షన్‌లో పడింది. ఆ క్రమంలో 250 పాయింట్ల వరకు దిగజారి 11100 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ స్థాయిలో రికవరీ సాధించి చివరికి నష్టాన్ని 52 పాయింట్లకు పరిమితం చేసుకోగలిగింది. డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన ముగియడం అనిశ్చిత ధోరణికి సంకేతం. గత కొద్ది రోజుల్లో మార్కెట్ కన్సాలిడేషన్ ధోరణిలో ఆటుపోట్లు సాధిస్తోంది. అయితే దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు కూడా లభిస్తోంది. మైనర్ రిలీఫ్ ర్యాలీ ఏర్పడాలంటే మాత్రం బలంగా క్లోజ్ కావడం అవసరం.

**గురువారం స్థాయిలివే...**

**నిరోధం : 11310 మద్దతు : 11190**

◆ రికవరీ బాట పడితే ఇంట్రాడే నిరోధం 11310 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11350. ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.

◆ మైనర్ మద్దతు స్థాయి 11190 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 11000. తదుపరి దిశ తీసుకునే ముందు మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చు.

■ వి.సుందర్ రాజా

## ఉదయం నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఫాల్గుణ శుక్ల దశమి
**నక్షత్రం :** ఆర్ద్ర/పునర్వసు
**అప్రమత్తం:** ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి/అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.25**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 1.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 11290, 11330, 11370**

**మద్దతు స్థాయిలు : 11210, 11170, 11130**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

## క్రిప్టోకరెన్సీ సేవలకు 'సుప్రీం' గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీపై సుప్రీం కోర్టు కీలక తీర్పు ప్రకటించింది. ఈ కరెన్సీల అమ్మకం, కొనుగోళ్లు, నిధుల బదిలీలకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నిక్షేపంగా సేవలు అందించవచ్చని స్పష్టం చేసింది. ఈ సేవలను నిషేధిస్తూ ఏప్రిల్ 6, 2018న ఆర్‌బీఐ జారీ చేసిన సర్క్యులర్ చెల్లదని పేర్కొంది. జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్ అధ్యక్షతన ఏర్పాటైన ముగ్గురు సభ్యుల ధర్మాసనం బుధవారం ఈ కీలక తీర్పు ప్రకటించింది. ఈ తీర్పు ద్వారా దేశంలో పరోక్షంగా బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీల లావాదేవీలను సుప్రీం కోర్టు సమర్థించినట్టయింది. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎంఏఐ) అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. ఆర్థిక వ్యవస్థపై క్రిప్టోకరెన్సీల లావాదేవీల ప్రభావంపై ఎలాంటి అధ్యయనం చేయకుండా, కేవలం నైతిక కారణాలతో ఆర్‌బీఐ నిషేధం విధించడం చెల్లదని ఐఎంఏఐ తన పిటిషన్‌లో సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపింది. సుప్రీం కోర్టు తీర్పుపై క్రిప్టోకరెన్సీ పరిశ్రమ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి.

## విశాఖ ప్రజలు రాజధాని వద్దంటున్నారు



» దమ్ముంటే ప్రజాభిప్రాయ సేకరణ: హర్షకుమార్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4: "విశాఖ ప్రజలు రాజధాని వద్దంటున్నారు. దీనిపై తాను చాలెంజ్ చేస్తున్నా. విశాఖపట్నం ఎంపీ స్థానం ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఓటింగ్ జరిపితే రాజధానికి అనుకూలంగా 60:40 మెజార్టీ వచ్చినా రాజకీయాల నుంచి తప్పుకుంటా" అని సవాల్ విసిరారు. బుధవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. మూడు రాజధానులు పిచ్చి ఆలోచన అని అన్నారు. తన ఆస్తులు, భూములు హైదరాబాద్‌లో ఉన్నందు వల్లే సీఎం జగన్ రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## మూడు రాజధానులు సరికాదు: సీపీఎం మధు



అనంతపురం టౌన్, మార్చి 4: "రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్రంలోని 9 వామపక్ష పార్టీల నాయకులు విజయవాడలో సమావేశమవుతాం. కలిసి పోటీ చేయడంపై నిర్ణయం తీసుకుంటాం. అందుకోసం గురువారం సమావేశం కానున్నాం. ఈ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించుకుందాం" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు బుధవారం అనంతపురంలో పిలుపునిచ్చారు. మూడు రాజధానులు సరైంది కాదని తమ పార్టీ అభిప్రాయమన్నారు. అయితే రాయలసీమకు హైకోర్టు, అమరావతిలోనే అసెంబ్లీ, సచివాలయం ఉండాలని సూచిస్తున్నామన్నారు.

## అమరావతిపై సుప్రీంలో పిటిషన్

నెల్లూరు (హరనాథపురం): రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలని కోరుతూ నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఫత్తేఖాన్‌పేట సకిలంవారివీధికి చెందిన ఫైడా కృష్ణమూర్తి ఈ వ్యాజ్యం వేశారు. రైతులు, మహిళలు తమ భూములను రాజధాని కోసం ఇచ్చి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. రాష్ట్రపతి, ప్రధాని చొరవ తీసుకునేలా ఆదేశించాలని కోరారు.

## 3 ఒక రాష్ట్రం రాజధానులు

### జగన్ వైరస్‌తో..

# నిత్యం చస్తున్నాం!



మందడంలో మాస్కులు ధరించి ఆందోళన చేస్తున్న మహిళలు

» రాజధానిలో మాస్కులు ధరించి నిరసన

» గోడు వినండంటూ పళ్లాలను గరిటెతో కొట్టి నినాదాలు చేసిన అన్నదాతలు

» 78వ రోజూ కొనసాగిన అమరావతి పోరు

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "ప్రపంచంలో చాలా దేశాలు కరోనా వైరస్‌తో అతలాకుతులం అవుతుంటే.. మేం మాత్రం జగన్ వైరస్ బారిన పడి నిత్యం చస్తున్నాం" అని మందడం రైతులు ముఖానికి మాస్కులు ధరించి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సీఎం జగన్ తన స్వార్థం కోసమే మూడు రాజధానులు అంటున్నారని మండిపడ్డారు. రాజధాని తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదని.. అన్ని గ్రామాల్లోనూ సీఎం స్వయంగా పర్యటించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవాలని అన్నారు. అమరావతి ఆందోళనలు బుధవారం 78వ రోజూ కొనసాగాయి. అమరావతిని కొనసాగించాలంటూ ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని.. మాగోడు ఇప్పటికైనా వినండని అంటూ పళ్లాలను గరిటెతో కొట్టి తుళ్లూరులో రైతులు, మహిళలు నిరసన తెలిపారు. రాయపూడి రైతులు చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని నినాదాలు చేశారు. "చేతులు జోడించి వేడుకుంటున్నాం.. అమరావతిని చంపి మా జీవితాలతో రాజకీయ క్రీడవద్దు" అంటూ వేడుకున్నారు. "కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి వచ్చి పని చేశా. రాజన్న పాలన అందిస్తారని నమ్మి ఓట్లు వేయించి మోసపోయా" అంటూ రాయపూడికి చెందిన నరేంద్రబాబు (61)సోమవారం నుంచి 100 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. బుధవారం సాయంత్రం 4 గంటలతో 60 గంటల దీక్ష పూర్తయింది. అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యుల వినతి మేరకు దేవినేని ఉమా దీక్ష విరమింపజేసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

### పెరుగుతున్న మద్దతు..

హైదరాబాదు నుంచి కృష్ణ కిశోర్, నాగేంద్రకుమార్, లక్ష్మి తుళ్లూరు రైతులకు మద్దతు తెలిపి 24 గంటల దీక్షకు కూర్చొన్నారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో రైతులు, మహిళలు వచ్చి మద్దతు తెలిపి రూ.85 వేల నగదు, నిత్యావసరాలను విరాళంగా ఇచ్చారు. కాగా, తమకు కేటాయించిన ఇళ్లను వెంటనే ఇవ్వాలని తుళ్లూరు ఎన్టీఆర్ గృహ సముదాయాల ఎదుట లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. తమకు ఇళ్లు ఇవ్వకపోతే నిర్మించిన ఇళ్లపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామన్నారు.

### అంతిమ విజయం రైతులదే: ఐద్వా

తుళ్లూరు: "అధికారం ఉందని జగన్ విర్రవీగితే.. అధికారం ఇచ్చిన ప్రజలే తుంగలో తొక్కేస్తారు" అని అమరావతి మహిళా జేఏసీ నేత, ఐద్వా రాష్ట్ర మహిళా కార్యదర్శి రమాదేవి హెచ్చరించారు. తుళ్లూరు, మందడం, రాయపూడి, వెలగపూడి ధర్నా శిబిరాల్లో ఐద్వా బృందంతో బుధవారం ఆమె పర్యటించి మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా అమరావతి రైతులకు, మహిళలకు అండగా ఉన్నారని, మహిళలు చేస్తున్న రాజధాని పోరాటాన్ని కీర్తిస్తున్నారని రమాదేవి చెప్పారు.

# ఓడితే ఇంటికే..

### స్థానికంపై కేబినెట్‌లో మంత్రులకు సీఎం హెచ్చరికలు

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 90 శాతానికిపైగా స్థానిక సంస్థల్లో వైసీపీ జెండా ఎగరాల్సిందేనని మంత్రులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడైనా ఓటమిపాలైతే, అందుకు బాధ్యులైన మంత్రులు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి తమ రాజీనామా పత్రాలను గవర్నర్‌కు అందజేయాల్సి ఉంటుందని తెగేసి చెప్పారు. తమ నియోజకవర్గంలో పార్టీని గెలిపించలేకపోయిన ఎమ్మెల్యేలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీటుపై ఆశలొదేసుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. సచివాలయంలో బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. అధికారిక ఎజెండా అంశాలపై చర్చ అనంతరం, స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలు, ఇతర అంశాలపై జగన్ మంత్రులతో చర్చించారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు... "స్థానిక ఎన్నికల్లో ప్రతి మండలంలోనూ, ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ జెండా రెపరెపలాడాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు, మునిసిపల్ వార్డులు, కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు ఓడిపోతే అందుకు వారే బాధ్యత వహించాల్సి ఉంది. అధికారపార్టీగా వైసీపీ ఈ ఎన్నికల్లో డబ్బులు, మద్యం పంచదు. అదేసమయంలో, వైరిపక్షం కూడా అలా చేయకుండా చూసే బాధ్యత మనపై ఉంది. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపే బాధ్యతను ఎస్పీలకు అప్పగించాను. ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేసినట్లు తేలితే.. ఆ మరుక్షణం ఆ జిల్లాలో ఆ ఎస్పీ కొనసాగరు. హోం మంత్రిగా .. ఎక్కడా మద్యం, డబ్బులు పంపిణీ చేయకుండా చూడాల్సిన బాధ్యత మీదే (సుచరితను ఉద్దేశించి)' అని జగన్ నిర్దేశించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

### పంచం.. పంచనివ్వం..

"దేశంలోనే మొదటిసారిగా డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా స్థానిక ఎన్నికలను నిర్వహిస్తున్నాం.అధికారపక్షం మద్యం, డబ్బులు పంపిణీ చేయదు. ప్రతిపక్షాలనూ పంపిణీ చేయకుండా నిరోధిద్దాం. ఇప్పటికే జిల్లా ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. పోలీసు శాఖను అప్రమత్తంగా ఉండాలని సూచించాం"

### తెలంగాణ తరహాలో..

"స్థానిక సంస్థల ఎన్నికలను తెలంగాణ తరహాలోనే నిర్వహిద్దాం. ముందస్తుగా సర్పంచ్, ఎంపీపీ, జడ్పీ ఛైర్మన్, మునిసిపల్ ఛైర్మన్, మేయర్ పదవులు ఎవరికిస్తున్నామో ప్రకటించవద్దు. ఇలా ప్రకటిస్తే, పార్టీలోని వారే .. ఈ అభ్యర్థులకు వెన్నుపోట్లు పొడుస్తారు. ఫలితంగా మన అభ్యర్థులు పరాజయం పాలవుతారు. ఎన్నికలు జరిగాక .. ప్రత్యేకంగా ఒక కమిటీని వేస్తాం. ఈ కమిటీ జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతుంది. సమర్థుడైన నేతకు పదవులను అప్పగిద్దాం"

### ఐదుగురికి పర్యవేక్షణ

"స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఐదుగురు సీనియర్ నేతలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నాం. రాజ్యసభ సభ్యుడు వీ విజయసాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలను చూసుకొంటారు. మరో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నెల్లూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాలు, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉభయ గోదావరి జిల్లాలు, సీఎం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చిత్తూరు, అనంతపురం జిల్లాలను, అయోధ్యరామిరెడ్డి గుంటూరు, కృష్ణా జిల్లాలను పర్యవేక్షిస్తారు. ఈ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా తక్షణమే మంత్రులు, ఎమ్మెల్యేలు మీమీ నియోజకవర్గాల్లో పర్యటించండి. మీ నియోజకవర్గాల్లో ఇంటింటా ప్రచారం చేయాలి. నగదు పంపిణీకి పార్టీ నుంచి ఎలాంటి సాయమూ ఉండదు. ఎన్నికల ప్రచార సామగ్రిని మాత్రమే పార్టీ పంపిణీ చేస్తుంది. గెలిచే అభ్యర్థుల ఎంపికతోనే 80 శాతం విజయం సాధించినట్లు అవుతుంది. మన పార్టీ ఇప్పటికే సర్వేను చేపట్టి గెలుపు గుర్రాలను గుర్తించింది. ఇన్‌చార్జి మంత్రులు, జిల్లాల్లోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ .. అభ్యర్థుల విషయంలో నిర్ణయం తీసుకుందాం. ఈ విషయంలో ఎమ్మెల్యేలు .. మంత్రులు.. ఇతర నేతలు సమన్వయంతో పార్టీ అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాలి"

### నగరాల్లోనూ సెంటున్నరే..

గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర భూమిని ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేస్తున్నాం. అందుబాటులో భూమి ఉంటే నగరాలు, పట్టణాల్లోనూ అంతే భూమి పేదలకు ఇద్దాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టెండర్లను ఖాయం చేసినందున జీఎంఆర్ సంస్థకే పనుల బాధ్యతను అప్పగిద్దాం. వచ్చే నెలలోనే భోగాపురం విమానాశ్రయానికి శంకు స్థాపన చేద్దాం"



మంత్రివర్గ సమావేశంలో ఇంటి పట్టా నమూనాను ప్రదర్శిస్తున్న జగన్

### ఒక్కసారే మార్పు వస్తుందా: సుచరిత

"ఇంతకాలం ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేయడం అలవాటుగా మారింది. ఇప్పుడు ఒక్కసారిగా మార్పు రావాలంటే వస్తుందా ? ఓటర్లు కూడా ఎన్నికల్లో డబ్బును ,మద్యాన్ని ఆశించకుండా ఉంటారా?"

### అలాచేస్తే.. మొనగాళ్లమవుతామా?

ఎన్నికల సమయంలో మద్యం దుకాణాలు మూసేస్తే సరిపోతుందని ఇద్దరు మంత్రులు అభిప్రాయపడ్డారు. 'మద్యం దుకాణాలు మూసేసి పంపిణీ జరగకుండా చేసి మొనగాడనిపించుకుందామా? మద్యం దుకాణాలు ఉన్నా.. పంపిణీ చేయకుండా నిరోధించగలిగితేనే ప్రభుత్వ సామర్థ్యం తెలుస్తుంది" అంటూ ఆ మంత్రులకు జగన్ చురకలంటించారు.

### ఏకగ్రీవాలు ఉండేలా చూద్దాం

స్థానిక సంస్థలలో వీలైనన్ని ఏకగ్రీవాలు ఉండేలా చూద్దామని మంత్రులకు సీఎం సూచించారు. "ఏకగ్రీవాలు కావాలంటే, ఎన్నికల నుంచి తప్పుకునేవారు ఏదో ఒకటి ఆశిస్తారు కదా" అని మంత్రి కొడాలి నాని అన్నారు. 'అలాంటిదేమీ ఉండదబ్బా. ఏకగ్రీవాలను చేయడానికి స్థానిక పరిస్థితులు కలిసి వస్తాయి. డబ్బులు, పదవుల ఆశ చూపాల్సిన పనిలేదు" అని అన్నారు.

### ఇలా చేద్దాం.. సరేనా!

27నాటికి స్థానిక ఎన్నికలప్రక్రియ పూర్తి చేయాలని.. 28వ తేదీన బడ్జెట్ సమావేశాలను ప్రారంభించాలని మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. 7న ఎంపీటీసీ, జడ్పీటీసీ నోటిఫికేషన్‌తో ప్రక్రియ మొదలవుతుందని .. 21న ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికలు, 24న మునిసిపల్, 27న పంచాయతీ ఎన్నికలు నిర్వహిద్దామని అనుకున్నట్లు సమాచారం.

# ఎన్పీఆర్‌కు 'నో'

**బీసీ కోటాపై చర్చించలేదు**

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారా అన్న ప్రశ్నకు..రెండునెలల నుంచీ సిద్ధంగానే ఉన్నామని మంత్రి తెలిపారు. తగ్గిన బీసీ రిజర్వేషన్లకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారుచేసే ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించగా...అన్నీ శరవేగంతో జరుగుతాయన్నారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తారా అన్న ప్రశ్నకు దానిపై మంత్రివర్గంలో చర్చ జరగలేదన్నారు. ఈ నెలాఖరున అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని మరో ప్రశ్నకు పేర్ని నాని సమాధానమిచ్చారు.

» పాత ప్రశ్నలతోనే జన నమోదు.

» అలాచేసేదాకా ఇక్కడ చేపట్టం

» మంత్రివర్గంలో కీలక నిర్ణయం

» జీఎంఆర్‌కే 'భోగాపురం' పనులు

» 'రాజధాని'పై సిట్‌కు అంగీకారం

» ఉగాదికి 26 లక్షల స్థల పట్టాలు

» నిర్ణయాలు వెల్లడించిన పేర్ని నాని

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ జనాభా నమోదు (ఎన్పీఆర్) ప్రక్రియను ఆంధ్రప్రదేశ్‌లో నిలుపుదల చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. "జనాభా లెక్కలనేవి దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జరుగుతున్నాయి. 2010లో జరిగిన జనాభా లెక్కల సందర్భంగా అడిగిన ప్రశ్నలపై ఎలాంటి విమర్శలు రాలేదు. కొత్తగా ప్రశ్నలు చేర్చడం వల్లే ఇప్పుడు ఆందోళనలు జరుగుతున్నాయి. అందుకే 2010లో అడిగిన ప్రశ్నలతోనే ఇప్పుడు కూడా ఎన్పీఆర్ ప్రక్రియ చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేశాం. దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకునేవరకు రాష్ట్రంలో ఆ ప్రక్రియను నిలిపివేయాలని(అబేయన్స్) తీర్మానం చేశాం" అని సమాచార, ప్రసార శాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. కేబినెట్ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఎన్పీఆర్‌ను నిలుపుదల చేసే అధికారం రాష్ట్రానికి ఉంటుందా అని ప్రశ్నించగా..కేంద్రం అధికారాలు కేంద్రానివి, రాష్ట్రం అధికారాలు రాష్ట్రానివని బదులిచ్చారు. విధానాలను బలవంతంగా రుద్దడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని, అందరినీ సమాధానపరిచి అమలుచేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

### థర్మల్ ప్లాంట్లకు 2వేల కోట్ల రుణం

రాష్ట్రవ్యాప్తంగా ఉగాది నాడు 26లక్షలమంది పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అంతా సిద్ధం చేశామని మంత్రి పేర్ని నాని తెలిపారు. "లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి అనుమతిపత్రం తోపాటు, ఐదేళ్ల వరకు స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టుకోవడానికి, ఐదేళ్ల తర్వాత వ్యక్తిగత అవసరాల కోసం అమ్ముకోవడానికి కూడా హక్కు కల్పించేలా పట్టాలు ఇస్తున్నాం. ఇందుకోసం తహసీల్దార్లకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా హోదా ఇచ్చాం. ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేసేందుకు 43,141ఎకరాల భూమిని సిద్ధం చేశాం. ఇందులో 26,976ఎకరాలు ప్రభుత్వానివి. 16,164ఎకరాలు ప్రైవేటు భూమి. ఏటా ఆరు లక్షల పైచిలుకు ఇళ్ల నిర్మాణం చేపడతాం. ఈ కాలనీలన్నింటికీ వైఎస్సార్ జగనన్న కాలనీలుగా పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది" అని మంత్రి వివరించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్ని నాని తెలిపారు. ఈ కాంట్రాక్టును దక్కించుకున్న జీఎంఆర్ సంస్థకే నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. "గతంలో 2,703ఎకరాలను విమానాశ్రయం కోసం జీఎంఆర్‌కు ఇవ్వాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇప్పుడు దాన్ని 2,200ఎకరాలకు తగ్గించాం. ఆ 503 ఎకరాలను ప్రభుత్వ వాణిజ్య అవసరాల కోసం కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది" అని తెలిపారు. రామాయపట్నం, భావనపాడు, మచిలీపట్నంలలో పోర్టుల నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నామన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం కృష్ణపట్నం పోర్టు పరిధిని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించిందని పేర్కొన్నారు. వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంట్లలో నిర్మాణంలో ఉన్న 800 మెగావాట్ల యూనిట్ల పూర్తికి...చెరో వెయ్యి కోట్ల రుణాన్ని తీసుకునేందుకు అనుమతించామన్నారు. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం హామీగా ఉంటుందని చెప్పారు. వచ్చే వ్యవసాయ సీజన్‌లో విత్తనాల కొరత లేకుండా చేసేందుకు విత్తనాల సేకరణ కోసం ఏపీ విత్తనాభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.500కోట్లు రుణం తీసుకునేందుకు అనుమతిచ్చామని మంత్రి పేర్ని నాని తెలిపారు.

### ముఖ్య తీర్మానాలివే..

- కాకినాడ సమీపంలో తొండంగి మండలం కోన గ్రామం వద్ద పోర్టు నిర్మాణం కోసం 9నెలల కాలవ్యవధి పొడిగిస్తూ కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్‌కు అనుమతి.
- కాకినాడ సెజ్‌లో 49శాతం ఈక్విటీని అదానీ పోర్టు అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్‌కు బదిలీ చేస్తూ చేసుకున్న ఒప్పందానికి ఆమోదం.
- ప్రకాశం జిల్లా ఒంగోలులో గతప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ భవనం నిర్మాణానికి కేటాయించిన 1.96ఎకరాల భూ కేటాయింపు రద్దు. ఆ భూమి తిరిగి జలవనరుల శాఖకు అప్పగింత.
- కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం సున్నిపెంటలో నాలుగు గ్రామ సచివాలయాల ఏర్పాటుకు, అందులో 44ఉద్యోగాల భర్తీకి ఆమోదం.
- రాజధాని అమరావతి ప్రాంతంలో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్, భూ అక్రమాలపై మంత్రివర్గ ఉపసంఘం నివేదికలోని అంశాలపై విచారణ అధికారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందాని(సిట్)కు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం. సిట్ కార్యాలయమే పోలీస్ స్టేషన్‌గా పనిచేస్తుందని వివరణ.

## హోదా ఇవ్వనందుకే..
## రెవెన్యూ లోటు భర్తీ!

» రాజ్యసభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అవకాశం లేదని మరోసారి కేంద్రం స్పష్టం చేసింది. బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. సాధారణ రాష్ట్రాలకు, ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాలకు వ్యత్యాసం లేదని 14వ ఆర్థిక సంఘం స్పష్టీకరించిందని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసులకు లోబడి.. ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నందు వల్ల.. రాష్ట్రానికి ఏర్పడుతున్న రెవెన్యూ లోటు నిధులను కేంద్రమే భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు చట్టం ప్రకారం సుదీర్ఘకాలంఅంటే పదేళ్ల కాలపరిమితి ఉన్నదని తెలిపారు. అపరిష్కృత సమస్యలపై కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో ఇప్పటిదాకా 24 సమీక్షా సమావేశాలు నిర్వహించామన్నారు.

## సుప్రీంలో పిటిషన్ వేయాలి: సీపీఐ

విజయవాడ సిటీ, మార్చి 4: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయడానికి సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేయాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గితే ప్రభుత్వమే దోషిగా నిలుస్తుందన్నారు. ఒక బీసీని ప్రధానిగా చేసిన ఘనత బీజేపీదేనని ఆ పార్టీ నేత వామనరాజు సత్యమూర్తి అన్నారు. బీసీల గణాంకాల వివరాలను కోర్టుకు సమగ్రంగా నివేదించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ విమర్శించారు. కాంగ్రెస్ తరుపున బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంలో పిల్ వేస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నేతలు బొనబోయిన శ్రీనివాస్, పోతిన మహేశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గురున్నాథం, వివిధ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బీసీ కోటాపై సుప్రీంకు!



» ప్రభుత్వం తరపున ఎస్ఎల్‌పీ వేయండి

» టీడీపీ నుంచి పూర్తి మద్దతిస్తాం

» మీ ఉదాసీనత వల్లే 10% కోత

» ముఖ్యమంత్రికి చంద్రబాబు లేఖ

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు గత 26 ఏళ్లుగా అమలులో ఉన్న 34% రిజర్వేషన్ పరిరక్షణ కోసం తక్షణం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వచ్చిన హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయకుండా.. వారికి 24% రిజర్వేషన్‌తోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలనుకోవడం గర్హనీయమన్నారు. ఇంత తీవ్ర సమస్యపై అఖిల పక్ష సమావేశం పిలవకుండా, బీసీ సంఘాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి బుధవారం చంద్రబాబు లేఖ రాశారు. '33 ఏళ్లుగా 27% రిజర్వేషన్లు, 25 ఏళ్లుగా 34% రిజర్వేషన్లు పొందుతున్న లబ్ధిని తీసేయడం బీసీల సాధికారతకు దెబ్బ. అన్ని పార్టీలు, బీసీ సంఘాల నేతలతో సంప్రదింపులు జరిపి 34% రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. బీసీ సాధికారత కాపాడడం ముఖ్యమంత్రిగా మీ విద్యుక్త ధర్మం. 2019 ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్, బీసీ సబ్‌ప్లాన్ అంటూ ప్రచారం చేసి.. అధికారంలోకి రాగానే రిజర్వేషన్లు తగ్గించి వెన్నుముక విరిచేయడం, బీసీలను నమ్మించి మోసం చేయడమే! గత 9 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లిప్తత, నిర్లక్ష్యం, ఉదాసీనత వల్లే 60.55% ఉండాల్సిన రిజర్వేషన్‌లో 10% కోత పడింది. బీసీలకు ఉండాల్సిన 34 శాతాన్ని 24 శాతానికే పరిమితం చేసి.. వేల మంది బీసీలకు రాజకీయ అవకాశాలు లేకుండా చేశారు. న్యాయస్థానాల ముందు వాదనలు వినిపించేందుకు పేరుగాంచిన న్యాయవాదులను నియమించకపోవడం బీసీ రిజర్వేషన్లపై మీకున్న చిత్తశుద్ధి లేమికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా వెంటనే స్పందించి బీసీ రిజర్వేషన్ల పరిరక్షణకు ప్రభుత్వం తరపున వెంటనే పిటిషన్ వేయండి. టీడీపీ నుంచి అన్ని రకాలుగా మద్దతిస్తాం' అని లేఖలో హామీ ఇచ్చారు. జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రగతికి టీడీపీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని చంద్రబాబు గుర్తు చేశారు "టీడీపీ ప్రభుత్వం కట్టించి, సిద్ధం చేసిన ఇళ్లను లబ్ధిదారులకు ఎందుకివ్వరు? ఆ ఇళ్ల కోసం మేం కట్టిన డబ్బు సంగతేంటీ? మాకిచ్చిన బాండ్లకు ఈ ప్రభుత్వం జవాబుదారీ కాదా" అని నిరుపేదలు ప్రశ్నిస్తున్నా.. ఈ ప్రభుత్వం నుంచి సమాధానం లేదని చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ ఇళ్ల స్థలాల పంపిణీ పెద్ద మోసమని ట్వీట్ చేశారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు అన్యాయం చేశారనీ, అక్కడ పట్టాలిచ్చి రైతులకు, పేదలకు తగాదా పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్న వారికి వైసీపీ ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుందని చంద్రబాబు నిలదీశారు.

# 140 బీసీ కులాలకు నష్టం



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీలోని బీసీ నేతలు

» టీడీపీకి అండనే అణగదొక్కే కుట్రలు: అచ్చెన్న

» గవర్నర్‌ని కలిసిన టీడీపీ బీసీ నేతలు

విజయవాడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల 140 వెనుకబడిన తరగతులకు అన్యాయం జరుగుతోంది. జగన్ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో 16 వేల పదవులను బీసీలు కోల్పోవాల్సి వస్తోంది. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలను అణగదొక్కే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. బీసీలు టీడీపీకి అండగా ఉంటున్నారన్న అక్కసుతోనే జగన్ ఈ విధంగా చేస్తున్నారు" అని టీడీపీ శాసన సభాపక్ష ఉపనేత కె.అచ్చెన్నాయుడు వివరించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై తెలుగుదేశం పార్టీ బీసీ నేతల బృందం విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నరు హరిచందన్‌ను బుధవారం కలిసింది. అచ్చెన్నాయుడుతోపాటు అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తదితరులు గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం రాజ్‌భవన్ వెలుపల అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. బీసీలకు 1987వ సంవత్సరం నుంచి 34 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రిజర్వేషన్లు 24 శాతానికి పరిమితమయ్యాయని తెలిపారు. బీసీలకు నాడు తండ్రి, నేడు కొడుకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. బీసీలకు 24 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ముందుగా గవర్నరు వద్దకు వస్తుంది కాబట్టి దాన్ని తిరస్కరించాలని కోరారు.

### వేధింపులు ఆపండి: సీపీఐ

రాజధాని కోసం ఆందోళన చేస్తున్న మహిళలపై జరుగుతున్న పోలీసు వేధింపులను ఆపాలని సీపీఐ బృందం గవర్నరు హరిచందన్‌కు వినతిపత్రం అందజేసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులు రాజ్‌భవన్‌లో ఆయనను కలిశారు.

## వైసీపీ రంగులతోనే ఎన్నికలా!

» ఆందోళన బాటలో టీడీపీ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనేక ప్రభుత్వ భవనాలకు వైసీపీ పార్టీ రంగులు వేయడాన్ని స్థానిక ఎన్నికల నిర్వహణలో ఒక ప్రధాన అభ్యంతరంగా లేవనెత్తాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పార్టీ గుర్తులపై స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుండగా అధికారంలో ఉన్న పార్టీ రంగులు అలాగే ఎలా ఉంచుతారన్నది ఆ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్న. దీనిపై ఆందోళనకు ఆ పార్టీ సమాయత్తం అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికలు పార్టీల గుర్తులతో జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలకు అనుకూలంగా ప్రభావితం చేసే అంశాలు ఉండకూడదన్నది ఎన్నికల నిబంధనల్లో ప్రధానమైనది. అందువల్లే ఆయా పార్టీల నేతల విగ్రహాలకు కూడా ఎన్నికల సమయంలో ముసుగులు తొడుగుతుంటారు. ఈ నిబంధనల కోణంలోనే ఇప్పుడు రంగుల అంశాన్ని లేవనెత్తాలని టీడీపీ అనుకొంటోంది.

## చావగొట్టకుండా వదిలిపెట్టారు

» ఇది చంద్రబాబు అదృష్టం.. స్థానిక ఎన్నికల్లో పోటీచేయం: జేసీ



తాడిపత్రి, మార్చి 4: ఉత్తరాంధ్ర పర్యటనకు వెళ్లిన మాజీ సీఎం చంద్రబాబును విశాఖ ఎయిర్‌పోర్టు సమీపంలో వైసీపీ మద్దతుదారులు చావగొట్టకుండా వదిలిపెట్టడం ఆయన అదృష్టమని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం అక్కన్నపల్లికి చెందిన జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ వివిధ కేసుల్లో దాదాపు 60 రోజులు జైల్లో ఉండి బెయిల్‌పై విడుదలయ్యారు. జేసీ బుధవారం సాయంత్రం అక్కనపల్లి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాడిపత్రి మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఎవరూ పోటీ చేయరని జేసీ ప్రకటించారు. పౌరుషానికి పోటీ చేసినా అనర్హత వేటుతోపాటు కొత్త చట్టాల పేరుతో జైలుపాలు కాక తప్పదని చెప్పారు.

## సత్తా ఉన్న చోట్ల పోటీ చేద్దాం : బీజేపీ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు కమలదళం సిద్ధమవుతోంది. సత్తా ఉన్న చోట పోటీ చేయడానికి ప్రణాళిక రచిస్తోంది. గురువారం బీజేపీ కీలక నేతలు అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ నేతృత్వంలో గుంటూరులో సమావేశం కాబోతున్నారు. గతవారం విజయవాడలో సమావేశమైన పార్టీ నేతలు ప్రాంతాలు.. పార్టీ పరిస్థితులపై పరిశీలనకు పురందేశ్వరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం భేటీలో అధ్యక్షుడికి నివేదిక ఇవ్వబోతోంది. అనంతరం మిత్రపక్షం జనసేన నుంచి ఎన్ని సీట్లు సాధించుకోవాలో చర్చిస్తారు.

# ఆగ్నేయాసియా... జర జాగ్రత్త!



బహ్రెయిన్‌లో కరోనా పరీక్షలకు నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

## అమ్మో.. కరోనా!

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: దేశంలో కరోనా వైరస్(కొవిడ్-19) బాధితుల సంఖ్య 29కి చేరింది. వీరిలో 16 మంది ఇటాలియన్ పర్యాటకులు కాగా.. వారికి డ్రైవర్‌గా పనిచేసిన రాజస్థాన్‌వాసి కూడా వైరస్ బారిన పడ్డాడు. ఇక.. ఇటలీకి వెళ్లొచ్చిన ఢిల్లీ బాధితుడి బంధువులు ఆరుగురికి కూడా వైరస్ సోకింది. అలాగే.. ఇటీవలే వాటికన్‌లో పర్యటించి వచ్చిన గుర్గావ్ పేటీఎం ఉద్యోగి ఒకరికి వైరస్ పాజిటివ్ వచ్చింది. దుబాయ్ నుంచి తిరిగొచ్చిన హైదరాబాద్‌వాసిని, గతంలో ఈ వైరస్‌బారినపడి నయమైన ముగ్గురు కేరళవాసులను కూడా కలుపుకొంటే మొత్తం 29 కేసులు. గత నెల 21 నుంచి 28 వరకు రాజస్థాన్‌లో పర్యటించిన ఇటాలియన్ టూరిస్టుల బృందం కనీసం 215 మందితో సన్నిహితంగా మెలిగినట్లు ఆ రాష్ట్ర సర్కారు ప్రకటించింది. వారిలో 51 మందికి నెగెటివ్ వచ్చిందని తెలిపింది. ఇక.. మన హైదరాబాద్‌లో కరోనా బారిన పడ్డ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు దగ్గరగా మసలిన 47 మందికి పరీక్షలు చేయగా.. 45 మందికి కరోనా నెగెటివ్ వచ్చింది. ఇద్దరు వ్యక్తుల నమూనాల్లో వైరస్ లోడ్ అధికంగా కనిపించడంతో.. నిర్ధారణ నిమిత్తం పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు, అతడితోపాటు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులో ప్రయాణం చేసిన వ్యక్తులు, అతడికి కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసిన వైద్య సిబ్బంది ఇలా అందరికీ పరీక్షలు చేయించగా 45 మందికి ఎలాంటి లక్షణాలూ లేవని నిర్ధారణ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. మిగతా ఇద్దరి ఫలితాలు గురువారం రానున్నాయి. ఆ ఫలితాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన వైద్య ఆరోగ్యశాఖ అధికారుల్లో నెలకొంది. ఆ ఇద్దరినీ ప్రస్తుతం గాంధీలోని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్సనందిస్తున్నారు.

**మరో ఇద్దరికీ?:** కౌలాలంపూర్ నుంచి బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ఓ ప్రయాణికుడికి కరోనా లక్షణాలు కనిపించగా అతడిని ప్రత్యేక అంబులెన్సులో గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు ప్రచారం జరుగుతోంది.

**అందరికీ స్ర్కీనింగ్:** ఇకపై మనదేశానికి వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులందరికీ విమానాశ్రయాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు 12 దేశాల నుంచి వచ్చే వారికే 'స్ర్కీనింగ్' నిర్వహిస్తున్నారు. కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించేందుకు దేశంలో ప్రస్తుతం 15 ల్యాబ్‌లు ఉండగా మరో 19 ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో ఏడెనిమిది మంగళవారం నుంచే పని చేయడం ప్రారంభించాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డుల సంఖ్య పెంచాలని ఆయన కోరారు. దేశంలో కరోనా కేసుల వివరాలను విలేకరులకు తెలిపారు. "ఇప్పటి వరకు విమానాశ్రయాల్లో ఆరు లక్షల మందికి, నౌకాశ్రయాల్లో 15 వేల మందికి, నేపాల్, భూటాన్, మయన్మార్ నుంచి వచ్చే 10 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. 27 వేల మందికి పైగా సామాజిక పర్యవేక్షణలో ఉన్నార"ని హర్షవర్ధన్ వివరించారు. ఇరాన్‌లో ఉన్న భారతీయులను తీసుకొచ్చే ముందు వారికి కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించేందుకు ఆ దేశంలోనే ల్యాబ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పుణె వైరాలజీ ల్యాబ్ శాస్త్రవేత్తను ఇరాన్ పంపినట్లు తెలిపారు. ఐసీఎంఆర్ నుంచి మరో ముగ్గురు బుధవారమే బయలుదేరుతున్నారని తెలిపారు. ఇరాన్‌లో ప్రస్తుతం 1,200 మంది భారతీయులు ఉన్నట్లు అంచనా. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు, యాత్రికులేనని సమాచారం. కొద్ది రోజుల క్రితం ఇటలీ, దక్షిణ కొరియా వెళ్లొచ్చిన ఇద్దర్ని జమ్ము ఆస్పత్రిలోని క్వారంటైన్‌కు తరలించారు. కాగా.. ఢిల్లీ బాధితుడితో సన్నిహితంగా మెలిగినట్లు గుర్తించిన 88మంది స్ర్కీనింగ్‌కు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తెలిపారు.

## కరోనావైరస్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

వాషింగ్టన్/బీజింగ్/లండన్, మార్చి 4: కరోనా వైరస్ గుప్పిట్లో ప్రపంచం విలవిల్లాడుతూనే ఉంది. ఈ వైరస్ మొదలైన చైనాలో కాస్తంత తగ్గుముఖం పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. 80% కేసులు చైనా వెలుపలే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. ప్రపంచదేశాల్లో ఈ వైరస్ సోకిన వారిలో 3.4% మంది మరణించినట్లు ఆ సంస్థ నేత టెడ్రాస్ అధానం ఘెబ్రాయెసెస్ చెప్పారు. ఆగ్నేయాసియా, గల్ఫ్ దేశాల్లో వైరస్ విస్తరించే ప్రమాదం ఉండటంతో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "థాయ్‌లాండ్‌లో 43, ఇండియాలో 28, ఇండోనేషియా 2, శ్రీలంక, నేపాల్‌లో చెరొకటి చొప్పున కేసులు నమోదైనట్లు డేటా చెబుతోంది. అక్కడి ప్రభుత్వాలు 3 ప్రధాన అంశాలు గుర్తుపెట్టుకోవాలి. ఆరోగ్య సిబ్బందికి తగిన రక్షణ, ప్రజలతో నిరంతరం మాట్లాడి వారిని చైతన్యవంతం చేయడం, వైరస్ సోకినవారు తక్షణం ఆస్పత్రులకు వచ్చేట్లు చూడడం ముఖ్యం" అని డబ్ల్యూహెచ్‌వో ప్రాంతీయ డైరెక్టర్ క్షేత్రపాల్ సింగ్ చెప్పారు. ప్రపంచం దృష్టి ఇపుడు ఇరాన్, దక్షిణ కొరియా, ఇటలీల్లో పెరిగిన కేసులపై ఉంది.

### అమెరికా ఘోర వైఫల్యం



వైరస్ వ్యాప్తిని తొలుత తేలిగ్గా తీసుకున్న అమెరికాలో మరణాల సంఖ్య 9కి పెరిగింది. ఇవన్నీ కాలిఫోర్నియా, వాషింగ్టన్ రాష్ట్రాల్లోనే సంభవించాయి. వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య 126కు పెరిగింది. వాషింగ్టన్‌తో పాటు శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటిల్‌ల్లో ఆరోగ్య ఎమర్జెన్సీ ప్రకటించారు. ఏదైనా ఎదుర్కోగలమని ధీమా ప్రకటించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన ప్రభుత్వం ఇప్పుడు ఫేస్ మాస్కులు కూడా సరఫరా చేయలేని స్థితిలో ఉంది. మాస్కులు, శానిటైజర్లు దొరక్క జనం నానా అవస్థలూ పడుతున్నారు. "ఐరోపా దేశాలు, దక్షిణ కొరియా రోజూ వేలాది మందికి పరీక్షలు జరుపుతూంటే అభివృద్ధి చెందిన దేశమైన అమెరికా 3600 మందికి మాత్రమే పరీక్షలు చేయగలుగుతోంది.



చైనాలోని లాన్‌ఝౌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరోనా బాధితులు

### చైనా: తెరిపి లభించేనా?

| | |
|---|---|
| మరణాలు | 2981 |
| తాజా కేసులు | 119 |

వార్తాసంస్థల కథనాల ప్రకారం తాజాగా నమోదైన కేసులు 119 మాత్రమే! గతంతో పోలిస్తే ఉధృతి కాస్త తగ్గినట్లే! దీంతో కరోనా బారిన పడ్డ వారి సంఖ్య 80,270కి చేరింది. ఇందులో 49,856మందికి నయం చేసి పంపించేశారు. గత 3 రోజుల్లో 38 మంది చనిపోవడంతో చైనాలో మరణాల సంఖ్య 2981కి పెరిగింది. వైరస్ కేంద్రస్థానం వుహాన్‌లో అనేక ఆస్పత్రుల్లో బెడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇక్కడ నయం అవుతున్న వారి సంఖ్య 50.2 శాతంగా ఉంది.

### జపాన్: ఇంకా బయటపడలేదు

| | |
|---|---|
| మరణాలు | 12 |
| సోకినవారు | 1020 |

జపాన్ ఇంకా బయటపడలేదు. ఒకహామాలో క్రూయిజ్‌షిప్‌లో సోకిన వారితో కలిపి వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య 1000 దాటింది. క్యోటో, ఒసాకాల్లో వందల మంది పరీక్షలు చేయించుకుంటున్నారు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన జపాన్ పరిస్థితిని పకడ్బందీగా ఎదుర్కొంటోంది. సింగపూర్, హాంకాంగ్‌లు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నాయి.

### ఇరాన్: నానాటికీ తీవ్రం

| | |
|---|---|
| మృతులు | 100 పైనే |
| సోకినవారు | 3100 |

చైనా తరువాత చాలా గడ్డుగా తయారైన దేశం ఇరాన్. ఒక్క రాష్ట్రంలో తప్ప దేశమంతా విస్తరించింది. బుధవారం 15 మరణాలు సంభవించాయి. 586 కొత్త కేసులు నమోదయ్యాయి. టెహ్రాన్, క్వోమ్ ప్రావిన్సుల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. టెహ్రాన్‌లో అనేక వీధులు నిర్మానుష్యమయ్యాయి. స్కూళ్లు మూసేశారు. ఆటలపోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలన్నీ రద్దయ్యాయి. పనిగంటలు తగ్గించారు. పరిస్థితిని డీల్ చేయలేక ఇరాన్ ప్రభుత్వం నానాయాతన పడుతోంది. అమెరికా సాయం చేస్తానన్నా తిరస్కరించింది. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి చైనా ఏకంగా 54,000 మంది ఖైదీలను తాత్కాలికంగా విడుదల చేసింది.

### ఐరోపాలో పెరిగిన కేసులు

| | |
|---|---|
| మొత్తం | 400 |

ఐరోపాలోని ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. మరికొన్ని దేశాలతో కలుపుకొని మొత్తం 400పై చిలుకు మంది వైరస్‌కు చికిత్స తీసుకుంటున్నారు. బ్రిటన్‌లో 14వేల మందిని పరీక్షించారు. దేశవ్యాప్తంగా 12 ప్రత్యేక ల్యాబరేటరీలు నిరంతరం పనిచేస్తున్నాయి.

### ఇటలీ: వయసు మీరడం వల్ల మృతి?

| | |
|---|---|
| మరణాలు | 101 |
| కేసులు | 3100 |

ఐరోపాలో కరోనా బారిన పడి విలవిల్లాడుతున్న దేశం ఇటలీ. ప్రస్తుతం అక్కడ రోజురోజుకీ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఇటలీ ఆర్థిక రాజధాని మిలన్ ఉన్న లోంబర్డీ ప్రాంతంలో ఇది ప్రబలంగా ఉంది. వయసు మీదపడ్డ వారు ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడ మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నది ఒక అంచనా. ధ్రువీకరించిన కేసులు 3100 మాత్రమే అయినా దాదాపు 50వేల నుంచి లక్ష మందిదాకా ఈ వైరస్‌తో బాధపడుతూండవచ్చని, వారు ఇళ్లకే పరిమితం కావడం వల్ల ఇంకా నిర్ధారణ పరీక్షలు జరపలేదని అంటున్నారు. ఇటలీలో స్కూళ్లు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాలు అన్నీ మూసేశారు.

### దక్షిణ కొరియా: ఆ మత గ్రూపుదే పాపం!

| | |
|---|---|
| మృతులు | 32 |
| సోకిన వారు | 5600 |

కరోనా ఉధృతంగా ఉన్న మూడో దేశం దక్షిణ కొరియాలోనూ కేసులు కాస్త తగ్గాయి. బుధవారం 516 కేసులు నమోదయ్యాయి. అంతకుముందు రెండ్రోజులూ ఇక్కడ 851కి పైగా కేసులు రిపోర్టయ్యాయి. ఒకప్పుడు ప్రజారోగ్యంలో మిన్నగా ఉన్న దక్షిణ కొరియా సైతం ఇప్పుడు తగినన్ని టెస్టింగ్ కిట్స్ లేక, ఆస్పత్రులు చాలక అవస్థలు పడింది. ఇప్పుడిప్పుడే ఓ ప్రణాళికతో వైరస్‌పై యుద్ధం చేస్తోంది. దేగూ నగరంలోని షిన్‌చెంగ్‌జీ అనే ఓ క్రైస్తవ గ్రూపు వల్లే ఇది వేగంగా విస్తరించినట్లు తేలింది. దీని అధిపతి లీమ్యాన్ హీ తనతో పాటు 1,44,000 మందిని స్వర్గానికి తీసుకెళ్తానని అనుచరులను నమ్మించాడు.



### ఉమ్రా యాత్ర రద్దు

| | |
|---|---|
| మరణాలు | 11 |
| కేసులు | 100 పైనే |

ఇరాన్‌లో వైరస్ తీవ్రంగా ఉండడంతో అనేక గల్ఫ్, పశ్చిమాసియా దేశాలు తమ పౌరులను వెనక్కి తెచ్చాయి. అయితే ఆ దేశాల్లోనూ తక్కువేమీ లేదు. సౌదీ, ఎమిరేట్స్, ఇరాక్, టర్కీ, కువైట్, బహ్రెయిన్‌లలోనూ వందల్లో అనుమానితులు ఉన్నారు. 11 మంది ఇప్పటికే మరణించారు. కాగా, వైరస్ వల్ల మక్కాకు ఉమ్రా యాత్రను తాత్కాలికంగా రద్దు చేసినట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. వేలల్లో ముస్లిం యాత్రికులు గుమిగూడితే ప్రమాదకరమని చెప్పింది.

## అన్ని అంతర్జాతీయ విమానాలు, ప్రయాణికులకు స్ర్కీనింగ్: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 4 : కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అన్ని అంతర్జాతీయ విమానాలు, ప్రయాణికులకు స్ర్కీనింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఆయన బుధవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లోనూ ఓ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని, సాయం చేసేందుకు ఇరాన్ అంగీకరించిందని పేర్కొన్నారు. ఇరాన్‌లో భారతీయులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వారిని భారత్‌కు తిరిగి తీసుకువచ్చేందుకు ఈ పరీక్షా కేంద్రం తోడ్పడుతుందని చెప్పారు. భారత్‌లో ఇప్పటిదాకా మొత్తం 28 కొవిడ్-19 కేసులు నమోదయ్యాయని, అందులో ఓ ఢిల్లీ వ్యక్తి, ఆగ్రాకు చెందిన అతని ఆరుగురు బంధువులు, 16 మంది ఇటాలియన్లు, వారి డ్రైవరు ఉన్నారని వెల్లడించారు. మిగతా వారిలో తెలంగాణకు చెందిన ఒక బాధితుడు, ముగ్గురు కేరళ వాసులు ఉన్నారని వివరించారు.

## హోలీ వేడుకల్లేవ్

- రాష్ట్రపతి కోవింద్, మోదీ వెల్లడి
- కరోనా నేపథ్యంలో ప్రముఖుల నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 4: దేశంలో కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో హోలీ వేడుకలకు దూరంగా ఉండాలని ప్రముఖులు నిర్ణయించారు. హోలీ సందర్భంగా పెద్దసంఖ్యలో ప్రజలు ఒక్కచోటకు చేరడం వల్ల కరోనా వైరస్ వ్యాపించే ముప్పు ఎక్కువవుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు ప్రముఖులు హోలీ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రపతి భవన్‌లో ఏటా నిర్వహించే హోలీ వేడుకలను ఈ సారి నిర్వహించడం లేదని రాష్ట్రపతి కోవింద్ బుధవారం ప్రకటించారు. అలాగే ప్రధాని ఏటా 'హోలీ మిలాన్'లో పాల్గొంటారు. అయితే నిపుణుల సూచనల మేరకు ఈ నెల 10న హోలీ మిలాన్‌లో తాను పాల్గొనడం లేదని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. కాగా, ఈశాన్య ఢిల్లీలో మతపరమైన హింస జరిగిన నేపథ్యంలో తాను హోలీ వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు.



షార్‌లోని ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్10 రాకెట్

## గీశాట్ ప్రయోగం వాయిదా

- జీఎస్ఎల్వీ రాకెట్‌లో సాంకేతిక లోపం
- కౌంట్‌డౌన్‌కు ముందు గుర్తింపు

శ్రీహరికోట (సూళ్లూరుపేట), మార్చి 4: భూ పరిశీలన కోసం ఇస్రో గురువారం చేపట్టనున్న అత్యాధునిక గీశాట్-1 ప్రయోగం వాయిదా పడింది. షార్‌లో బుధవారం జరిగిన లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశంలో జీఎస్ఎల్వీ-ఎఫ్10 రాకెట్‌లో సాంకేతిక లోపం ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించి, ప్రయోగానికి అభ్యంతరం చెప్పారు. దీంతో ప్రయోగాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. బుధవారం మధ్యాహ్నం 3.43 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావాల్సి ఉండగా.. దానికి అరగంట ముందు రాకెట్‌లో సాంకేతిక లోపాన్ని గుర్తించారు. జీఎస్ఎల్వీ-ఎఫ్10 ప్రయోగం ఇప్పటి వరకు మూడు సార్లు వాయిదా పడటం గమనార్హం. బుధవారం మిషన్ రెడినెస్ రివ్యూ సమావేశం జరిగింది.

### మొరాయిస్తున్న జీఎస్ఎల్వీ

- స్వదేశీ క్రయోజనిక్ ఇంజన్‌తో 2010, ఏప్రిల్ 15న ప్రయోగించిన తొలి దేశీయ జీఎస్ఎల్వీ-డీ3లో క్రయోజనిక్ ఇంజన్ ఇంధన బూస్టర్ టర్బ్ పంపు పని చేయక రాకెట్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకోలేదు.
- 2013 ఆగస్టు 13న జీఎస్ఎల్వీ-డీ5 రాకెట్ ప్రయోగానికి గంట ముందు ఇంజన్‌లో ఇంధనం లీకేజీని గుర్తించి ప్రయోగాన్ని నిలిపివేశారు.
- ప్రస్తుతం ఎఫ్10 రాకెట్‌లో సాంకేతిక లోపాన్ని గుర్తించి ప్రయోగాన్ని వాయిదా వేశారు.

### పవన్ క్షమాభిక్షకు రాష్ట్రపతి 'నో'

న్యూఢిల్లీ, మార్చి 4: నిర్భయ హత్యాచారంలో నలుగురు దోషులలో ఒకడైన పవన్ గుప్తా పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి కోవింద్ తిరస్కరించారు. ఈ కేసులో ఇతర దోషులైన ముకేశ్ కుమార్, వినయ్ శర్మ, అక్షయ్ కుమార్ క్షమాభిక్ష దరఖాస్తులను రాష్ట్రపతి ఇదివరకే తిరస్కరించారు. దీంతో వీరి ఉరితీతకు అవరోధాలన్నీ తొలగిపోయాయి. దోషుల ఉరితీతకు తాజాగా డెత్‌వారెంట్లు జారీ చేయాలంటూ ఢిల్లీ సర్కారు పటియాలహౌస్ కోర్టును ఆశ్రయించింది.

## కోడ్‌కు ముందే కూపన్

- ఎన్నికలయ్యాక చూపితే పట్టాలు
- ఉగాదినాడు పంపిణీకి ఎన్నికలు అడ్డుపడినా ఇబ్బంది లేదు
- కూపన్లు పొందిన వారంతా ఎన్నికల్లో తమకే ఓటువేసే వీలు
- పేదల స్థలాలపై కొత్త వ్యూహం

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల కోడ్‌ను అధిగమించి ఇళ్ల స్థలాల పంపిణీ చేసేందుకు, అదే సమయంలో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త వ్యూహంతో ముందుకెళ్లనుందని సమాచారం. స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోడ్ త్వరలోనే రానుంది. పోలింగ్ ఉగాది పండగ అనంతరం జరిగే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే ఉగాది రోజున ప్రభుత్వం ఇస్తానంటున్న 26లక్షల ఇళ్ల పట్టాలకు కోడ్ అడ్డంకిగా మారుతుంది. దీన్నించి గట్టెక్కేందుకు ఆ లోపలే ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు కూపన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ కూపన్ చూపించిన వారికి ఆ తర్వాత పట్టాలిస్తారు. ఈ విషయంలోనూ రెండురకాల వ్యూహాలను రచించినట్టు తెలిసింది. కోడ్ కంటే ముందే కూపన్లు ఇచ్చేస్తారు కాబట్టి...అది ముందుగానే మొదలైన ప్రక్రియ అని చెప్పేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రక్రియ ముందుగానే మొదలైనందున కోడ్ అడ్డురాదని చెప్పనుంది. ఒకవేళ ఎవరైనా న్యాయస్థానాలకు వెళ్లినా ఇదే వాదన వినిపిస్తుంది. ఇది తొలి వ్యూహం! ఈ వ్యూహం దెబ్బతింటే ప్లాన్ బి ముందే సిద్ధం చేశారు. ఇదంతా కావాలనే చేశారని, కేవలం కోడ్‌కు కొన్నిరోజుల ముందు మాత్రమే కూపన్లు ఇచ్చి కోడ్ వర్తించదనడం చెల్లదంటే రెండో వ్యూహాన్ని తెరపైకి తెస్తారు. స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో లబ్ధికి ఈ వ్యూహం కూడా ఉపకరిస్తుందనే భావనతో ఉన్నారు. లబ్ధిదారులకు ముందుగానే కూపన్లు ఇచ్చేస్తామని...దాంతో వారు ఎన్నికల్లో తమవైపే ఉంటారని...పైగా ఎన్నికలయ్యాక పట్టాలిస్తామంటే ఇక తమతో ఉండకతప్పని పరిస్థితి ఏర్పడుతుందని అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు అభిప్రాయపడ్డారు. ఎన్నికల కోడ్ వల్ల ఒకవేళ పట్టాల పంపిణీ ఆగితే మాత్రం, అది మళ్లీ ఏప్రిల్ నెలలోనే జరిగే అవకాశముందని అంటున్నారు.

### పీఎఫ్..ఈఎస్‌ఐ సొమ్ము స్వాహా

- సచివాలయంలో ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాకం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సచివాలయంలోనే లంచాల కోసం బహిరంగంగా బేరసారాలకు తెరలేచింది. సచివాలయంలో పారిశుధ్య పనులు చేసే కార్మికుల వేతనాల నుంచి ప్రతినెలా పీఎఫ్, ఈఎస్‌ఐ కట్‌చేస్తున్నా, ఆ సొమ్మును వారి పీఎఫ్, ఈఎస్‌ఐ ఖాతాల్లో జమచేయడం లేదు. ఈ విషయం గుర్తించిన కార్మికులు బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఎస్‌కేఎస్(ప్రైవేటు) ఏజెన్సీ ప్రతినిధులను నిలదీశారు. తమకు లంచం ఇస్తేనే ఆ సొమ్ము జమచేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు బేరసారాలకు దిగడంతో వారిపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా డబ్బు జమ చేయడానికి మమ్మల్నే రూ.200 ఇస్తారా? రూ.1000 ఇస్తారా? అంటూ లంచాలు డిమాండ్ చేస్తారా?' అంటూ గట్టిగా నిలదీశారు. మీడియా రాకతో ఏజెన్సీ ప్రతినిధులు అక్కడి నుంచి జారుకున్నారు.

## మధ్యప్రదేశ్‌లో 'ఆపరేషన్ కమల్'!

**8 మంది కాంగ్రెస్ శిబిరం ఎమ్మెల్యేలు మాయం.. బీజేపీ అపహరించిందన్న సీఎం కమల్‌నాథ్**



భోపాల్/న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమల్' చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఒక స్వతంత్ర ఎమ్మెల్యే, ముగ్గురు ఎస్పీ, బీఎస్పీ ఎమ్మెల్యేలు మంగళవారం రాత్రి కనిపించకుండా పోయారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించిందని, తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సహా ఆ పార్టీ నేతలు ఆరోపించారు. అయినా.. తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదన్నారు. తాము పలుమార్లు అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకున్నామని, దీంతో బీజేపీ అప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి రావాలని చూస్తోందని అన్నారు. కాగా, నలుగురు ఎమ్మెల్యేలను హరియాణాలోని ఓ హోటల్‌కు, మిగిలిన నలుగురిని బెంగళూరుకు బీజేపీ నేతలు తరలించినట్లు ప్రచారం జరిగింది. వీరిలో నలుగురిని కాంగ్రెస్ నేతలు తిరిగి రప్పించారు. బుధవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో వారు కాంగ్రెస్ సీనియర్ నేతలతో కలిసి భోపాల్ ఎయిర్‌పోర్టులో దిగారు. మిగిలిన నలుగురు కర్ణాటకలోని చిక్కమగళూరు సమీపంలో ఓ రిసార్టులో వీరు ఉన్నట్లు సమాచారం. బీజేపీ నేత ఒకరు రెండు చార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకుని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రాష్ట్రం దాటించారని మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్ అన్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.35 కోట్లు ఆఫర్ చేసినట్లు ఆరోపించారు. అయితే కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలను, ఎమ్మెల్యేలను నియంత్రించలేని అశక్తతను తమపైకి నెట్టివేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వీడీ శర్మ అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదని, అది కాంగ్రెస్ నేతల వల్లే జరుగుతుందని మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఇదిలా ఉండగా.. వ్యాపమ్ కుంభకోణాన్ని బయటపెట్టిన విజిల్ బ్లోయర్లలో ఒకరు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ నేత నరోత్తమ్ మిశ్రా రూ.100 కోట్లు, మంత్రి పదవి ఆఫర్ చేస్తున్న ఓ వీడియోను విడుదల చేశారు. అయితే ఇది ఫేక్ వీడియో అని బీజేపీ పేర్కొంది. 230 మంది సభ్యుల మధ్యప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 114 మంది ఎమ్మెల్యేలుండగా, బీజేపీకి 107 మంది ఉన్నారు. ఇతరుల మద్దతుతో కమల్‌నాథ్ ప్రభుత్వం కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## ఢిల్లీ అల్లర్లపై చర్చించాల్సిందే

**అప్పటిదాకా పార్లమెంట్‌ను అడ్డుకుంటాం: కాంగ్రెస్.. హోలీ తర్వాత చర్చిద్దాం: కేంద్రం**

న్యూఢిల్లీ, మార్చి 4 : ఢిల్లీ అల్లర్లపై లోక్‌సభ, రాజ్యసభలో చర్చకు అనుమతించే దాకా సభా కార్యకలాపాలను అడ్డుకుంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. అల్లర్లపై చర్చించాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ పట్టుబట్టడంతో బుధవారం నాడు కూడా ఉభయసభల్లో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అల్లర్లపై హోలీ తర్వాత చర్చిద్దామన్న కేంద్ర ప్రభుత్వ సూచనను కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్, ఎస్పీ, బీఎస్పీ ఎంపీలు తిరస్కరించారు. ఇప్పుడే ఈ విషయంపై చర్చించాలని వారు పట్టుపట్టారు. ఢిల్లీలో అల్లర్లకు పాల్పడిన వారిని, అందుకు కారకులైన వారిని శిక్షించాలని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌధురి కోరారు. పార్లమెంట్ బయట మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై చర్చించాలని అదేపనిగా కేంద్రాన్ని కోరుతున్నామని ఆయన చెప్పారు. హోలీ అనంతరం ఈ విషయంపై చర్చిద్దామన్న ప్రభుత్వ సూచనను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటికే ఢిల్లీలో నెత్తుటి హోలీని చూశామని ఆయన విమర్శించారు. అల్లర్లకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అల్లర్లపై స్పందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కానీ, అమిత్ షా కానీ ముందుకు రావడం లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి నసీర్ హుస్సేన్ అన్నారు. అల్లర్లపై చర్చను వాయిదా వేయడంపై మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మనూ సింఘ్వీ.. కేంద్రాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

## అమెరికా, తాలిబన్ల ఒప్పందానికి ఆదిలోనే తూట్లు

- ఉగ్రదాడిలో 20 మంది అఫ్ఘాన్ బలగాల మృతి

కాబూల్, మార్చి 4: అఫ్ఘానిస్థాన్‌లో శాంతి స్థాపన కోసం ఇటీవల తాలిబన్లు, అమెరికా మధ్య కుదిరిన చారిత్రక ఒప్పందానికి ఆదిలోనే తూట్లు పడ్డాయి. తాలిబన్లు ఒప్పందానికి కట్టుబడి ఉంటే 14 నెలల్లో అఫ్ఘాన్ నుంచి తమ భద్రతా బలగాలను ఉపసంహరించుకుంటామని నాటో దేశాలు కొన్ని రోజుల క్రితమే ప్రకటించాయి. తాలిబన్ పొలిటికల్ చీఫ్ ముల్లా బరాదర్‌తో ఫోనులో జరిపిన చర్చలూ సంతృప్తికరంగా ముగిశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించి కొన్ని గంటలయినా గడవకముందే తాలిబన్లు మళ్లీ దాడులకు పాల్పడ్డారు. కుందుజ్‌లోని ఇమామ్ సాహిబ్‌లో మంగళవారం రాత్రి ఈ దాడులు జరిగాయి. దీనికి ప్రతిగా అమెరికా బుధవారం హెల్మంద్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై వైమానిక దాడులు జరిపింది.

## 15 కిలోల బంగారం సముద్రంలోకి..

**పడవలో తరలిస్తుండగా కోస్ట్‌గార్డ్ రాక.. 6.3 కోట్ల విలువైన బిస్కెట్లను జలాల్లోకి జారవిడిచిన స్మగ్లర్లు.. ఇద్దరి అరెస్ట్, పసిడి స్వాధీనం**

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా మండపం సమీపంలో శ్రీలంక నుంచి నాటుపడవలో అక్రమంగా తరలించిన 15 కిలోల బంగారు బిస్కెట్లను కోస్ట్‌గార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండపం సమీపంలోని మరకాయర్ పట్టినం ప్రాంతానికి చెందిన ఆషిక్, ఫారుఖ్ అనే ఇద్దరు యువకులు మంగళవారం శ్రీలంక నుంచి నాటుపడవలో రామేశ్వరం తీరం వైపు వస్తుండగా కోస్ట్‌గార్ సిబ్బంది చుట్టుముట్టారు. ఈ క్రమంలో వారు పడవలో ఉన్న బంగారు బిస్కెట్ల పార్శిళ్లను ముయల్‌దీవి వద్ద లోతు తక్కువగా ఉన్న సముద్ర ప్రాంతంలో జారవిడిచారు. కోస్ట్‌గార్డ్ సిబ్బంది వారిద్దరినీ అదుపులోకి తీసుకుని రాష్ట్ర సముద్ర తీర భద్రతా పోలీసు దళానికి అప్పగించారు. బంగారు బిస్కెట్లను సముద్రంలో జారవిడిచినట్టు విచారణలో గుర్తించి బుధవారం కోస్ట్‌గార్డ్, డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గజ ఈతగాళ్లతో ఆ మూడు పార్శిళ్లను వెలికితీశారు. ఆ పార్శిళ్లలో ఉన్న రూ.6.3 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లను డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. నాగపట్టినం జిల్లా వేదారణ్యం వద్ద తీరంలో రూ.5 కోట్ల విలువైన హెరాయిన్‌ను రాష్ట్ర సముద్రతీర భద్రతా దళం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వేదారణ్యం తీరానికి కొట్టుకొచ్చిన కొయ్యపెట్టెలో ఈ హెరాయిన్ ప్యాకెట్లున్నాయి.



స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు



## హాంకాంగ్‌లో పెంపుడు కుక్కకు కరోనా

▸ ఓ వృద్ధురాలి నుంచి సోకిన వైరస్

హాంకాంగ్, మార్చి 4: ఇప్పటి దాకా కరోనా వైరస్ కేవలం మనుషుల్లోనే వ్యాప్తి చెందుతుందని తెలుసు. కానీ హాంకాంగ్‌లో ఓ పెంపుడు కుక్కకు కరోనా సోకింది. ఈ విషయాన్ని అధికారులు బుధవారం వెల్లడించారు. కరోనా సోకిన ఓ మహిళ నుంచి కుక్కకు వైరస్ వ్యాప్తి చెందిందని చెప్పారు.కరోనా సోకిన వారి పెంపుడు కుక్కలను పోయిన శుక్రవారం నుంచి క్వారెంటైన్ చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన పరీక్షల్లో కుక్కకు వైరస్ వచ్చినట్లు తేలింది. ఇప్పటి వరకు హాంకాంగ్‌లో కరోనాతో ఇద్దరు చనిపోయారు. 102 మందికి ఈ వైరస్ సోకింది.

## ఇంట్లోనే హ్యాండ్ శానిటైజర్

▸ రబ్బింగ్ ఆల్కహాల్, కలబంద గుజ్జుతో తయారీ

న్యూఢిల్లీ, మార్చి 4: కరోనా ముప్పును ఎదుర్కోవాలంటే శుభ్రత పాటించాలి. ఇంట్లోనో, ఆఫీసులోనో అయితే చేతుల్ని సబ్బుతో శుభ్రంగా కడుక్కునే అవకాశం ఉంది. మరి బయటకు ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఎలా? అందుకు మార్గం హ్యాండ్ శానిటైజర్లు. కానీ.. కరోనా భయంతో హ్యాండ్ శానిటైజర్ల అమ్మకాలు పెరిగిపోయి, అవి దొరకడమే కష్టంగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారం? హ్యాండ్ శానిటైజర్లను ఇంట్లోనే చేసుకోవడం! అదెలాగంటే..

### కావాల్సిన పదార్థాలు

2/3 కప్పు రబ్బింగ్ ఆల్కహాల్ (అంటే దాదాపుగా 160 మిల్లీలీటర్లు). ఇది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సైట్లలో దొరుకుతుంది. దొరక్కపోతే మద్యం దుకాణాల్లో దొరికే వోడ్కా అయినా చాలు.

- 1/3 కప్పు స్వచ్ఛమైన కలబందగుజ్జు
- 8 నుంచి 10 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్

### తయారీ విధానం..

రబ్బింగ్ ఆల్కహాల్‌ను, కలబంద గుజ్జును ఒక పాత్రలో వేసి బాగా కలిసేదాకా చెంచాతో కలుపుకోవాలి. మిశ్రమం కాస్త చిక్కగా రావాలంటే మరో చెంచా కలబంద గుజ్జు కలుపుకోవచ్చు. లేదా పల్చగా కావాలంటే మరో చెంచా ఆల్కహాల్ కలుపుకోవడమే.

- ఆ తర్వాత మీకిష్టమైన ఎసెన్షియల్ ఆయిల్‌ను ఒక్కొక్క చుక్క చొప్పున వేస్తూ మీకిష్టమైన సువాసన వచ్చేవరకూ మిశ్రమాన్ని బాగా కలుపుకోవాలి.
- ఆ మిశ్రమాన్ని గరాటు ద్వారా చిన్నచిన్న బాటిళ్లలోకి పోసుకుంటే హ్యాండ్ శానిటైజర్ సిద్ధమైనట్టే.

### సమపాళ్లలో కలపకుంటే ముప్పు

▸ 60% ఆల్కహాల్ తప్పనిసరి: సీడీసీ

కరోనా కారణంగా హ్యాండ్ శానిటైజర్ల కొరతతో చాలా మంది వీటిని ఇంట్లోనే తయారు చేసుకుంటున్నారు. కానీ.. అలా తయారుచేసే మిశ్రమంలో 60% ఆల్కహాల్ తప్పనిసరిగా ఉండాలని.. సరైన పాళ్లలో మిశ్రమాన్ని కలపకపోతే ప్రమాదమని 'సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్' వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మైండ్ స్పేస్‌లో కరోనా కలకలం

ఉలిక్కిపడ్డ హైటెక్ 'సిటీ'!.. ఐటీ ఉద్యోగులను ఇళ్లకు పంపిన కంపెనీలు

హైదరాబాద్/సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ తాజాగా హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలను గడగడలాడిస్తోంది. బుధవారం హైటెక్ సిటీలోని మైండ్ స్పేస్ రహేజా సెజ్‌లో కరోనా కలకలం రేగడంతో ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. ఇటీవలే ఇటలీ పర్యటనకు వెళ్లొచ్చిన మైండ్‌స్పేస్ బిల్డింగ్-20లోని డీఎస్ఎం కంపెనీ ఉద్యోగినికి కరోనా నిర్ధారణ అయిందని ఆ సంస్థ ప్రకటించడంతో హైటెక్ సిటీ ఉలిక్కిపడింది. మైండ్ స్పేస్ బ్లాక్‌లో 23 భవనాలున్నాయి. బిల్డింగ్-20లో డీఎస్ఎం కంపెనీ ఉంది. తమ ఉద్యోగికి కరోనా నిర్ధారణ అయిందని ఆ కంపెనీయే బుధవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించడంతో ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు మైండ్‌స్పేస్‌లోని కార్యాలయంతో పాటు బ్రైట్‌స్పేస్ భవనాన్ని కూడా ఖాళీ చేయాలని కంపెనీ ఆదేశించడంతో ఉద్యోగులంతా ఇంటిబాట పట్టారు. బిల్డింగ్-20లోని ఇతర కార్యాలయాలు సైతం తమ ఉద్యోగులను ఇంటికి పంపాయి. మరో బిల్డింగ్‌లోని వరైజాన్, యష్ టెక్నాలజీస్, ఐబీఎం, మైండ్ స్పేస్, కాగ్నిజెంట్, ఇంటెల్ తదితర కంపెనీలు సైతం ఉద్యోగులను కార్యాలయం నుంచి విధులు నిర్వర్తించకూడదని కోరాయి. తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా ఇంటి నుంచే విధులు నిర్వర్తించాలని సూచించాయి. ఈ 2 భవనాల్లోని 11వేలకు పైగా ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా, ఉద్యోగినికి వైరస్ సోకినట్లు ఇంకా నిర్ధారించలేదు.



కరోనా భయంతో చార్మినార్ సమీపంలో మాస్కులు ధరించి తిరుగుతున్న జనం

### ఐటీ వ్యాపారమే ముఖ్యమా..?

మా ప్రాణాలను పట్టించుకోరా..?

ప్రభుత్వ తీరుపై 'సోషల్' విమర్శలు

మైండ్‌స్పేస్‌లోని ఐటీ ఉద్యోగినికి కరోనా లక్షణాలు కనిపించిన నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల ఆరోగ్య రక్షణే తమ తొలి ప్రాధాన్యమంటూ 'వర్క్‌ ఫ్రం హోం'కు పలు కంపెనీలు వెసులుబాటు ఇవ్వగా.. దీనికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలంటూ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రకటించారు. దీనిపై ఐటీ ఉద్యోగులు మండిపడుతున్నారు. తమ అసంతృప్తిని సోషల్ మీడియా ద్వారా వ్యక్తపరుస్తున్నారు. అమెజాన్, గూగుల్ లాంటి కంపెనీలు విదేశాల్లో ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండగా.. హైదరాబాద్‌లో పూర్తి విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ప్రపంచ బ్యాంకు అండ

'కరోనా' దేశాలకు 88వేల కోట్ల ప్రత్యేక నిధి

వాషింగ్టన్, మార్చి 4: కరోనాపై పోరాడుతున్న దేశాలకు ప్రపంచ బ్యాంకు తనవంతు సాయం చేసేందుకు ముందుకొచ్చింది. కరోనా ప్రభావానికి గురైన సుమారు 80 దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి నిరోధానికి త్వరతగతిన ఆర్థిక సాయం అందించేందుకు సుమారు రూ. 88వేల కోట్ల ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్టు ప్రకటించింది. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలను పటిష్ఠపరచడం, వ్యాధి వ్యాప్తిని నిరోధించడం, హెల్త్ వర్కర్ల ట్రైనింగ్‌కు ఈ నిధులు కేటాయిస్తామని పేర్కొంది. 'ప్రాణాలు కాపాడేందుకు వేగంగా చర్యలు తీసుకోవడం ముఖ్యం. కానీ దానికోసం చాలా ఎక్కువ నిధులు అసవరం ఉంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశాలకు సాయం చేసేందుకు రూ.88వేల కోట్లు అందుబాటులో ఉంచాం' అని ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు డేవిడ్ మల్పాస్ తెలిపారు. కాగా.. వేగంగా విస్తరిస్తున్న కొవిడ్-19 పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ దేశాలను హెచ్చరించింది.

### అదో భయానక అనుభవం!

భారత్‌లో తొలి కరోనా బాధితురాలి ఆవేదన

తిరువనంతపురం, మార్చి 4: భారత్‌లో తొలి కరోనా కేసు కేరళలో వెలుగు చూసింది. వూహాన్ పట్టణంలోని యూనివర్సిటీలో చదువుతున్న కేరళకు చెందిన 20 ఏళ్ల విద్యార్థిని కరోనా కలకలం నేపథ్యంలో జనవరి 23న అక్కడ నుంచి స్వదేశానికి వచ్చేసింది. అయితే అప్పటికే ఆమెకు కరోనా వైరస్ సోకింది. ఈ విషయం జనవరి 30న నిర్ధారణ కావడంతో ఇక్కడ ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించారు. 39 రోజులపాటు పోరాడిన ఆమె పూర్తిగా కోలుకోవడంతో గత నెల 20న డిశ్చార్జ్ చేశారు. వ్యాధి పూర్తిగా తగ్గినప్పటికీ ఆమెను 14 రోజులపాటు ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు కోరారు. ఆ గడువు కూడా పూర్తికావడంతో ఆమె జనజీవనంలోకి వచ్చింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఐసోలేషన్ వార్డులో ఒంటరిగా గడపడం అంత సులువేమీ కాదని అదో భయానక అనుభవమని పేర్కొంది. 'సుదీర్ఘ కాలంపాటు ఐసోలేషన్ వార్డులో ఉండడం అంత ఈజీ కాదు. కానీ.. ఆరోగ్య నిపుణులు నిత్యం నాతో మాట్లాడారు. నాలో మానసిక ధైర్యం నింపారు' అని తెలిపింది. 'చైనాలో కరోనా బాధితులు కోలుకున్నారని విన్నాను. నేను కూడా శారీరకంగా బలంగానే ఉన్నాను. కాబట్టి నేను కూడా తప్పకుండా కోలుకుంటానని భావించాను' అని చెప్పింది.

### చైనా నుంచి వచ్చిన టెకీ కోసం గాలింపు

చిత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా ఎర్రావారిపాలెం మండలం నెరబైలుకు చెందిన ఒక వ్యక్తికోసం అధికారులు గాలిస్తున్నారు.గ్రామానికి చెందిన కుండ్ల గిరిధర్ చైనాలో ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.గత నెల 25న మన దేశానికి తిరిగివచ్చిన ఆయన బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగాక కన్పించకుండా పోయారు. ఈ విషయం తెలియడంతో వైద్యశాఖ అధికారులు ఆయనకోసం గ్రామంలో విచారించారు.ఈ విషయమై వైద్య, పోలీసు శాఖల ఉన్నతాధికారులను సంప్రదించగా.. అలాంటిదేదీ తమ దృష్టికి రాలేదని చెప్పారు.

## బడిలో దడ

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కాలేజీలకు కరోనా గుబులు పట్టుకుంది. ఎక్కడ ఏ విద్యార్థికి వైరస్ సోకుతుందోననే ఆందోళన నెలకొంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు హైరానా పడుతున్నాయి. ముఖ్యంగా విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, సికింద్రాబాద్ ప్రాంతాలతోపాటు నగర శివారు ప్రాంతాల్లో మరింత టెన్షన్ నెలకొంది. ఈ ప్రాంతాల్లో వందల సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు ఉండటం, వాటిలో లక్షల మంది విద్యార్థులు ఉండటమే ఇందుకు కారణం. హైదరాబాద్‌లోనే కావడంతో తమ పిల్లల్ని స్కూళ్లకు, కాలేజీలకు పంపించేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. యాజమాన్యాలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా జ్వరం, జలుబుతోపాటు ఏ ఇతర చిన్నపాటి అనారోగ్యం ఉన్నా.. ఆ పిల్లల్ని స్కూళ్లకు, కాలేజీలకు పంపించొద్దని తల్లిదండ్రులను కోరుతున్నాయి. అలాగే, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు మాస్కులు ధరించి హాజరయ్యేందుకు ఇంటర్‌బోర్డు అనుమతినిచ్చింది. ప్లెయిన్ వాటర్ బాటిళ్లను కూడా అనుమతించాలని నిర్ణయించింది. ఇంటర్‌బోర్డుతో పాటు సీబీఎస్ఈ కూడా ఇదే తరహా నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాస్కులు ధరించాలని పేర్కొన్నారు.

### ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉచితంగా చికిత్స

కరోనా ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుకు 22 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ముందుకొచ్చాయి. చికిత్సను కూడా ఉచితంగా అందించేందుకు అంగీకరించాయి. ఈ 22 కాలేజీల్లో మొత్తం 1080 ఐసోలేషన్ బెడ్స్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించాయి. కరోనాను పర్యవేక్షించేందుకు గురువారం నుంచి కమాండ్ కంట్రోల్ కేంద్రం పని చేయనుంది. ఐఏఎస్‌ల నేతృత్వంలో 6 ప్రత్యేక కమిటీలు వేసింది.

## మేకపాటి ఢిల్లీ పర్యటన రద్దు

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ భయంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఢిల్లీ పర్యటన రద్దయింది. కరోనా ప్రభావంతో రాజధానిలో హై అలర్ట్ ప్రకటించడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంత్రి పర్యటన రద్దు చేసుకున్నట్టు ప్రకటించారు. గురు, శుక్రవారాల్లో మంత్రి మేకపాటి బృందం కేంద్ర మంత్రులు, ప్రభుత్వ రంగ సంస్థల ఎండీలను కలిసేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉంది. ఆ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.

# రాష్ట్రంలో భయం.. భయం





శ్రీకాకుళం జిల్లాలో కరోనా అనుమానితులకు చికిత్స చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది; గన్నవరం ఎయిర్‌పోర్టులో సిబ్బందికి వైద్య పరీక్షలు

▸ వేర్వేరు జిల్లాల్లో 11మంది అనుమానితులు

▸ విశాఖలో ఐదుగురు, సిక్కోలులో ముగ్గురు

▸ ఐసోలేషన్ వార్డుల్లో కొత్తగా 200 పడకలు

▸ మాస్కుల కొరత ఉందంటున్న వైద్యులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రపంచ వ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న కరోనా వైరస్ రాష్ట్రంలోనూ అలజడి సృష్టిస్తోంది. బుధవారం ఒక్కరోజే వేర్వేరు జిల్లాల్లో 11మంది అనుమానితులు వ్యాధి లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరారు. విశాఖపట్నంలో 5, శ్రీకాకుళంలో 3, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున అనుమానిత కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన విజయవాడకు చెందిన ఓ ఉద్యోగి తీవ్ర జలుబుతో బాధపడుతూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చారు. ఇటీవల జర్మనీలో 15రోజులు బసచేసిన ఆయన బెంగళూరు, హైదరాబాద్ మధ్య విమానంలోనూ ప్రయాణించారు. అప్పటినుంచి జలుబుతో బాధపడుతున్న తనకు కరోనా సోకిందన్న అనుమానం ఉందని చెప్పడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆయన నుంచి సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్, పుణెకు పంపారు. ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విశాఖపట్నంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కౌలాలంపూర్ పర్యటనకు వెళ్లి మంగళవారం రాత్రి విమానాశ్రయంలో దిగారు. జ్వరం, జలుబుతో బాధపడుతున్న వారిని ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డుకు తరలించారు. కాగా, నగరంలో నివాసం ఉంటున్న ఓ యువతి(23) బహ్రెయిన్‌లో కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి గతనెల 28న తిరిగొచ్చింది. అప్పటినుంచి దగ్గు, గొంతునొప్పి, జలుబుతో బాధపడుతోంది. బుధవారం ఆమె తన స్నేహితుడితో కలిసి ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రికి వచ్చింది. సదరు యువకుడిలోనూ వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఇద్దరినీ కరోనా వార్డులో చేర్చారు. ఈ ఐదుగురి నుంచి సేకరించిన నమూనాలను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి పంపించారు. శ్రీకాకుళం జిల్లా కంచిలిమండలం ఏఎస్ పల్లి, కర్తలి, బెలుపాడ గ్రామాలకు చెందిన నలుగురు కువైట్‌లో ఉంటున్నారు. బుధవారం స్వగ్రామాలకు తిరిగొచ్చిన వీరిలో ముగ్గురికి తీవ్ర జలుబు, దగ్గు ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. వీరినుంచి నమూనాలు సేకరించి పుణెకు పంపారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం వాసి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలో నెలరోజులు ఉన్న ఆయన గతనెల 29న ముమ్మిడివరం మండలం ఠాణేల్లంక పంచాయతీ గోదాశివారిపాలెంలోని అత్తారింటికి వచ్చారు. ఆయనకు కరోనా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. రాజోలుకు చెందిన తాపీ మేస్త్రీ రెండున్నరేళ్లుగా మస్కట్‌లో ఉంటున్నాడు. గతనెల 18న తిరిగొచ్చిన ఆయన దగ్గు, జ్వరంతో బాధపడుతూ అత్తగారి ఊరైన పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం బి.కొండేపాడులో ఆర్ఎంపీ దగ్గర వైద్యం చేయించుకుంటున్నాడు. ఈ సమాచారం అందుకున్న ముదునూరు పీహెచ్‌సీ సిబ్బంది ఆయన్ను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని ప్రత్యేక వార్డుకు తరలించారు.

### ఆరోగ్యశాఖ అప్రమత్తం

కరోనా వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. మంగళవారం నాటికి 11మంది అనుమానితుల నమూనాలు సేకరించగా వారందరి రిపోర్టులు నెగిటివ్ వచ్చాయి. కరోనా విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు మార్గదర్శకాలను ఖరారు చేసి, ఆస్పత్రులకు పంపించారు. 13 జిల్లాల్లో ఐసోలేషన్ వార్డుల్లో మంగళవారం వరకూ 450 పడకలు అందుబాటులో ఉండగా బుధవారం మరో 200 పడకలను పెంచారు. మందుల కొరత లేదని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. అధికారులు బాడీమాస్కులు ఉన్నాయని చెబుతున్నారు. కానీ పర్సనల్ ప్రొటెక్షన్ మాస్కులు మాత్రం అందుబాటులో లేవు.

### తిరుపతిలో వీఆర్‌డీఎల్ ల్యాబ్

రాష్ట్రంలో వైరస్ రీసెర్చ్ అండ్ డయాగ్నొస్టిక్ ల్యాబ్(వీఆర్‌డీఎల్) ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. ప్రస్తుతం కరోనా నిర్ధారణకు రక్త నమూనాలను పుణె, హైదరాబాద్ పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీలోని తిరుపతి, విజయవాడ, కాకినాడల్లో ల్యాబ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. పరిశీలించిన కేంద్రం తిరుపతిలో ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఐసీఎంఆర్ బృందం ఇప్పటికే తిరుపతికి వెళ్లి అక్కడి పరికరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. వచ్చే సోమవారం నుంచి ఏపీలోనే కరోనా పరీక్షలు చేసుకునే వెసులుబాటు వస్తుందని, దీనివల్ల కేవలం 12గంటల వ్యవధిలోనే రిపోర్టులు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

### భయం అక్కర్లేదు: మంత్రి ఆళ్ల నాని

కరోనా వ్యాప్తికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలే తప్ప ఎవరూ భయపడాల్సిన పనిలేదని మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకుందని వెల్లడించారు. కాగా, కరోనా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ నీలం సాహ్ని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 2ప్రాంతాల్లో క్వారంటైన్ ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు భవనాలు గుర్తించాలని ఆదేశించారు. ఈనెల 6న ఢిల్లీలో జాతీయస్థాయిలో, 9న రాష్ట్ర స్థాయిలో కరోనా వైరస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు.

# దేశంలో 29కి చేరిన కరోనా కేసులు

తాజాగా 14 మంది ఇటలీ పర్యాటకులకు, ఢిల్లీ వ్యక్తి ద్వారా బంధువులు ఆరుగురికి సోకిన వైరస్

▸ గురుగావ్ పేటీఎం ఉద్యోగికీ పాజిటివ్

▸ దేశంలో మరో 19 ల్యాబ్‌ల ఏర్పాటు

▸ కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 4: దేశంలో కరోనా వైరస్ (కొవిడ్-19) కేసుల సంఖ్య 28కి చేరింది. వీరిలో 16 మంది ఇటలీకి చెందిన పర్యాటకులు ఉన్నారు. ఇకపై అంతర్జాతీయ ప్రయాణికులు అందరికీ విమానాశ్రయాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు 12 దేశాల నుంచి వచ్చే వారికే 'స్క్రీనింగ్' నిర్వహిస్తున్నారు. కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించేందుకు దేశంలో ప్రస్తుతం 15 ల్యాబ్‌లు ఉండగా మరో 19 ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో ఏడెనిమిది మంగళవారం నుంచే పని చేయడం ప్రారంభించాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డుల సంఖ్య పెంచాలని ఆయన కోరారు. దేశంలో కరోనా కేసుల వివరాలను విలేకరులకు తెలిపారు. కరోనా సోకిన ఢిల్లీ మయూర్ విహార్‌కు చెందిన 45 ఏళ్ల వ్యక్తి ద్వారా ఆగ్రాకు చెందిన ఆరుగురు బంధువులు వైరస్ బారినపడ్డారని తేలింది. వీరికి సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇటలీ పర్యాటకులు 16 మందితో పాటు వారికి డ్రైవర్‌గా పనిచేసిన స్థానికుడికి కొవిడ్-19 సోకినట్లు నిర్ధారణ అయింది. ఇటలీ బృందంలో మొదట కరోనా సోకిన 69 ఏళ్ల వ్యక్తి, అతని భార్యకు జైపూర్‌లోని ఎస్ఎంఎస్ ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నారు. మిగతావారిని గురుగావ్‌లోని ఆస్పత్రికి, డ్రైవర్‌ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం వరకు వీరు చావ్లాలోని ఐటీబీపీ శిబిరంలో ఉన్నారు. గురుగావ్‌కు చెందిన పేటీఎం ఉద్యోగికి కరోనా పాజిటివ్‌గా తేలినట్లు అధికారులు తెలిపారు. గత నెల 21 నుంచి 28 వరకు రాజస్థాన్‌లో పర్యటించిన ఈ బృందం కనీసం 215 మందితో సన్నిహితంగా మెలిగినట్లు గుర్తించామని ఆ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. "వీరిలో 93మంది శాంపిల్స్‌ను సేకరించాం. పరీక్షల్లో 51 మందికి వైరస్ సోకలేదని తేలింది. మిగతావారి రిపోర్టులు రావలసి ఉంది" అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రఘుశర్మ వెలడించారు. ఢిల్లీ వ్యక్తితో సన్నిహితంగా మెలిగినట్లు గుర్తించిన వారికి కూడా స్క్రీనింగ్‌కు చర్యలు చేపట్టామని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. "ఇప్పటి వరకు విమానాశ్రయాల్లో ఆరు లక్షల మందికి, నౌకాశ్రయాల్లో 15 వేల మందికి, నేపాల్, భూటాన్, మయన్మార్ నుంచి వచ్చే 10 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. 27 వేల మందికి పైగా సామాజిక పర్యవేక్షణలో ఉన్నారు"ని హర్షవర్ధన్ వివరించారు. కరోనా సోకిన వ్యక్తుల ఇంటికి 3 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న వారి వద్దకు అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇరాన్‌లో ఉన్న భారతీయులను తీసుకువచ్చేముందు వారికి కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించేందుకు అక్కడే ల్యాబ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి హర్షవర్ధన్



### విదేశాల్లో మనవాళ్లు 17 మందికి

ఇతర దేశాల్లో 17 మంది భారతీయులకు కరోనా సోకిందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ తెలిపారు. కరోనా సోకిన ఢిల్లీ వ్యక్తితో సన్నిహితంగా మెలిగిన నొయిడాకు చెందిన ఆరుగురికి వైరస్ సోకలేదని పరీక్షల్లో తేలింది.

### అందరూ మాస్కులు పెట్టుకోక్కర్లేదు: జావడేకర్

"కరోనాను అడ్డుకోవడానికి మాస్కులు ధరించడం ఒక్కటే మార్గం కాదు. అందరూ మాస్కులు పెట్టుకోవాల్సిన అవసరం లేదు" అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, జన సమూహంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం, కరచాలనం బదులు నమస్కరించడం వంటివి కరోనా కట్టడికి ఇతర మార్గాలని చెప్పారు. మాస్కులకు, హ్యాండ్ శానిటైజర్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో జావడేకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రధాని మోదీ ప్రతి రోజూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు.

### దేశంలో కరోనాపై భయం సృష్టించే యత్నాలు: మమత

కోల్‌కతా: ఢిల్లీ ఘర్షణల నుంచి దృష్టి మరల్చడానికి దేశంలో కరోనా వైరస్ గురించి భయాందోళన సృష్టించేందుకు కొందరు వ్యక్తులు, చానళ్లు ప్రయత్నిస్తున్నాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఢిల్లీలో ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు హింస వల్ల చనిపోయారని, వైరస్ వల్ల కాదని ఆమె వ్యాఖ్యానించారు.

## పుష్కరం క్రితమే కరోనా!

▸ 'ఎండ్ ఆఫ్ ది డే' పుస్తకంలో ప్రస్తావన

▸ మరో రెండు నవలల్లోనూ వైరస్ గురించి హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 4 : కరోనా వైరస్ గురించి ముందే ఊహించారా? దేశదేశాలకూ పాకుతున్న ఈ వైరస్‌కు సంబంధించి రచయిత్రి సిల్వియా బ్రౌన్ పుష్కర కాలం క్రితమే హెచ్చరించారా? కరోనా లాంటి వైరస్ గురించి గతంలో ఎప్పుడో వెలువడిన కాల్పనిక సాహిత్యం ఇప్పుడు విస్తృతంగా ప్రచారంలోకి వస్తోంది. బ్రౌన్ రచించిన 'ఎండ్ ఆఫ్ ది డే'లో ప్రస్తావించిన అంశాలు 'కొవిడ్-19'కి దగ్గరగా ఉండటం విశేషం. '2020 ప్రాంతంలో న్యుమోనియా తరహా అనారోగ్యం ప్రపంచాన్ని కబళిస్తుంది. ఊపిరితిత్తులపై దెబ్బతీసే వైరస్ ప్రబలుతుంది' అని రచయిత్రి ఆ పుస్తకంలో వివరించారు. 1981లో విడుదలైన 'ది ఐస్ ఆఫ్ ది డార్క్‌నెస్' నవలలోనూ కరోనా తరహా వైరస్ ప్రస్తావనకు వచ్చినట్టు సోషల్‌మీడియా లో వైరలైంది. దాదాపు నలభై ఏళ్ల నాటి ఈ క్రైంథిల్లర్ నవలలో రచయిత డీన్ కూంట్జ్.. 'వూహాన్-400' అనే జీవాయుధాన్ని ప్రయోగశాలలో రూపొందించినట్టు చెబుతారు. ఓ నగరాన్ని లేదా దేశాన్ని కబళించగల శక్తి ఆ వైరస్‌కు ఉంటుందని కూడా నవలలో పేర్కొనడం గమనార్హం. హాంగ్‌కాంగ్‌లో ప్రబలిన వైరస్ ఇతివృత్తంగా 2011లో ఓ సినిమా విడుదలైంది. ఎంఈవీ-1 అనే వైరస్ 20 శాతం జనాభాను మింగేసినట్టు అందులో చిత్రీకరించారు.

## మాస్క్ ధర మూడింతలు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో మాస్కుల ధరలు ఒక్కసారిగా రెక్కలు తొడిగాయి. మంచి నాణ్యత గల ఎన్-95 మాస్కుల ధర ఇంతకుముందు రూ.150 దాకా ఉండగా.. ఇప్పుడది ఏకంగా రూ.400 పలుకుతోంది. విక్రయదారులు ఇదే అదునుగా.. దాని పైనున్న ధరలను చెరిపేసి మరీ అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇంతక్రితం రూ.5 పలికిన సాధారణ మాస్క్ ధర.. ఇప్పుడు రూ.50కి పెరిగింది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అందరికీ మాస్కులను ఉచితంగా సరఫరా చేయాలని ఈ సందర్భంగా ప్రజలు కోరారు. ఇదిలా ఉండగా కరోనా పాజిటివ్ వచ్చిన వారే ఎన్-95 మాస్కులు ధరించాలని, ఇతరులకు అంత అవసరం లేదని శ్వాస ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విష్ణునరావు తెలిపారు. మాస్కులు లేని పరిస్థితుల్లో చేతి రుమాలు, సాధారణ క్లాత్‌లు వాడినా సరిపోతుందన్నారు.

## రిజర్వ్‌డేకు ఐసీసీ నో

**సిడ్నీ:** సెమీఫైనల్‌కు రిజర్వ్ డే ఉండాలన్న క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. 'టోర్నీ నిబంధనలలో సెమీస్‌కు రిజర్వ్ డే లేదు. ఆ నిర్ణయాన్ని మేం గౌరవిస్తున్నాం. వాతావరణ సూచన ఆందోళనకరంగా ఉంది. అయితే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో డ్రైనేజీ వ్యవస్థ చక్కగా ఉండడంతో వర్షం వచ్చినా మ్యాచ్ నిర్వహించగల మనే ఆశాభావంతో ఉన్నాం' అని సీఏ చీఫ్ కెవిన్ రాబర్ట్స్ అన్నారు.

**పూనమ్ కీలకం**

భారత్‌ను నిలువరించాలంటే స్పిన్నర్లను.. ముఖ్యంగా పూనమ్ యాదవ్‌ను ఎదుర్కోవడం కీలకం. ఆమెను ఎలా ఆడాలన్న విషయమై తీవ్రంగా ప్రాక్టీస్ చేశాం. ఆమె బౌలింగ్‌ను ఆడేందుకు సిద్ధమై రావడం వల్ల గత టీ20 వరల్డ్‌కప్‌లో పూనమ్‌ను సమర్థంగా అడ్డుకున్నాం. **-హీథర్ నైట్**



సునీల్ జోషి

**భారత క్రికెట్ చీఫ్ సెలెక్టర్‌గా టీమిండియా మాజీ ఆటగాడు సునీల్ జోషి ఎంపికయ్యాడు. ఎమ్మెస్కే ప్రసాద్ స్థానాన్ని జోషి భర్తీ చేయనున్నాడు. సెలెక్టర్‌గా గగన్ ఖోడా స్థానంలో హర్విందర్‌ను ఎంపిక చేశారు. దీంతో శివరామకృష్ణన్, వెంకటేష్ ప్రసాద్, రాజేష్ చౌహాన్‌కు నిరాశే ఎదురైంది. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును జోషి ప్యానెల్ ఎంపిక చేయనుంది.**

# సునీల్ జోషికి సెలెక్షన్ పగ్గాలు

**సెలెక్టర్‌గా హర్విందర్ ● ఎంపిక చేసిన సీఏసీ**



హర్విందర్

**ముంబై:** టీమిండియా మాజీ స్పిన్నర్, కర్ణాటకకు చెందిన సునీల్ బండాచార్య జోషి.. జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా ఎంపికయ్యాడు. ఐదుగురు సభ్యుల సెలెక్షన్ ప్యానెల్‌లో మాజీ పేసర్ హర్విందర్ సింగ్‌కు కూడా చోటుదక్కింది. సెలెక్షన్ ప్యానెల్‌లో ఖాళీ అయిన రెండు స్థానాల భర్తీ కోసం బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో మదన్‌లాల్, ఆర్పీ సింగ్, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) వీరిద్దరిని ఎంపిక చేసింది. ఎమ్మెస్కే ప్రసాద్ (సౌత్ జోన్) స్థానాన్ని జోషి భర్తీ చేయనున్నాడు. చైర్మన్‌గా జోషిని కమిటీ సిఫారసు చేసిందని బీసీసీఐ కార్యదర్శి జై షా ఓ ప్రకటనలో తెలిపారు. అయితే, గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది తర్వాత సెలెక్షన్ ప్యానెల్ పనితీరును సీఏసీ సమీక్షించి.. తగిన సూచనలు చేయనుంది. సెంట్రల్ జోన్ నుంచి ఎంపికైన హర్విందర్.. ప్యానెల్‌లో గగన్ ఖోడా స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. జతిన్ పరంజపే (వెస్ట్), దేవంగ్ గాంధీ (ఈస్ట్), శరణ్‌దీప్ సింగ్ (నార్త్) పదవీ కాలం పూర్తయ్యే వరకు కొనసాగనున్నారు. సెలెక్టర్ల కోసం మొత్తం 40 దరఖాస్తులు అందగా.. ఇంటర్వ్యూ కోసం ఐదుగురు.. సునీల్ జోషి, హర్విందర్ సింగ్, వెంకటేష్ ప్రసాద్, రాజేష్ చౌహాన్, లక్ష్మణ్ శివరామకృష్ణన్‌ను షార్ట్ లిస్ట్ చేశారు. అజిత్ అగార్కర్, నయన్ మోంగియా కూడా దరఖాస్తు చేసినా పక్కనబెట్టారు. మిగిలిన సెలెక్టర్ల పదవీ కాలం సెప్టెంబరుతో ముగియనుండడంతో అప్పుడు వీరిని పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉంది. సెలెక్టర్ల ఎంపికలో బీసీసీఐ జోన్ పాలసీకి స్పష్టంగా కట్టుబడింది. ప్రసాద్, ఖోడాలు 2015లో సెలెక్టర్లుగా ఎంపికయ్యారు. గత నవంబరులో వారి పదవీ కాలాన్ని పొడిగించారు. 49 ఏళ్ల సునీల్ జోషి 1996-2001 మధ్య 15 టెస్టులు, 69 వన్డేల్లో టీమిండియాకు ప్రాతినిథ్యం వహించాడు. 42 ఏళ్ల హర్విందర్ 1998-2001 మధ్య 3 టెస్టులు, 16 వన్డేలు ఆడాడు.

**ఆలోచనల్లో స్పష్టత ఉంది: సీఏసీ హెడ్ మదన్‌లాల్**

అత్యుత్తమ వ్యక్తులనే ఎంపిక చేశాం. వారి ఆలోచనల్లో స్పష్టత ఉంది. ముక్కుసూటిగా వ్యవహరించే జోషి తత్వం మాకు నచ్చింది. మూడు ఫార్మాట్లలో అతడి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నాం. ఎంపికలో బోర్డు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఎంతో స్వేచ్ఛనిచ్చాడు. ఎటువంటి సూచనలూ చేయలేదు.

### ధోనీ భవిష్యత్ ఏంటి?

సెలెక్టర్ల పోస్టు కోసం ఇంటర్వ్యూకు వచ్చిన ఐదుగురు అభ్యర్థులకు ఎదురైన అతి క్లిష్టమైన, సున్నితమైన ప్రశ్న 'ధోనీ భవిష్యత్‌పై మీ నిర్ణయం ఏంటి?'. వరల్డ్‌కప్‌లో టీమిండియా సెమీస్‌లో ఓడిన తర్వాత ధోనీ మళ్లీ బ్యాట్ పట్టలేదు. 'ధోనీని టీ20 వరల్డ్‌కప్‌కు ఎంపిక చేస్తారా? లేదా? అనే కామన్ క్వశ్చన్‌ను అడిగార'ని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. దీనిని బట్టి ధోనీ టీమిండియాకు ఆడే విషయంలో కొత్త ప్యానెల్ స్పష్టమైన విధానంతో ఉండాలని బోర్డు భావిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, కొందరిని మాత్రం చైర్మన్ పోస్టు కావాలా? లేదా సభ్యుడిగానైనా ఓకేనా? అని కూడా సీఏసీ ప్రశ్నించినట్టు సమాచారం. సెలెక్షన్ కమిటీ చైర్మన్ పోస్టుకు శివరామకృష్ణన్ గట్టి పోటీదారుగా భావించారు. అయితే, అతడు సెలెక్టర్‌గా కొనసాగడానికి అంతగా ఆసక్తి చూపలేదని సీఏసీ భావించినట్టు తెలిసింది. కాగా, జోషి మాత్రం ఎవరితోనైనా పని చేయడానికి ఎటువంటి ఇబ్బందీ లేదని స్పష్టం చేసినట్టు మదన్‌లాల్ తెలిపాడు.



మదన్‌లాల్

# ఆట అదరాలి... ఫైనల్ చేరాలి!

**ఇంగ్లండ్‌తో భారత్ సెమీస్ నేడు**

● మ్యాచ్‌కు వర్షం ముప్పు
● టీ20 వరల్డ్‌కప్



హీథర్‌నైట్

హర్మన్ ప్రీత్ కౌర్

**4** గత పది సంవత్సరాల్లో ఇంగ్లండ్‌తో 19 టీ20 మ్యాచ్‌ల్లో తలపడిన భారత్ నాలుగింటిలో నెగ్గి, 15 ఓడింది.

**5** టీ20 వరల్డ్‌కప్‌లలో భారత్‌పై ఇంగ్లండ్ విజయాల సంఖ్య. 2009, 2012, 2014, 2016, 2018 వరల్డ్‌కప్‌లలో ఇంగ్లండ్ నెగ్గింది.

**ఈ మెగా టోర్నమెంట్‌లో భారత జట్టు ఇప్పటివరకు అజేయం..తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన ఉత్సాహంతో వరుస విజయాలు సాధిస్తూ ప్రతిష్ఠాత్మక ట్రోఫీకి రెండు అడుగుల దూరంలో నిలిచింది.. సెమీఫైనల్ ప్రత్యర్థి ఇంగ్లండ్ గట్టి జట్టయినా ఇదే ఊపులో మరో గెలుపు అందుకోవడం కష్టమేమీ కాకపోవచ్చు..తొలిసారి ఫైనల్ చేరాలన్న ఆకాంక్ష... ఆపై ట్రోఫీతో చరిత్ర సృష్టించాలన్న పట్టుదల కలగలిసిన వేళ గురువారం జరిగే మ్యాచ్‌కు హర్మన్‌ప్రీత్ సేన సిద్ధమైంది..అయితే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. రిజర్వ్ డే లేనందున పోటీ రద్దయితే భారత్ ఫైనల్‌కు చేరుతుంది..**

**ఉ.9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1,2లో..**

**సిడ్నీ:** వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు భారత జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. కానీ ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు షాకివ్వడంతో హర్మన్ సేన ఆత్మవిశ్వాసం ఒక్కసారిగా రెట్టింపైంది. ఆపై వరుస విజయాలతో గ్రూప్ టాపర్ (8 పాయింట్లు)గా నిలిచింది. తద్వారా టైటిల్ రేసులో గట్టి పోటీదారుగా దూసుకొచ్చింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లోనూ అదే ఆటతీరును ప్రదర్శించి మొదటిసారి ఫైనల్లో ప్రవేశించాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

**నెం. 1 బ్యాటర్ వర్సెస్ నెం.1 బౌలర్**

సెమీఫైనల్ పోరు ఇరుదేశాల అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. కారణం..వరల్డ్ నెంబర్ వన్ బ్యాట్స్‌వుమన్ వర్సెస్ వరల్డ్ నెంబర్ వన్ బౌలర్ పోరాటమే. ప్రపంచకప్ ప్రారంభానికి ముందు ఇలా వీరిద్దరి మధ్య ఫైట్ ఉంటుందని ఎవరూ ఊహించలేదు. కానీ గ్రూప్ దశ ముగిసే సరికి భారత చిచ్చరపిడుగు షఫాలీ వర్మ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్‌నకు దూసుకుపోయింది. ఇక ఇంగ్లండ్ లెఫ్టామ్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ బౌలర్లలో అగ్రస్థానానికి చేరింది. రెండు జట్లు సెమీస్‌కు చేరడంలో వీరిద్దరిదీ ముఖ్యపాత్ర. అయితే షఫాలీ-ఎకెల్‌స్టోన్ పోరాటం చూడాలంటే వరుణ దేవుడు కరుణించాలి. గురువారం సిడ్నీలో వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది.

**టాప్ ఫామ్‌లో భారత్...**

ఒకరిద్దరు మినహా భారత జట్టంతా టాప్ ఫామ్‌లో ఉంది. టీనేజ్ సంచలనం షఫాలీ బ్యాటింగ్‌లో అదరగొడుతోంది. నాలుగు ఇన్నింగ్స్‌లలో 161 రన్స్ చేసిన ఆమె..టీ20 బ్యాట్స్‌వుమెన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకుంది. 40.25 సగటుతో ఈసారి టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో 16 ఏళ్ల షఫాలీ మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్ బ్యాటర్స్ నటాలీ స్కివెర్ (202), హీథర్‌నైట్ (193) తొలి రెండుస్థానాల్లో ఉన్నారు. వన్‌డౌన్ బ్యాట్స్‌వుమన్ జెమీమా రోడ్రిగ్స్ కూడా చక్కటి ఫామ్‌లో ఉంది. ఆమె ఉపయోగకరమైన ఇన్నింగ్స్ ఆడుతున్నా..వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోతోంది. ఇక వేదా కృష్ణమూర్తి, శిఖా పాండే, రాధా యాదవ్‌లతో కూడిన మిడిలార్డర్ కష్ట సమయాల్లో ఆదుకుంటోంది. మరోవైపు జట్టులోని ఇద్దరు అత్యంత సీనియర్లు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఓపెనర్ స్మృతీ మంధాన ఇప్పటివరకు తమ స్థాయికి తగ్గట్టు రాణించలేదు. మరి కీలకమైన సెమీఫైనల్లో వారు బ్యాట్లు ఝుళిపిస్తారేమో చూడాలి. బౌలింగ్ విభాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్ నాలుగు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు పడగొట్టి టోర్నీలో టాప్ బౌలర్‌గా నిలిచింది. ఆమెకు మీడియం పేసర్ శిఖా పాండే (4 మ్యాచ్‌ల్లో 7 వికెట్లు) చక్కటి సహకారం అందిస్తోంది.

**ఇంగ్లండ్ బలం...బ్యాటింగ్**

మూడు విజయాలు ఒక పరాజయంతో గ్రూప్ 'బి'లో ఆరు పాయింట్లతో రెండో స్థానంతో ఇంగ్లండ్ సెమీస్‌కు క్వాలిఫై అయింది. ఆ జట్టు బలమంతా బ్యాటింగే. నటాలీ 67.33 సగటుతో మూడు హాఫ్ సెంచరీలతో 202 రన్స్ చేసింది. ఈమె జోరుకు భారత్ ఎలా కళ్లెం వేస్తుందో చూడాలి. బౌలింగ్‌లో స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (8 వికెట్లు), పేసర్ అన్యా ష్రబ్‌సోల్ (7 వికెట్లు) టోర్నీ టాప్ బౌలర్లలో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

**గత ప్రపంచకప్‌లో...**

కిందటిసారి వెస్టిండీస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో హర్మన్‌సేనతో తలపడినప్పుడు ఇంగ్లండ్ 8 వికెట్లతో నెగ్గింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్..19.3 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ హీథర్‌నైట్ మూడు వికెట్లతో దెబ్బతీసింది. లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ ఛేదించింది. మిగిలిన నాలుగుసార్లు గ్రూప్ దశలో భారత్‌ను ఇంగ్లండ్ ఓడించింది. గత మెగా టోర్నీ సెమీస్‌లో ఓడిన భారత జట్టులోని ఏడుగురు ప్లేయర్లు ఇప్పుడూ ఉన్నారు. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని వారు తహతహలాడుతున్నారు. ఇక వరల్డ్ కప్‌నకు ముందు ఆస్ట్రేలియాలో జరిగిన ముక్కోణపు టోర్నీలో ఇంగ్లండ్‌పై విజయం సాధించడం భారత్‌కు సానుకూలాంశం.

**పిచ్/ వాతావరణం**

ఆస్ట్రేలియాలోని ఇతర మైదానాలకు భిన్నంగా సిడ్నీ వికెట్ సంప్రదాయంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లూ ఇక్కడే జరగనున్నాయి. కాగా..గత రెండు రోజులుగా ఇక్కడ భారీ వర్షం కురుస్తోంది. గురువారం కూడా వర్షం కురిసే అవకాశముంది.

**జట్లు (అంచనా)**

**భారత్:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), షఫాలీ వర్మ, స్మృతీ మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తిశర్మ, వేద కృష్ణమూర్తి, తానియా భాటియా (కీపర్), శిఖా పాండే, రాధా యాదవ్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్

**ఇంగ్లండ్:** హీథర్ నైట్ (కెప్టెన్), డానీ వ్యాట్, టామీ బ్యూమాంట్, నటాలీ స్కివెర్, ఫ్రాన్ విల్సన్, అమీ జోన్స్ (కీపర్), కేథరిన్ బ్రంట్, అన్యా ష్రబ్‌సోల్స్, మాడీ విలీర్స్, సోఫీ ఎకెల్‌స్టోన్, సారా గ్లెన్.

### వర్షంతో రద్దయితే భారత్, సౌతాఫ్రికా ఫైనల్‌కు

సిడ్నీలో గురువారం జరిగే రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లకూ వరుణుడి ముప్పు పొంచిఉంది. సాధారణంగా టీ20 మ్యాచ్‌లో ఫలితం రావాలంటే ఒక్కో జట్టు కనిష్ఠంగా ఐదు ఓవర్లు ఆడాలి. కానీ ఐసీసీ టోర్నీలకు నిబంధనలు భిన్నంగా ఉంటాయి. ఒక్కో జట్టు కనీసం 10 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది. అంటే..సెమీస్‌లో ఫలితం రావాలంటే ఒక్కో మ్యాచ్ 20 ఓవర్లు జరగాల్సి ఉంటుంది. అలాజరగకుంటే మ్యాచ్ రద్దవుతుంది. ఒకవేళ రెండు మ్యాచ్‌లూ రద్దయితే..రెండు గ్రూపుల్లో అగ్రస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరతాయి. అంటే గ్రూప్ 'ఎ' టాపర్ భారత్, గ్రూప్ 'బి'లో అగ్రస్థానంలో నిలిచిన సౌతాఫ్రికా ఆదివారం మెల్‌బోర్న్‌లో జరిగే ఫైనల్లో తలపడతాయి. అయితే ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది.



లానింగ్

నీకెర్క్

**మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1,2లో..**

## ఆస్ట్రేలియా x సౌతాఫ్రికా

రెండో సెమీస్‌లో.. గత టోర్నీ విజేత ఆస్ట్రేలియా జట్టు సౌతాఫ్రికాను ఢీకొనుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆసీస్..ఒడిదుడుకుల పయనంతో సెమీస్‌కు చేరింది. ఆరంభ మ్యాచ్‌లో భారత్ చేతిలో కంగుతిన్నది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ గాయపడి టోర్నీనుంచి వైదొలగడంతో ఎదురుదెబ్బ తగిలింది. వాటన్నింటినీ పక్కనబెట్టి సెమీస్‌లో సత్తా చాటి మరోసారి కప్ పట్టేయాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. మరోవైపు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో జయకేతనం ఎగురవేసిన దక్షిణాఫ్రికా అలవోకగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఆఖరి మ్యాచ్ వర్షంతో రద్దయినా..గ్రూప్ టాపర్‌గా నాకౌట్‌కు చేరింది. గత నాలుగు టీ20 ప్రపంచకప్‌లలో ఆసీస్‌ను ఎన్నడూ ఓడించని సౌతాఫ్రికా ఆ రికార్డును ఈసారి సవరించాలని పట్టుదలగా ఉంది.

## అగ్రస్థానానికి షఫాలీ

**ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్**



**సిడ్నీ:** భారత యువ సంచలనం షఫాలీ వర్మ ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ 16 ఏళ్ల డైనమైట్ ఓపెనర్ 761 పాయింట్లతో న్యూజిలాండ్ బ్యాట్స్‌ఉమన్ సుజి బేట్స్‌ను రెండో స్థానానికి నెట్టి తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకొంది. టీ20ల్లో భారత్ నుంచి మిథాలీరాజ్ తర్వాత ప్రథమ ర్యాంక్‌ను సాధించిన క్రికెటర్ షఫాలీనే కావడం విశేషం. స్మృతి మంధాన 6, జెమీమా రోడ్రిగ్స్ 9వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) 779 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, భారత్ నుంచి దీప్తి శర్మ (5), రాధా యాదవ్ (7), పూనమ్ యాదవ్ (8)కు టాప్-10లో చోటు లభించింది. ఆల్‌రౌండర్ల జాబితాలో సోఫీ డివైన్ (న్యూజిలాండ్) టాప్‌లో ఉండగా భారత్ నుంచి దీప్తి శర్మ (7) మాత్రమే టాప్-10లో చోటు దక్కించుకొంది. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా 290 రేటింగ్ పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, భారత్ 266 పాయింట్లతో 4వ స్థానంలో ఉంది.

# ఫైనల్లో సౌరాష్ట్ర

● 7 వికెట్లతో చెలరేగిన ఉనాద్కట్
● 92 పరుగులతో గుజరాత్‌పై గెలుపు



ఉనాద్కట్ (7/56)

**రాజ్‌కోట్:** నిరుటి రన్నరప్ సౌరాష్ట్ర మరోసారి రంజీ ట్రోఫీ ఫైనల్ చేరింది. కెప్టెన్ జయదేవ్ ఉనాద్కట్ (7/56) ఏడు వికెట్లతో చెలరేగడంతో సెమీఫైనల్లో సౌరాష్ట్ర 92 పరుగుల తేడాతో గుజరాత్‌పై గెలుపొందింది. ఈనెల 9నుంచి జరిగే ఫైనల్లో బెంగాల్‌తో సౌరాష్ట్ర తలపడనుంది. 327 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 7/1తో ఐదో రోజైన బుధవారం బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ 72.2 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో అదరగొట్టిన అర్పిత్ వసవాడ (139)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. అంతకుముందు సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 304, గుజరాత్ 252 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర 274, గుజరాత్ 234 రన్స్‌కు ఆలౌటయ్యాయి. కాగా ఒక రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఉనాద్కట్ 65 వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. అశుతోష్ అమన్ (బిహార్) 68 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు.



## కరోనా ఎఫెక్ట్..

### ఆసియా బ్యాడ్మింటన్ మనీలాలో..

**షాంఘై:** కరోనా మహమ్మారితో మరికొన్ని క్రీడా పోటీలు వాయిదాపడ్డాయి. చైనాలో ఈ వైరస్ బయటపడిన వుహాన్‌లో వచ్చేనెలలో ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరగాల్సి ఉంది. అయితే ఆ టోర్నీని ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాకు తరలిస్తున్నట్టు ఆసియా బ్యాడ్మింటన్ అధికారులు బుధవారం ప్రకటించారు. ఏప్రిల్ 21 నుంచి 26 వరకు జరిగే ఆ టోర్నీకి మనీలా ఆతిథ్యమివ్వనుంది.



**జువెంటస్-ఏసీ మిలాన్ మ్యాచ్..**

**ట్యూరిన్:** జువెంటస్-ఏసీ మిలాన్ జట్ల మధ్య జరగాల్సిన ఇటాలియన్ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌పైనా కరోనా ప్రభావం పడింది. ట్యూరిన్‌లో బుధవారం రాత్రి జరగాల్సిన ఈ మ్యాచ్‌ను రద్దు చేశారు.

**ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్..**

**టోక్యో:** రగ్బీ ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ ఇక్కడ జరగాల్సి ఉండగా..నిర్వాహకులు దాన్ని రద్దు చేశారు. వచ్చేనెల 25,26 తేదీలో జరగాల్సి ఉన్న ఈ పోటీలను కరోనా భయంతో రద్దు చేసినట్టు జపాన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ బుధవారం ప్రకటించింది.

**ఐపీఎల్‌కు ఆ భయం లేదు..గంగూలీ**

కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్నా దాని ముప్పు ఐపీఎల్‌కు ఉండబోదని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కూడా అన్నాడు. ఈనెల 29 ముంబైలో..చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్‌కు తెరలేవనుంది.

**ప్రొ.లీగ్ వాయిదా లేదు: హాకీ సమాఖ్య**

కరోనా కారణంగా ప్రొ.లీగ్‌ను వాయిదా వేసే ఆలోచన లేదని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) తెలిపింది. అయితే బెల్జియం, ఆస్ట్రేలియాలతో చైనా జట్టు స్వదేశంలో ఆడాల్సిన మ్యాచ్‌లను వాయిదా వేశారు.

## ఐపీఎల్ ప్రైజ్‌మనీ సగానికి కోత

**విజేతకు రూ. 20 కోట్ల నుంచి 10 కోట్లకు తగ్గింపు**

**పొదుపు చర్యల్లో బీసీసీఐ**

IPL 2020

**న్యూఢిల్లీ:** కాసులు కురిపించే ఐపీఎల్‌కు సంబంధించి బీసీసీఐ కఠిన నిర్ణయం తీసుకొంది. ఖర్చులు తగ్గించుకొనే చర్యల్లో భాగంగా ఈ నెల 29 నుంచి జరిగే 13వ ఐపీఎల్ ప్రైజ్‌మనీని సగానికి కోత వేసింది. ఇదే విషయాన్ని ఫ్రాంచైజీలకు తెలియజేసింది. గత సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన జట్టుకు రూ. 20 కోట్ల ప్రైజ్‌మనీ అందించగా.. ఈ సీజన్‌లో రూ. 10 కోట్లు మాత్రమే ఇవ్వనుంది. రన్నరప్‌గా నిలిచిన టీమ్‌కు రూ. 12.5 కోట్లకు బదులు రూ. 6.25 కోట్లు, క్వాలిఫయర్స్‌లో ఓడిన రెండు టీమ్‌లకు రూ. 4.3 కోట్ల చొప్పున ఇవ్వనున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. 'ఫ్రాంచైజీలు ఆర్థికంగా బలంగా ఉన్నాయి. స్పాన్సర్‌షిప్స్, ఇతర విధానాల్లో వారికి భారీ ఆదాయం సమకూరుతోంద'ని బోర్డు వర్గాలు తెలిపాయి.

**ఫ్రాంచైజీల అసంతృప్తి**

ప్రైజ్‌మనీ మొత్తాన్ని భారీగా తగ్గించడంపై ఎనిమిది ఫ్రాంచైజీలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. నిర్ణయం తీసుకొనే ముందు కనీస సమాచారం కూడా అందించలేదని ఆరోపిస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com